# వ్యాసకౌముది

## 2014-2015

## వ్యాసాలు



శ్రీ

కౌముది

మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 131

# విషయసూచిక


| ఏడాది | నెల | వ్యాసం పేరు | వ్యాస రచయిత(త్రి) | పేజి |
|---|---|---|---|---|
| 2014 | 2 | లల్లాదేవిగారి లకుమాదేవి | డా శిరీష ఈడ్పుగంటి | 3 |
| 2014 | 2 | అక్షరాలైన అభాగ్యుల వెతలు కె వరలక్ష్మి కథలు | నాగరాజు రామస్వామి | 7 |
| 2014 | 4 | సమీక్షకుడుగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి | డా శిరీష ఈడ్పుగంటి | 11 |
| 2014 | 5 | ప్రజాకవి కాళోజి | మండవ సుబ్బారావు | 15 |
| 2014 | 8 | చేరా ఒక చెరగని జ్ఞాపకం | శివ చరణ్ | 23 |
| 2014 | 8 | శత సంవత్సరాల కాళోజి కవిత్వ పరామర్శ | కాత్యాయనీ విద్మహే | 25 |
| 2014 | 10 | కవికి స్వవిమర్శా అవసరమే | కర్ల పాలెం హనుమంత రావు | 30 |
| 2014 | 12 | భారతీయేతర జానపద గాథలు – మానవ జీవితం | డా శిరీష ఈడ్పుగంటి | 32 |
| 2015 | 04 | "అ ఆ ల ఆ రామస్థలి" ఆమె కవిత | ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ | 42 |
| 2015 | 05 | మనుచరిత్రలో ప్రతిబింబించిన సంస్కృతీ సంప్రదాయాలు | డా(శ్రీమతి) ఎమ్ ప్రఫుల్ | 46 |
| 2015 | 06 | తెలుగులో చారిత్రక నవల | డా శిరీష | 49 |

వ్యాస కౌముది

# లల్లాదేవిగారి లకుమాదేవి

డా. శిరీష ఈడ్పుగంటి

sirishavr@gmail.com

రెడ్డిరాజులలో ఒకరైన కొమరగిరిరెడ్డి రాజుయొక్క ఆస్థానకర్తకి లకుమాదేవి. ఈమెను గూర్చి నాలుగైదు రచనలున్నాయి. వాటిలో ఒకటి లల్లాదేవిగారు రచించిన ***లకుమాదేవి*** నవల. ఈ నవలలో లల్లాదేవిగారు లకుమాదేవి పాత్రను తీర్చిదిద్దిన వైనాన్ని చిత్రిస్తున్నాను. లకుమాదేవిని గూర్చి తెలుసుకునే ముందుగా దేవదాసీ వ్యవస్థను గూర్చి తెలుసుకోవాలి. ఎందుకంటే లకుమాదేవి ఒక దేవదాసీ కుటుంబానికి చెందిన దేవదాసి, రాజనర్తకి.

భారతదేశం భిన్నసంస్కృతులకు నిలయం. మనదేశంలో లలితకళలకు దేవాలయాలు పట్టుగొమ్మలు. బ్రిటిషువారి హయంలో రాజులు దేవాలయాల అభివృద్ధికి కృషిచేశారు. ఆలయాల్లో వేకువజామున దేవుడికి మేలుకొలుపులు పాడడం నుంచి, రాత్రివేళ పవ్వళింపుసేవ వరకు నృత్యగానాలు ప్రదర్శించేవారు. ఇవన్ని చేయడానికి దేవాలయాలలో ప్రత్యేకించి మనుషులు కావాలి. ఇందుకుగాను అమ్మాయిల్ని దేవాలయాలకు దానం చేసేవారు. దేవుని సేవకు నియమింపబడిన ఈ అమ్మాయిని దేవదాసీ అని పిలిచేవారు. "భరతనాట్యంగా ప్రసిద్ధి పొందిన కళ కేవలం నృత్యం మాత్రమే. దీని అసలు పేరు సదిర్ లేదా దాసి''. (TELUGU SEVAKA. 2005, JULY) దేవదాసీగా మారిన అమ్మాయి భరతనాట్యం, సంగీతంవంటి కళలలో ప్రావీణ్యం సంపాదించి దేవాలయంలో ప్రదర్శిస్తుంది. "10, 11 శతాబ్దాలలో దేవాలయ నిర్మాణం వాటి పునరుద్ధరణ ఉన్నత స్థాయికి చేరుకుంది. దేవుళ్ళ పేరుతో వారి సేవకోసం దేవదాసీ సంప్రదాయం మొదలైంది. అందుకుగాను దేవదాసీలకు భూములను, నగదును ఇచ్చేవారు.'' (లలిత, వకుళాభరణం. 2007:31). ఊరికి మంచి జరుగుతుందనే భావంతో ఆరోజులలో బ్రాహ్మణ కుటుంబాలలోని ఒకఅమ్మాయిని దేవదాసీగా చేసేవారు. ఒకవేళ పిల్లలు లేకపోతే దత్తత తీసుకుని మరి వారిని దేవదాసీలుగా చేసేవారు. దేవదాసీలుగా మారిన అమ్మాయిలు కఠిన నియమాలు పాటించేవారు. ఎంతో నియమనిష్ఠలతో ఉండేవారు. దేవుని సేవకే అంకితమయ్యేవారు. ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో పూజాసమయంలో వీరు నాట్యం చేసేవారు. ఒడిషా పూరీజగన్నాథ దేవాలయంలోని దేవదాసీలకు పూర్వం ఎంతో విలువ ఉండేది. ఈ దేవదాసీలే తర్వాత రాజదాసీలుగా మారారు.

దేవదాసీలు రాజులు ఇచ్చిన మాన్యాలతో పొట్టపోసుకుంటూ నిరాడంబర జీవితం గడిపేవారు. కాలక్రమంలో వీరి నృత్యం ఆలయం నుంచి రాజాస్థానానికి మారింది. ఫలితంగా రాజులు వీరిని రాజనర్తకిలను చేశారు. రాజనర్తకిలు రాజ్యసభలలోనూ, రాజు అంత:పుర మందిరాలలోను నృత్యం చేసేవారు. రాజుకు ఉంపుడుగత్తెలుగా (రాజదాసీలుగా) ఉండేవారు. దాంతో వీరి జీవనవిధానంలో మార్పు వచ్చింది. విలాసాలకు, సౌఖ్యాలకు అలవాటు పడ్డారు. కాకతీయరాజులు దేవదాసీలను రాజదాసీలగా నియమించుకునేవారు. చాళుక్యరాజగు గుణగ విజయాదిత్యుని నాటి చెల్లవ్వ,

రెండవ అమ్మరాజు నాటి దామెకాంబ, రెండవ ప్రతాపరుద్రుని నాటి మాచల్దేవి, కొమరిగిరిరెడ్డి ఆస్థానంలో లకుమాదేవి, పల్నాటి వీరచరిత్రలో వర్ణింపబడిన కామభూవిభుని ఆస్థాననర్తకి కుంజలోచన మొదలైనవారంతా రాజనర్తకీమణులే. తదుపరికాలంలో రాయల ఆస్థానంలో రంజకం కుప్పాయి, రంగనాథ రాయల ఆస్థానంలో ముద్దుచంద్రరేఖ మొదలైనవారంతా రాజనర్తకి సంప్రదాయానికి చెందినవారే. నృత్యకళను ప్రచారంలోకి తీసుకొచ్చారు. అలాగే రాజస్థానంలో కవయిత్రులగా ఉంటూ రాజుకు భోగపత్నిలుగా కొంతమంది ఉన్నారు. 17 వ శతాబ్దంలో రంగాజమ్మ, 18 వ శతాబ్దంలో ముద్దుపళని వంటివారు రాజులకు భోగపత్నిలుగా జీవించారు. బెంగుళూరు నాగరత్నమ్మ మాత్రం తాను దేవదాసీనేనని ప్రతిచోట ఎంతో గర్వంగా చెప్పుకునేది. ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మిగారు కూడా దేవదాసీ కుటుంబం నుండి వచ్చినవారే. పూరీజగన్నాథస్వామి ఆలయంలో నేటికి ఇద్దరు దేవదాసీలు ఉన్నారు. వీరికి అక్కడ ఇప్పటికీ ఎంతో గౌరవం ఉంటుంది. వివాహం అయిన స్త్రీలు ఎంతోమంది వీరి దగ్గరకు వచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. కాని వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. రాజ్యాలు, జమీందారులు అంతరించిన పిదప దేవదాసీల పరిస్థితి దుర్భరమైంది.

దేవదాసీ సంప్రదాయం ప్రకారం ఒక వంశంలోని స్త్రీలలో తరానికొక్కరిని చొప్పున గుడిలోని దేవునికి పెళ్ళి చేసేవారు. ఆ స్త్రీ జీవితాంతం అవివాహితగానే ఉండాలి. మొదట్లో కేవలం బ్రాహ్మణ కుటుంబాలలో నుంచి మాత్రమే దేవదాసీలు ఉండేవారు. తర్వాత నిమ్నవర్గాల నుంచి కూడా వచ్చారు. దీనికి గల కారణం ఉన్నతవర్గాలు తక్కువ కులాల వారిని దేవాలయలలోనికి ప్రవేశించనివ్వకపోవడం. దాంతో తక్కువ కులాలవారు వారికోసం వారే దేవాలయాలు వారు నివశించే ప్రాంతాలలోనే నిర్మించుకోవడం మొదలుపెట్టారు. ఆ దేవాలయాలకు అమ్మాయిల్ని వారి జాతిలో నుంచే అర్పించేవారు. ఈవిధంగా నిమ్నవర్గాలలోనూ దేవదాసీలు వచ్చారు.

వైష్ణవమత సంప్రదాయంలో సమాజంలో మొట్టమొదట వచ్చినది దేవదాసీవ్యవస్థ. బ్రాహ్మణులు తమ ఆడపిల్లలనే దేవుళ్ళకు అంకితం చేసేవారు. తరువాత వచ్చిన వీరశైవమతం మానవులంతా సమానమే అని, అందరికి సమాన గౌరవం ఉండాలని ప్రతిపాదించింది. వీరశైవం కొన్ని విషయాలలో వైష్ణవమతాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. అలాంటి విషయాలలో ఒకటి దేవదాసీ పద్ధతిని అనుసరించారు. దేవదాసీ పద్ధతిలో బ్రాహ్మణులు తమ ఆడపిల్లలనే దేవుళ్ళకు అంకితం చేస్తే వీరశైవంలో శూద్రులు తమకంటే వెనుకబడి ఉన్న అంటరానివారినుంచి ఆడపిల్లలను దేవతలకు అంకితం చేసేవారు. వీరు కొలిచే గ్రామదేవతలు ఎల్లమ్మ, పోశమ్మ, మైసమ్మ మొదలైన ఆడదేవతలకు అమ్మాయిల్ని సమర్పించేవారు. వీరశైవంలో వచ్చిన ఈ వ్యవస్థే జోగినివ్యవస్థ. ఈ వ్యవస్థలోని జోగినులు రానురాను సెక్స్ వర్కర్లుగా మారారు. దీనికి గల కారణం శూద్రులు తమ ఆడపిల్లలనే జోగినులుగా చేసి ఉంటే దేవదాసీవ్యవస్థకు ప్రారంభంలో ఉన్న ప్రాధాన్యత జోగినీ వ్యవస్థకు కూడా ఉండేది. అలాకాకుండా మాల, మాదిగలను జోగినీలుగా చేయడం, వారిని దైవత్వానికి దాసీలుగా చేస్తున్నమనే పేరుతో ఊరికి ఉంపుడుగత్తెలుగా చేశారు. అంతేగాకుండా శైవసంప్రదాయంలో శివుణ్ని కొలవడంచేత శవయాత్రలో శ్మశానం వరకు జోగినుల చేత నృత్యం చేయిస్తారు.

ఒకప్పుడు దేవదాసీలన్న, దేవదాసీ కుటుంబాలన్నఎంతో గౌరవం ఉండేది. తర్వాత కాలంలో దేవాలయాలపై దాడులు జరిగి వీరి ఆలనపాలన కరువైంది. దారిద్ర్యం చేత దేవదాసీలు పోషణ నిమిత్తం వేశ్యవృత్తిని చేపట్టారు. దాంతో ఈ దేవదాసీ వ్యవస్థ దురాచారంగా మారింది. కాలక్రమంలో పెత్తందారీ విధానాల వలన దేవదాసీలను భోగవస్తువులుగానే పరిగణించడం మొదలైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది.

లల్లాదేవిగారి నవల ***లకుమాదేవి*** రచనలోని లకుమ పాత్ర గూర్చి కొన్ని విషయాలను ప్రస్తావిస్తూ, చర్చించాను. రాజనర్తకి లకుమ, లకుమాదేవి అయిన విధానాన్ని, దీనిద్వారా ఆమె తన ఆశయాన్ని నేరవేర్చుకున్న తీరును ఈ నవలలో చాలా చక్కగా చిత్రించారు. ఉన్నతాశాయాలు కలిగిన నాయికగా లకుమాదేవిని చూపించారు.

ఈ నవలలో లకుమ ఆశ్రమ వాతావరణంలో పెరిగిన అమ్మాయి. ఆమె వయసు పదకొండేళ్ళు. ప్రతిరోజు ఆశ్రమంలోని ఆలమందను మేతకు తోలుకెళుతుంది. ఆలమందలో ఒకచిన్న ఆవుపిల్లను కపిల అని పిలుచుకుంటుంది. కపిల అంటే లకుమకు ఎంతో ఇష్టం. ఆశ్రమపెద్ద కమలయోగిని.

ఈమెకు మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయంలో ఒకచిన్నపిల్ల, కొంతడబ్బు, నగలు, ఒక భూర్జపత్రం దొరుకుతుంది. భూర్జపత్రంలో ఆ పాపతల్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డబ్బు, నగలతో తన పాపను పెంచమని కోరుతూ రాస్తుంది. కమలయోగిని పాపను, భూర్జపత్రాన్ని ఆశ్రమానికి తీసుకొస్తుంది. ఆ పాపే లకుమ. చారిత్రకంగా చూస్తే ఈమె బాల్యానికి సంబంధించిన విషయాలు ఏమి తెలియవు. కాని ఈ నవలలో లకుమ బాల్యాన్ని చాలా చక్కగా చిత్రించారు. లకుమకు, కమలయోగినికి మధ్యగల ప్రేమానుబంధం గాఢమైనది. సాధారణంగా విరాగిణి, యోగినిగా మారినవారు ప్రేమ అప్యాయతలకు దూరంగా ఉంటారు. ఎటువంటి బంధాలు ఉండవు. ఆశ్రమంలోని మిగతావారితో కమలయోగిని అలాగే ఉంటుంది. ఒక్క లకుమతో తప్ప. లకుమ కమలయోగినిని అత్తయ్య అని పిలుస్తుంది. కమలయోగిని తన తర్వాత ఆశ్రమానికి లకుమను ఆశ్రమపెద్దగా చేయాలనుకుంటుంది. కాని లకుమ మనస్తత్వం పూర్తి భిన్నంగా ఉంటుంది. నాట్యం పట్ల ఆసక్తి కనబరుస్తుంది. ఒక దేవదాసీని నాట్యానికి సంబంధించిన విషయాలు అడుగుతుంది. నాట్యం నేర్చుకోవాలనే కుతూహలంతో ఉంటుంది. ఆశ్రమ వాతావరణంలో పెరిగిన లకుమకు నాట్యంపట్ల ఉన్న ఆసక్తిని చూసి కమలయోగిని ఆశ్చర్యపోతుంది.

రెడ్డిరాజులలో ఒకరైన కొమరిగిరిరెడ్డిరాజు నాట్య కళారాధకుడని, అందచందాలు కలిగినవాడని తెలుసుకుని అతన్ని మనసులోనే ఆరాధిస్తుంది. అతని దర్శనం కోసం ఎదురుచూస్తుంది. ఒకసారి కమలయోగిని అత్తయ్య ద్వారా కొమరిగిరిరెడ్డిరాజు దర్శనం చేసుకుంటుంది. తనకు ఎంతో ఇష్టమైన కపిల ఆవును రాజుకు కానుకగా ఇస్తుంది. ఆసందర్భంలో లకుమ మాట్లాడిన మాటలకు రాజు ఆకర్షితుడవుతాడు. నాట్యం నేర్చుకోవాలనే పట్టుదల చూసి ఒక నాట్యగురువును నియమిస్తాడు. ఇదంతా లకుమకు పదకొండేళ్ళ వయసులో జరుగుతుంది. నాట్యం నేర్చుకోవడం పూర్తవుతుంది. లకుమ మొదటసారిగా రంగస్థలం మీద నాట్యం చేయునపుడు ఆమెకు నాట్యం నేర్పిన గురువు కూడా ఆశ్చర్యపోవడం జరుగుతుంది. లకుమలో తను నేర్పిన దానికంటే అంతకుమించిన జన్మసంస్కారాలు పనిచేస్తున్నాయని అనుకుంటుంది నాట్యగురువు. లకుమ తల్లి ఒక దేవదాసీ, ఆస్థాననర్తకి కావాలనుకుంటుంది. అదే తపన కూతురిలోను కనిపిస్తుంది. అందుకే లకుమ నాట్యం నేర్చుకున్న తర్వాత రాజుగారి ఆస్థానంలో రాజనర్తకి కావాలనే ఆరాటపడుతుంది. వసంతరాజీయం అనే నాట్యశాస్త్రగ్రంథం రాయాలనే రాజుగారి కోరికను తన ఆశయంగా చేసుకుంటుంది. ఆ రచనలో రాజుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంది. ఈమె ప్రోత్సాహంతోనే రచన జరిగిందని చెప్పవచ్చు. ఈమెకు కళల పట్ల మక్కువ ఎక్కువ. కళాకారులను గౌరవిస్తుంది. ఆశ్రమానికి వచ్చిన శాంతివర్ధనుడనే శిల్పిని కూడా ఎంతగానో ప్రోత్సహిస్తుంది. రాజుగారి భవన నిర్మాణ సౌధాన్ని నిర్మించలేక శాంతివర్ధనుడు తిరిగి ఆశ్రమానికి వస్తాడు. ఆసమయంలో అతని ప్రతిభను అతనికి తెలియజేసి ఉత్సాహాన్ని కలిగిస్తుంది. తన రూపాన్ని శిల్పంగా మలచమంటుంది. ఈ శిల్పాన్ని శాంతివర్ధనుడు రాజుగారి ఉద్యానవనంలో ఉంచుతాడు. ఆ శిల్పాన్ని చూసిన రాజు ఆమె అందచందాలకు ఆకర్షితుడవుతాడు. ఆమె అపురూప సౌందర్యవతి. ఆమె మాట్లాడుతుంటే సంగీతంలా వినసొంపుగా ఉంటుంది. నడుస్తుంటే నాట్యం చేస్తుందా అన్నట్లు ఉంటుందట. చురకత్తి లాంటి చూపులు ఇవన్నీ లకుమలో ఉండడం వలన ఆమె ఎదుటి మనుషులను సులభంగా ఆకట్టుకుంటుంది. శాస్త్ర సంప్రదాయాలతో భరతకళను తెలిసిన నర్తకిని తన ఆస్థాన నర్తకిగా నియమిస్తే తాను రాయబోయే నాట్యశాస్త్రగ్రంథానికి ఆదర్శంగా ఉంటుందని, లక్షణ లక్ష్యాలను సమన్వయపరచి గ్రంథరచన చేయవచ్చునని రాజు ఆలోచిస్తున్న సమయంలో లకుమ గూర్చి తెలుస్తుంది. వెంటనే లకుమ నాట్యప్రదర్శన ఏర్పాటుచేయిస్తాడు. లకుమకు కూడా రాజుగారి ముందు నాట్యం చేయాలనే కోరిక తీరుతుంది. ఆమె నాట్య భంగిమలు రాజుగారి హృదయంలో ముద్రింపబడతాయి. వెంటనే ఆమెను ఆస్థాన నర్తకిగా చేసుకుంటాడు. లకుమ ఆస్థాన నర్తకి అయినప్పటికి ఎటువంటి అలంకారాలు లేకుండానే సాధారణ అమ్మాయిలానే ఉంటుంది. రాజు నగలు ఇచ్చిన తిరస్కరిస్తుంది. ఆయనను నాట్యశాస్త్ర గ్రంథరచన చేయమని ప్రేరేపిస్తుంది. రాజు ఆమెను ఉన్నతాదర్శం గలిగిన స్త్రీగా గౌరవిస్తాడు. ఆమె అభిప్రాయాలకు విలువనిస్తాడు.

ఈ నవలలో లకుమ సేవాదృక్పథం కలిగినది కూడా. ఒక వృద్ధురాలిని ఆదరిస్తుంది. రాజు దర్శనం కంటే వృద్ధురాలి సేవకే మొదటి ప్రాధాన్యతను ఇస్తుంది. అయితే తరువాత ఆమె తనతల్లి అని తెలిసి ఎంతో ఆనందపడుతుంది. ఈ నవలలో లకుమను గూర్చి కొమరగిరిరాజు అభిప్రాయలను కొన్నింటిని పుటంకించాను. 'లకుమ ఉన్నతమైన లక్ష్యాలతోనే వచ్చిందని గ్రహిస్తాడు. ఆమె శారీరకమైన ఆనందానికి ఏమాత్రం

విలువ ఇచ్చే మనిషి కాదు. ఆమె నాట్యంతో ఎటువంటి రసరమ్య లోకాలను ప్రత్యక్ష్యం చెయ్యగలదో తన వ్యక్తిత్వంతోనూ అలాగే అద్భుతాలను చూపగలదు. అటువంటి ఆకర్షణీయమైన అందచందాలు, అంతటి అద్భుతమైన పదచలనమూ, అంతటి అబ్బురమయిన వ్యక్తిత్వమూ ఒకేచోట త్రివేణీ సంగమంలా లకుమలో మూర్తీభవించాయి. రసహృదయుడైన పురుషుడు ఎవడు కూడా ఆమె వ్యక్తిత్వం ముందు ప్రణమిల్లకుండా ఉండలేడు. ఆమె ఔన్నత్యాన్ని అందుకోవడం కోసం ఒక్క రాణినే కాదు, ఈ రాజ్యాన్ని ఆఖరుకు తన ప్రాణాలను అర్పించాలనిపిస్తోంది.' అని రాజు అనుకుంటాడు. (లల్లాదేవి. 1982: 161,162) 'ఎంతో జన్మసంస్కారం ఉంటేకాని ఉన్నతమైన ఆశయాలకు అంకితమయిపోవాలన్న ఆలోచన మనసుకు రాదు. నీ సంస్కారమే నిన్ను పవిత్రంగా కాపాడుతుందని' రాజగురువు లకుమతో అంటాడు. (లల్లాదేవి. 1982: 168) 'నీవు ఆస్థానసర్తకివి అయివుండి లాలనలకు దూరంగా వుంటున్నావు. ఇంతటి తాత్వికురాలయిన స్త్రీ ఒక ఆస్థానసర్తకి కావటం చరిత్రలో ఇదే ప్రథమం' అని రాజు లకుమతో అంటాడు. (లల్లాదేవి. 1982: 183) వీటిని బట్టి లకుమ వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుసుకోవచ్చు. నాట్యశాస్త్రరచనలో రాజు తనకి లకుమకు ఏకాంతం కావాలనుకుంటాడు. ఏకాంతం ప్రణయానికి దారితీస్తుందని ముందుగా రాజును పెళ్ళి చేసుకోమని అడుగుతుంది. వారిద్దరి వివాహం జరుగుతుంది. లకుమ లకుమాదేవి అవుతుంది. అయితే రాణి కావాలనో, నగలు ధనాన్ని ఆశించో రాజును పెళ్ళి చేసుకోదు. కేవలం రాజు కోరిక నాట్యశాస్త్ర గ్రంథరచన తప్ప మరే ఉద్దేశ్యం ఉండదు. అది రాజుకు కూడా తెలుసు. రచన పూర్తయిన పిమ్మట రాజును పట్టపురాణికి, ప్రజలకు అప్పగించి లకుమ వెళ్ళిపోతుంది.

దేవదాసీలు దేవాలయాలకు దానం ఇవ్వబడితే రాజదాసీలు రాజాస్థానాలకు నియమింపబడతారు. దేవదాసీలు దేవుని ఎదుట నాట్యం చేస్తారు. రాజదాసీలు రాజు ఎదుట నాట్యం చేస్తారు. దేవాలయం నుండి రాజాస్థానానికి మార్చబడిన దేవదాసీలు ఉన్నారు. దేవదాసీలైన, రాజదాసీలైన నాట్యసేవచేయడం ద్వారా దేవుణ్ని ఆరాధించడం ముఖ్యంగా కనిపిస్తుంది. నాట్యం ద్వారా దేవదాసీలు దేవుణ్ని ఆరాధిస్తే, రాజదాసీలు రాజును ఆరాధిస్తారు. ఇటువంటి ఆరాధనే లకుమది. కొమరగిరిరాజును చిన్ననాటి నుంచి ఆరాధిస్తుంది. అతని ఆశయ సిద్ధికి తోడ్పడుతుంది. వీరందరూ కళారాధకులే. కాని నాట్య కళారాధనకే తమ జీవితాలను అంకితం చేసిన కొంతమంది జీవితాలు దుర్భరంగా ఉండేవి. వారి సౌందర్యం, ఆటపాటలు, తెలివితేటలు కొంతమంది రసికహృదయులకు అవసరమయ్యేవి. వీటిని పూర్తిగా అనుభవించేవారు. మొట్టమొదట్లో దేవదాసీ అన్న, దేవదాసీలను పోషించే వాళ్ళన్న ఎంతో విలువ ఉండేది. రాజులు, రాజ్యాలు పోయిన తర్వాత దేవదాసీల పరిస్థితి మరి దిగజారిపోయింది. కొంతమంది పోషణ నిమిత్తం భూస్వాములకు దాసీలుగా ఉండేవారు. తదనంతరం సెక్స్ వర్కర్లుగా మారారు.

ఈ నవలలో లకుమాదేవిని స్త్రీత్వానికి ప్రతీకగా చెప్పడం జరిగింది. ఉన్నత ఆశయం కలిగిన ఆదర్శమూర్తి. సేవాదృక్పథం కలిగిన వనిత. కళలను ఆరాధించే కళామూర్తి. నాట్యచరిత్ర అంటే లకుమ చరిత్రే అవుతుందని చెప్పుకునేంత గొప్ప నాట్యశిఖామణి.

References:

రామకృష్ణ, నటరాజ. 1987. *రుద్రగణిక. పేరిణి ఇంటర్ నేషనల్ ప్రచురణ, హైదరాబాద్* లల్లాదేవి. 1982 Jan. *లకుమాదేవి.* నవజ్యోతి పబ్లికేషన్స్, విజయవాడ.

లలిత, వకుళాభరణం. 2007. *జోగినీ వ్యవస్థ.* జనచైతన్యవేదిక ప్రచురణ, ఆంధ్రప్రదేశ్ కమిటి. హైదరాబాద్.

శాంతిప్రబోధ, వి. 2007 sept. *జోగినీ దురాచారం-సంస్కరణ, (వజ్రభారతి 1947-2007).* కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణ, విజయవాడ.

TELUGU SEVAKA, 2005 July. *నర్తనశాల.* language engineering. blog spot.com.

********

వ్యాస కౌముది



# అక్షరాలైన అభాగ్యుల వెతలు
# కె.వరలక్ష్మి కథలు

-నాగరాజు రామస్వామి.

ఒక గొప్ప పుస్తకం చదవడం ముగించి రసావేశానికి లోనై నిదురకు దూరమైన రాత్రులు, మరుసటి రోజు మామూలు మనిషి కాలేక పోయిన సందర్భాలు సాహితీ రసజ్ఞులైన పాఠకులకు కొత్తేమీ కాదనుకుంటాను. ఆ కోవకు చెందినవే కె.వరలక్ష్మి గారి కథా సంకలనాలు.

పఠనీయత పుష్కలంగా ఉన్న ఒక్కో కథా సంకలనం చదవడానికి రెండింతల సమయం పట్టిందనడం విరోధాభాసం (paradox). కాని, కె.వరలక్ష్మి గారి కథా సంకలనాల చదువరికి ఈ అనుభవం తప్పదు. చదువుతున్నంత సేపు పరుగులెత్తించిన కథాంతం మరో కథను ప్రారంభించనివ్వదు. ఆలోచనల అలజడి ముందుకు కదలనివ్వదు. ఈ లక్షణం ఒక మంచి రచనకు గీటురాయని నేను భావిస్తాను.


కె. వరలక్ష్మి గారి కథాసంకలనాలు మూడు-- జీవరాగం(1996), మట్టి-బంగారం (2002), అతడు-నేను (2007). ఈ మూడు సంకలనాలలోని కథల సంఖ్య 47. ఈ కథలన్నీ అరుదైన ఆణిముత్యాలు. వీటిలో చాలావరకు స్త్రీ ఇతివృత్త కేంద్రంగా స్త్రీ చుట్టూ తిరిగిన అట్టడుగు అబలల దయనీయ జీవన దృశ్యాలు. ఈనాటికీ సమాజం లోని సగటు స్త్రీ అనుభవించక తప్పని అనేక వాస్తవ సమస్యల సమాహారాలు. స్త్రీసున్నితమైన జీవరాగాల సందడి!

ఈ కథలలో అణగారిన నానాజాతి స్త్రీల దైన్యజీవితాలు చదువరులను కలవర పరుస్తాయి. కుటుంబ హింసను, సామాజిక హింసను భరిస్తున్నామన్న స్పృహే లేని వెనుకబడిన స్త్రీలు నిస్సహాయంగా కొట్టుమిట్టాడుతూ కలతను రేపుతుంటారు. ఎరుకల, చాకలి, గొల్ల, మేదర, తప్పెటగుళ్ళ , పొడ పోతల, భోగం, కోయ, గిరిజన నిరుపేద స్త్రీలు దీనంగా కళ్ళ ముందు నిలిచి నిలదీస్తారు. ఇన్ని రకాల

జీవితాల చీకటి లోతులను ఇంత దగ్గరగా తరచి చూడడం, దయనీయమైన వాస్తవ జీవితాలను ఇలా మమేక మానవీయ దృక్కోణంలో దర్శించడం పరిశీలనను మించిన పరిశోధన!

వరలక్ష్మి గారు ఒక 'కథా బీజాన్ని' ఎన్నుకొని, స్థూలంగా ఒక 'కథా చట్రాన్ని' మనసులో నిలుపుకొని, కేవలం ఒక 'రూప స్పృహ'తోనే కథను ప్రారంభిస్తారేమోననీ, 'క్లుప్తత', 'అంతస్సూత్రత','శైలీ శిల్ప విన్యాసం', 'ఉత్కంఠత, 'కథా సంవిధానం', కొసమెరుపులను ఆవిష్కరించే 'అద్భుతాంశ' వంటి ప్రక్రియాపరమైన కథానికా లక్షణాలు వాటంతటవే 'కథా కథన' గమనంలో ఒదిగిపోతాయనీ నాకెందుకో అనిపిస్తుంటుంది. ఆమె కథలు రాస్తున్నట్టుగా కాకుండా, స్వతసిద్ధ మైన సహజ ప్రతిభతో అలవోకగా వినిపిస్తున్నట్టుగా ఉండటం అందుకు కారణం కావచ్చు.'ఎత్తుగడ' తోనే ఆమె కథా సరిత్సాగరం లోకి లాగబడిన పాత్రోపస్థిత శ్రోత అయిపోతాడు పాఠకుడు !


ఇక కథల్లోకి వస్తే --'జీవరాగం' ఉత్తమ పురుషలో రాసిన ఒక చిన్న కథ. 'అమ్మపోయింది, కూతురు ప్రేమించిన వాడితో రిజిష్టర్ మారేజ్ చేసు కుంది.చచ్చి పోవాలని అనిపిస్తుంది' అంటూ ఎంతో బాధతో సత్యమూర్తి రాసిన ఉత్తరం అందుకున్న శృతి హుటాహుటిగా బయలుదేరింది. తీరా అతని ఇల్లు చేరే సరికి కూతురు పెళ్ళి ఘనంగా చేసే పనుల్లో పెళ్లి పందిట్లో తలమునక లౌతుంటాడు అతడు.తల్లి చావును మరచిపోయి ఎక్కడ చూచినా తనేఅయి హుషారుగా నవ్వుతూ తిరుగుతుంటాడు.ఇతనేనా అంత ఆర్తితో రాసిన మనిషి! 'ఒక్క బ్రేక్ తో ట్రెయిన్ కదలి స్పీడందుకుంది .ఉత్తరం చింపి బయటకు విసిరేశాను'. ఇవి ముగింపు వాక్యాలు. మూర్తి ప్రాక్టికల్ మనిషి అని కథ మధ్యలో రచయిత్రి సూచించి వదలుతుంది. అది 'నాందీ-ప్రస్తావన' అని కథాంతానికి గాని అవగాహనలోకి రాదు. ప్రాక్టికాలిటీ ముసుగు కప్పుకున్న హైపోక్రటిక్ మనిషి నేటి సగటు సంఘజీవి అని చెప్పడం రచయిత్రి ఉద్దేశమై ఉంటుంది. ఇలాంటి వాళ్ళెందరో తన కథల్లో ఉన్నందువల్లే సంకలనానికి 'జీవరాగం' అని పేరు పెట్టిందనుకుంటాను.




'మట్టి-బంగారం' మాండలికంలో సాగిన మరోసంకలనంలోని మరో కథ. గొల్లల పండుగ పబ్బాల, వ్రతాల, ఆచారాల పల్లె వాతావరణం. అయోద్ది రాముడు గొర్రెలను అమ్మి పెంకులు తయారు చేసే మిల్లులో వాటావుంటానంటే 'ఎవడన్నా పేణం ఉన్న జీవాలమ్ముకొని పేణం లేని మిల్లు కొనుక్కుంటాడట్రా ?'అని ముసల్ది మందలిస్తుంది. అయినా ఖాతరు చేయకుండా ఫాక్టరీ కొనేస్తాడు. తన గుడిసె పక్కనున్న మరో మూడు గుడిసెలు కొని పడగొట్టించి పెద్ద మేడ కట్టిస్తాడు. ఆ మేడ 'మందలో తలెత్తి నిలిచిన కొమ్ముల పొటేలులా ఉందని' సంబరపడిపోతుంది అక్క శ్రీలక్ష్మమ్మ. ఆడంబరాలకూ డాబులకూ పోయి దివాలా తీస్తాడు అయోద్ది రాముడు. మిల్లుకు తాళం పడుతుంది. ఇల్లు అమ్ముడై పోతుంది.' మన అయోద్ది రాముడు మట్టిలో పుట్టిన మాణిక్కంరా, ఆడు మట్టట్టుకుంటే బంగారవై పోద్ది' అన్న పెద్ద గొల్లతాత 'బంగారాన్ని మట్టి సేసేవురా అయోద్ది రాముడూ' అంటూ వాపోతాడు.కథ పొడుగునా వస్తువుకు తగిన శైలీ,

ప్రాంతీయ గొల్లల జీవనాన్నిప్రతిబింబిస్తూ గొల్లయాసలో సరళంగా సాగిన అరమరికలు లేని సంభాషణలూ, వాళ్ళ ఆలోచనలకూ స్వభావాలకూ అనుగుణమైన వర్ణనలూ కథకు చక్కని 'అనుదాత్తత'ను సంతరించి పెట్టాయి. ఉదయాన్ని పరికిస్తున్నశ్రీలక్ష్మమ్మకు 'తూరుపు మేకపాలు ఒలకబోసినట్టు'గా తోస్తుంది. తనను ఒంటరిని చేసి తమ్ముడూ, మరదలూ పట్నానికి వెళ్ళిపోతుంటే బస్సు కదలే వరకు ఉండిపోతుంది.

'ఎప్పుడు కట్టుతెంచుకుందో మేకపిల్ల, దాన్ని అపురూపంగా గుండెకు హత్తుకుంది. ఇకమీద ఇదే కదా తనకి తోడు!'. ఈ ఆఖరి వాక్యాలు కథకు చక్కని ముగింపు.




'అతడు-నేను' మూడవ సంకలనం లోని మొదటి కథ. వేపచెట్టు చిరుచేదు సుగంధం, నీలి ఆకాశంలో రూపులు మార్చుకుంటూ హటాత్తుగా మాయమైన మబ్బుతునక, సగంతెరచిన కిటికీలో రెపరెపమంటున్న'ఇండియా ఇన్ స్లో మోషన్'పుస్తకం--ఆమె జీవన నేపథ్యానికి సరిపడే వర్ణన. అతడు పెరాలిసిస్ స్ట్రోక్ తో మంచాన పడిన ముక్కోపి. అతడు ఏనాడూ తనను ప్రేమించలేదని తెలిసీ,పిల్లలు కలుగ లేదన్న నెపంతో మరోదాన్ని కట్టుకొని విడిపోయిన అతన్ని నిర్లిప్తంగా నైతేనేమి అటవీ జన సంప్రదాయాన్ని, భార్యా ధర్మాన్ని ఆమె నిర్వర్తిస్తూ సర్వసపర్యలు చేస్తుంటుంది. అతని వైద్యానికి ఉన్న ఇల్లును అమ్మి సేవాశ్రమాన్నిఆశ్రయిస్తుంది. తనను తిట్టిపోసే అతని తల్లికి చచ్చే వరకు సేవ చేస్తుంది.'అవును,అతను నీకు ఏం చేశాడని నువ్వింతగా సేవలు చేస్తున్నావు'అన్న షరీఫా కు జవాబుగా ఆమె 'మనం జీవించడానికి ముఖ్యమైన లక్షణం జీవితం మీద ప్రేమ. ఇతరులను జీవింప జేయడానికి కావలసినది నమ్మకం, జాలి, దయ, ప్రేమ. ప్రపంచాన్నీ, మనుషుల్నీ నమ్మలేని ప్రేమించలేని స్థితి విషాదమైంది' అంటుంది. సందేశాత్మకంగా ముగిస్తుంది కథ.

ఇలాంటి అపురూపమైన కథా తోరణాలు 'కె.వరలక్ష్మి కథలు'. రైల్వే స్టేషన్లో అడుక్కుతినే బాలిగాడికి దొరికిన తప్పిపోయిన పాప జాలికథ 'పాప'. పడుపు వృత్తి లోని పసిడి బొమ్మల సున్నిత కథాంశం 'పిండి బొమ్మలు'. భూమి గల్లంతు కథ 'దగా'. మూఢ ఆచారాలు, నిస్సహాయ స్త్రీలు -మనసును పిండేసే ఉదంతం 'సుహాసినీ పూజ'. నన్ను ఆకట్టుకున్న అద్భుతమైన కథలు 'గాజు పళ్ళెం','మంత్రసాని', 'ఖాళీ సంచులు', 'ప్రత్యామ్నాయం','ప్రస్తానం', 'ప్రయాణం', 'నిరసన', 'ప్రత్యామ్నాయాలు' మచ్చుకు కొన్ని.'గాజు పళ్ళెం'-కూలీల దుర్భర బ్రతుకుల అద్భుత చిత్రీకరణ. ప్రతీతాత్మకమైన శీర్షిక. ఇతివృత్తానికి అమరిన రచనాత్మక కళా సృజన అద్వితీయం. కథాంతంలో 'అద్భుతాంశాన్ని' అత్యంత దయనీయంగా ఆవిష్కరించిన తీరు అమోఘం! గత్యంతరంలేక తన ఆకలినీ తనకడుపు లోని బిడ్డ ఆకలినీ తీర్చగల అంతిమ నిస్సహాయతకు లొంగిన గంగ 'వెన్నులో ఘటిల్లుమని ఏదో చిట్లినట్టయింది.పదిలంగా గుండెకు హత్తుకున్న గాజు పళ్ళెం విరిగి వెయ్యి ముక్కలయింది'. మనసును ముక్కలు చేసే ముగింపు. గాజు పళ్ళెం ఒక గొప్ప కథ.

కె.వరలక్ష్మి గారి కథా సంపుటి 'క్షత గాత్ర'(2014), కవితా సంపుటి 'ఆమె'(2005), నాలుగు నవలికలు, రేడియో నాటికలు, వ్యాసాలు నేనింకా చదువవలసిన వారి రచనలు.వారు పొందిన అవార్డులు: చాసో స్ఫూర్తి, రంగవల్లి, విమలా శాంతి, బి.ఎస్ రాములు, హసన్ ఫాతిమా, తెలుగు యూనివర్సిటీ ధర్మనిధి, రంజని, పులికంటి,ఆర్.ఎస్.కృష్ణమూర్తి, అజో- విభో, ఆటా, తానా, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి మొదలగు అవార్డులు. 2013 సుశీల-నారాయణరెడ్డి ఉత్తమ రచయిత్రి పురస్కారం వరలక్ష్మి గారిని వరించడం అభినందనీయం.

'ఆమె కథలలోని పరిసర పరిశీలనలను చూస్తుంటే ప్రాచీన కవులలో శ్రీకృష్ణదేవరాయలు, ఆధునికుల్లో విశ్వనాథ సత్యనారాయణ గుర్తుకొస్తారు' అన్న చేరా గారి అభినందన అర్థమైన అమూల్యమైన కితాబు.

వరలక్ష్మి గారు ముందు ముందు మరింత ఉత్తమ సాహిత్యాన్ని అందించ గలరని ఆశిద్దాం.

(కె.వరలక్ష్మి గారు జనవరి 17,2014 న ప్రతిష్టాత్మక "సుశీలా నారాయణరెడ్డి సాహితీ పురస్కారం అందుకున్న సందర్భంగా-)





********




# సమీక్షకుడుగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి

డా. శిరీష ఈడ్పుగంటి



తెలుగుసాహిత్యంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారిని ఒక గొప్ప సమీక్షకుడుగా చెప్పుకోవచ్చు. ఈయన కిందటి నెల (ఫిబ్రవరి 28 తేదిన 2014) మరణించారు. వయసు 90 సంవత్సరాలు. నిన్న మొన్నటి వరకు కూడా ఈయన వ్యాసాలు పత్రికలలో వస్తుండేవి. చివరిదశ వరకు రాస్తూనే ఉన్నారు. తెలుగు సాహిత్యాభివృద్ధికి కోసం పాటుపడిన వ్యక్తి. నలభై వరకు రచనలు, మూడువేలకు పైగా వ్యాసాలు రాశారు. రచనాదృష్టే కాకుండా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాహిత్య సమావేశాలు జరిపారు. ఎంతోమంది సాహిత్యవేత్తలను సత్కరించారు. ఈయన కూడా ఎన్నో సన్మానాలు, సత్కారాలు పొందారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో జన్మించి, బళ్ళారిలో చదువు పూర్తి చేసి, నెల్లూరు, గుంటూరు, కడపలో ఉపాధ్యాయునిగా ఉండి, చివరికి కడపలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. కడపజిల్లా సంస్కృతి వికాసానికి ఎంతగానో కృషిచేశారు. కడపలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం అన్నిసౌకర్యాలతో ఏర్పాటు చేయడంలో ప్రధానపాత్ర వహించారు. ఈ గ్రంథాలయ ప్రాంగణంలో **వివేచన** పేరుతో సాహిత్య సమావేశాలు జరిపేవారు. గాడిచర్ల ఫౌండేషన్, రచయితల సంఘం మొదలైన వాటిని ఎంతో జయప్రదంగా నడిపారు.

శాస్త్రిగారి బాల్యానికి సంబంధించి ఆయన ఆత్మకథలో చెప్పిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఈయన ప్రాథమికవిద్య రాయదుర్గం కోటలోని వీరభద్రస్వామి ఆలయంలో జరిగింది. అది ఒక వీధిబడి. ముంజోజి అనే ఒక ఫించనుదారు ఆ బడిని నడిపేవాడు. ఒకటి రెండు తరగతుల విద్యార్థుల నుండి పావలా, అర్ధరూపాయి ఫీజు వసూలు చేసేవాడు. ఒక నోట్ బుక్ లో కొన్ని ఊర్లపేర్లు, తాలుకా పేరు, ఎక్కాలు, నెలలు తిధివార నక్షత్రాల పేర్లు రాసి ఇచ్చేవారు. ఉదయాన్నే కృష్ణశతకం,

సుమతీశతకం పద్యాలు చదివించేవారు. ఆ రోజులలో వీధిబడులలో చదువుకోవటం అనేది ఉండేది. ఈయన కూడా మూడవ తరగతి వరకు ఆవిధంగానే చదువుకున్నారు. మిగిలిన తరగతులు జిల్లా ఎలిమెంటరీ స్కూల్లోనూ, హైస్కూల్లోనూ చదువుకున్నారు. హైస్కూల్ చదువు ముగిసిన తర్వాత ట్రైనింగ్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పని చేశారు. ఉద్యోగం చేస్తూ మిగిలిన చదువు అంతా సాగింది.

**రచనల సమీక్ష**

శాస్త్రిగారి రచనలను బట్టి ఆయన తెలుగు సాహిత్యానికి గొప్ప సమీక్షకుడు అని చెప్పుకోవచ్చు. ఈయన రచనలలో మచ్చుకకు కొన్ని రచనలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఈయన మొదటి రచన **మాసీమకవులు**. ఇందులో రాయలసీమ కవులను వారి జీవిత విశేషాలను, వారివారి కాలాలతో పాటుగా పరిచయం చేశారు. కవితాశక్తి కలిగిన మహాకవుల రచనలు ఎన్నో మరుగునపడి ఉన్నవి. వాటిని సేకరించి ప్రచురించుట, ఆ కవులను వెలుగులోకి తీసుకుని రావడం కర్తవ్యంగా భావించారు. ఈ రచన ద్వారా ముప్పైమంది కవుల పరిచయ వ్యాసాలు రాశారు. కవుల కృషిని, వారివారి వ్యక్తిత్వ విషయాలను పుట్టుపూర్వోత్తరాలు (కాలం, విద్య మొదలైన వాటితో సహా) గూర్చి సంక్షిప్తంగా వ్యాసాల రూపంలో మనకు అందించారు. ఈ రచన ఆయనకు సాహిత్యం పట్ల గల ఆసక్తిని తెలియజేస్తుంది. వీరు కవులకాలం, విద్య తదితర అంశాల కంటే సాహిత్య రచనా కృషికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. వీరి వ్యాసాలు తెలుగు సాహిత్యంలో మరుగున పడిపోతున్న కొంతమంది కవుల స్థానాన్ని తిరిగి నిలబెట్టగలిగాయి. శాస్త్రిగారి రచనా నైపుణ్యాన్ని తెలియజేసే మరొక రచన **సుప్రసిద్ధుల జీవితవిశేషాలు**. ఇందులో శాస్త్రిగారు మనదేశీయులే కాకుండా విదేశీయులైన థామస్ మన్రో, కల్నల్ మెకంజీ వంటివారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవల్ని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల గూర్చే కాక మన భారతదేశ సంస్కృతిలోను, ప్రగతిశీలతను పాలుపంచుకోవడానికి అందులో భాగస్వాములైన నిర్మాతలను, సంఘ సేవకులను, భాషాసేవకులను, శాస్త్రవేత్తలను వివరణాత్మకంగా పరిచయం చేసే నిమిత్తం సుప్రసిద్ధుల జీవితవిశేషాలు శీర్షికతో పుస్తకాన్ని తెచ్చారు. సంఘసంస్కర్తల, సాహితీవేత్తల జీవితవిశేషాలను వివరించే రచన. కులాలు, పుట్టిన ఊర్లు, వ్యక్తిలోని బలహీనతలు మొదలైన అవాంఛనీయ అంశాల జోలికి వెళ్ళకుండా కృషికి మాత్రమే ప్రాధాన్యమిచ్చి రచించారు. శాస్త్రిగారి మరొక రచన **వ్యాసభారతి** ఇందులో ఆయన సాహితీకృషి కనిపిస్తుంది. ఓర్పుతో సర్వ విషయ సేకరణ ఆయన ప్రత్యేకత. ఈ రచనలో నలభైఐదు వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలను సాహిత్యభారతి, కళాభారతి, విజ్ఞాన భారతి, సమైక్యభారతి అని నాలుగు విభాగాలుగా చేసి రచించారు. సాహిత్యం, కళలు, విజ్ఞానం మొదలైన వివిధ రంగాలకు సంబంధించిన వ్యాసాలను రాశారు. ఒక్కొక్క రంగంలోను కృషి చేసిన గొప్పగొప్ప వ్యక్తుల పరిచయాలు, వారివారి కృషిని వ్యాసాలరూపంలో ఈ రచనలో పేర్కొన్నారు. శాస్త్రిగారివ్యాసాల్లో సామాజిక చైతన్యం, లౌకికవాదం కనిపిస్తుంది. సంగీత కళాకారులు, వైజ్ఞానికులు, సాహిత్యవేత్తలు, సంఘశ్రేయాభిలాషులు, దేశభక్తులు మొదలైనవారి గూర్చి ప్రస్తావించారు. ఎవరెవరు ఏయే రంగాలలో నిపుణులు, ఏయే రంగాల పట్ల ఆసక్తి కనబరిచారు, ఏవిధంగా కృషి చేశారు, ఆ మహానుభావుల విలువల్ని వ్యాసాల రూపంలో మనముందుంచారు. **నీరాజనం** రచన ఆధ్యాత్మిక పౌరాణిక వ్యాస సంకలనం. పరిశోధనాత్మకంగా రచించబడినది. నేటి విద్యార్థులకు ఎంతో

ఉపయోగకరంగా ఉండేవిధంగా రచించారు. ఈయన నివశించిన తిరిగిన ప్రాంతాలలో ఏయే ప్రసిద్ధ క్షేత్రాలున్నాయో వాటి పుట్టుపూర్వోత్తరాలు, సుప్రసిద్ధ వ్యక్తుల పాండిత్యం గూర్చి వ్యాసరూపంలో రాశారు. **ఎందరో మహానుభావులు** రచనలో వివిధ రంగాలలో చెరగని ముద్రవేసిన మహానుభావుల జీవితాల్లోని అపురూపమైన సన్నివేశాలను పేర్కొన్నారు. మహనీయుల జీవితచరిత్రలే ఏదేశ చరిత్రకైనా మూలకందాలు. చరిత్రకెక్కిన చరితార్థుల జీవితాలు సమకాలీనులకే కాక భావితరాల వారికి కూడా స్ఫూర్తిదాయకాలే. మనిషిని అల్పుడుగా చేసే సంఘటనలు ఉన్నట్లే అతన్ని మహోన్నతునిగా చేసే సంఘటనలు కూడా ఉంటాయి. అటువంటి సంఘటనలతో కూడిన రచన ఇది. సాంఘికసేవ, దేశభక్తి, సాహిత్యం, ఉదారహృదయం, గొప్పతనాన్ని సాధించుకోవడం, నిజాయితీ, కష్టపడటం, మంచిమనసు, పట్టుదల, సాహసకృత్యాలు, మేధస్సు, చాకచక్యం, చమత్కారం, ఆప్యాయత, ఆత్మీయత, గౌరవభావాలు, సంస్కారం, అంకితభావం మొదలైన అంశాలతో కూడిన సంఘటనలు కలిగిన మహానుభావుల పరిచయాలు చేశారు. అంతేకాకుండా ఆ మహానుభావుల ఫోటోలు, కాలాలతో సహా వారివారి జీవిత సన్నివేశాలను తెలియజేయడం జరిగింది. ఇవన్నీ సేకరించి రచన చేయడం సామాన్య విషయం కాదు. ఎందరో మహానుభావుల లక్షణాలు, వారివారి జీవితాలలోని ఘట్టాలు ఇవన్నీ మనకు మార్గదర్శకత్వం కలిగించేవి. ఇటువంటి రచన చేసిన శాస్త్రిగారిలో కూడా ఈ లక్షణాలన్నీ కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలన్నీ శాస్త్రిగారిలో సహజంగానే ఉండటం వలన ఈ రచన చేశారని చెప్పవచ్చు. అందుకే అటువంటి అంశాల పట్ల ఆయన ఆకర్షితుడై ఈ రచన చేసి ఉండవచ్చు. ఈ రచనలోని మహానుభావులతో పాటుగా ఈ రచన చేసిన మహానుభావుడు శాస్త్రిగారు కూడా మనకు మార్గదర్శకులే. మరొక రచన **రసవద్ఘట్టాలు** లో దేశ, విదేశాలకు చెందిన మేధావులు, కవులు, గాయకులు, శాస్త్రవేత్తలు, నటులు, రాజనీతి విశారదులు, దేశభక్తులు, మొదలైనవారి జీవితాల్లోని రసవద్ఘట్టాలను వ్యాసాలరూపంలో రాశారు. ఎంతోమంది వ్యక్తుల జీవితాల్లోని రసవద్ఘట్టాలను సేకరించి రచన చేయడం ఎంతో కృషి చేస్తేనే తప్ప ఈ రచన చేయలేరు. అనేక గ్రంథాలను అధ్యయనం చేసి, ఎన్నెన్నో విషయాలను సేకరించి రచన చేశారు. వారివారి జీవితాలలో మధురమైన సరసమైన చారిత్రకమైన సంఘటనలను సేకరించి తమదైన శైలిలో క్లుప్తత, స్పష్టత, పఠనీయత ఉండేవిధంగా రాశారు. ఈ రచన ద్వారా మరపురాని సంఘటనలను మనకు అందించిన మహానుభావుడు శాస్త్రిగారు. **గణపతి రచన** శాస్త్రిగారిలోని దార్శనిక ప్రవృత్తికి నిదర్శనం. ఈ రచన కన్నడం నుండి తెలుగులోకి, ఆంగ్లంలోకి అనువదించారు. గణపతి విగ్రహాలకు సంబంధించిన చారిత్రకాంశాలను పేర్కొన్నారు. **ఆలోకనం ఆత్మకథలో** ఆయన జీవితానుభవాల చర్చ కనిపిస్తుంది. అలాగే **బళ్ళారిరాఘవ** జీవితచరిత్ర రాశారు. **కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం** లో సోదరభాషా వైశిష్ట్యాన్ని వివరించారు. తెలుగుకన్నడ భాషల మధ్య సమన్వయాన్ని తెలియజేస్తూ రచన చేశారు. కన్నడ సాహిత్య వేత్తల, కళాకారుల పరిచయాలు చేశారు. **దేవుని కడప- స్థలచరిత్ర** రచనలో కడప స్థలచరిత్రను సేకరించి ఆధారాలతో రచించి మన సంస్కృతి విశేషాలను భద్రపరిచారు. **కడపజిల్లా విజ్ఞాన విహార దర్శి లో** కడప జిల్లాకు చెందిన ముప్పైఆరు పర్యాటక ప్రాంతాల గూర్చి విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో రంగుచిత్రాలతో తీర్చిన రచన. ఇంకా సి.పి.బ్రౌన్ చరిత్ర, మోనోగ్రాఫ్ , అనువాదాలు మెకంజీ కైఫీయత్తులు - మొదటిభాగం మొదలైన రచనలు చేశారు.

**రచనాశైలి**

చిన్నచిన్న వాక్యాలతో, డైరక్టుగా విషయంలోనికి చొచ్చుకునిపోవడం, చారిత్రక విషయాలను వెలికితీయడం, పరిశోధనాదృష్టి, విషయంలో విశిష్టత కనిపిస్తుంది. విషయ సేకరణలోను, విశ్లేషణలోను శాస్త్రిగారిది ప్రత్యేకమైన శైలి. ఓర్పుతో సర్వవిషయ సేకరణ చేస్తారు. ఈయన రచనలు అన్నీకూడా పునర్ ముద్రణలు పొందాయి. ప్రతిమనిషికి బలం, బలహీనతలు (మంచి- చెడు) రెండూ ఉంటాయి. కాని శాస్త్రిగారు కేవలం మనిషిలోని మంచితనం, కృషిని, మాత్రమే గ్రహించి అటువంటి కోణంలోనే రచనలు చేశారు. ఇటువంటి ధోరణిలో వచ్చే రచనల వలన సమాజానికి ఎంతో మేలు కలుగుతుంది.

**ముగింపు**

ఎక్కడెక్కడో ఉన్న విషయలను సేకరించి, వెలికితీసి పరిశోధనాదృష్టితో వ్యాసరూపంలో రచనలు చేశారు. సేవాతత్పరతతో, ఆదర్శజీవితం గడిపారు. అధ్యాపకుడుగా, సాహితీవేత్తగా, అనువాదకుడుగా, అన్నింటికి మించిన గొప్ప సమీక్షకుడుగా నేటి యువతరానికి మార్గదర్శకులు.

********

వ్యాస కౌముది



# ప్రజాకవి కాళోజీ

మండవ సుబ్బారావు

**(1991లో శ్రీలేఖ సాహితీ వరంగల్ వారు ప్రచురించిన "ఏకశిల వైతాళికులు" గ్రంథంలోని నా వ్యాసం కాళోజి శతజయంతి సంవత్సరంలో యాది)**



నన్నయ నుండి నేటి వరకు తెలుగు కవిత్వం అనేకానేక సాంఘిక రాజకీయ సాహిత్య ఉద్యమాలను చవి చూసింది. ఏ ఉద్యమానికి సంబంధం లేకుండా, ఏ ఉద్యమానికి చలించకుండా తమ చుట్టూ అనుభుతుల, ఆనందాల అడ్డు గోడలు కట్టుకొని తమదో ప్రపంచంగా జీవించిన కవులు నాడూ ఉన్నారు.నేడూ జీవిస్తున్నారు. ఇలాంటి వాళ్ళు ఎప్పుడూ ఉంటారు..వాళ్ల వల్ల తెలుగు కవిత్వానికి వచ్చిన లాభం లేదు. వాళ్ళు రాసినదాంట్లో సామాజిక స్పృహ లేక పోయినా కవిత్వం ఉంటే సాహిత్య చరిత్ర పుటల్లో మాత్రమే వాళ్ల పేర్లు నిలచి పోయాయి. రెండూ వున్నవాళ్లు పామరుల, పండితుల నోళ్ళల్లో చిరంజీవులై ఉన్నారు. రెండూ లేకుండా కవిత్వం రాసిన వాళ్ల కంటే రాస్తున్న వాళ్లు చాలా మంది ఉన్నారు. వీరు పత్రికల్లో కనిపించినా, పదికాలాలు మాత్రం జీవించ లేరు. తెలుగు కవిత్వం సంసారంలో సరిగమల దగ్గర నుంచి సాయుధ పోరాటల వరకు తన వస్తువుగా స్వీకరించుకొని సమకాలీన సాంఘిక పరిస్థితుల్ని సమతల దర్పణంలోలా చక్కగా ప్రతిబింబించింది.

ఆధునిక తెలుగు కవిత్వంలో తెలంగాణ సాయుధ పోరాటం మీద వచ్చింనంత కవిత్వం మరే విషయం మీద రాలేదని చెప్పటం అతిశయోక్తి ఏ మాత్రం కాదు. శ్రీశ్రీ అన్నట్లు భారత దేశం అంతట్లోకి రాజకీయంగా ఎక్కువ చైతన్యం చూపిస్తున్న ప్రాంతం "ఆంధ్రప్రదేశ్". అలాగే ఎక్కువ చైతన్యాన్ని ప్రతిబిబంబించే కవిత్వం తెలుగు కవిత్వం అని చెప్పవచ్చు. "భారత దేశంలో మరే

ప్రాంతంలో కూడా తెలంగాణా రైతాంగ పోరాటం వంటి పోరాటం జరగలేదు. అందువల్ల ఏ భారతీయ భాషలలోనూ తెలంగాణా రైతాంగ పోరాటం చైతన్యం వంటి చైతన్యంతో సాహిత్యం రాలేదు''. అంటారు శ్రీ కేతవరపు రామకోటి శాస్త్రి గారు. తెలంగాణా సాయుధ పోరాటం స్పెనిష్ సివిల్ వార్ లాంటిది. స్పెయిన్ లోని అంతర్యుద్ధం యూరప్ లోని ఎందరో మేధావుల్ని కదిలించింది. అలాగే తెలంగాణా సాయుధ పోరాటం తెలుగు కవుల్ని కదిలించ గలిగింది. స్పెయిన్ మీద ఆడెన్, స్పెండర్ ,సిడెలూయిస్,జార్జి,బార్కర్ వంటి మహాకవులు అనేక కావ్యాలు రాసారు.అలాగే తెలంగాణా సాయుధ పోరాటం మీద కావ్యాలు రాసిన వారు చాలా మంది ఉన్నారు. వారిలో ''దాశరథి,కుందుర్తి, ఆరుద్ర, కాళోజీ, కె.వి.రమణారెడ్డి'' మొదలైన వారు ముఖ్యులు.ఇంకెంతో మంది నాటక కర్తలు, నవలాకారులు తెలంగాణా మీద రాసిన వారు ఉన్నారు. ఇందులో కొందరు ఉద్యమానికి దూరంగా ఉండి రాసిన వాళ్లు, మరి కొందరు ఉద్యమంలో స్వయంగా పాల్గొంటు కవిత్వం రాసారు. వారిలో ''దాశరథి, కాళోజీ'' ముఖ్యులు.

'' మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచి పోకుండ గురుతుంచుకోవాలె
కసి ఆరి పోకుండ బుసగొట్టుచుండాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలి ''

అంటూ నిజాం చేసే ప్రజా పీడనమునకు స్పందించి ప్రతీకారం చేసి తీరాలి అని ప్రబోధం చేసిన వారు కాళోజీ.

## కాళోజీ జీవితం

తెలంగాణా విప్లవ కవిగా, తెలంగాణా శ్రీశ్రీగా పేరు పొందిన ప్రజాకవి కాళోజి వారి పూర్తి పేరు కాళోజీ నారాయణరావు.వారు సెప్టెంబర్ 14, 1914లో వరంగల్ జిల్లాలోని మడికొండ గ్రామంలో జన్మించారు. వారి తండ్రి కాళోజీ రంగారావుగారు. శ్రీ రంగారావు గొప్ప విద్వాంసులు.వారు ఒక విద్యాలయాన్ని మడికొండలో నిర్వ హించారు. వారు వారి విద్యాలయము లోని విద్యార్థులకు సంస్కృతం, ఉర్దూ, ఆంగ్లం,గణితం నేర్పే వారు. వీరి పెద్ద కుమారుడు శ్రీ కాళోజీ రామేశ్వరరావు గారు తండ్రి గారి నుండి ఉర్దు భాషను నేర్చుకొని ఉర్దు భాషలో కవితా రచన చేసారు. వారి రెండవ కుమారుడే శ్రీ నారాయణరావు గారు. శ్రీ నారాయణరావు గారు హైదరాబాదులో వకాలతు చదువుతున్న రోజులలో ఆంధ్రమహాసభల్లో చురుగ్గా పాల్గొన్నారు. చదివిన చదువు వకాలత్ అయినా ఆ వృత్తి చేపట్టలేదు. నారాయణరావు గారు నిజాం పాలనలో జరుగుతున్న దోపిడీలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన వకాల్తా పుచ్చుకొని నిజాం నవాబుకు వ్యతిరేకంగా కవిత్వ రాసారు.ఆయన రాసిన కవిత్వాన్ని ఆయనే వేదికల మీద చదివే వారు.సునితంగా హేళనగా కవిత్వం రాయటంలో కాళోజీ దిట్ట.ఆయన కవిత్వం, ఆయన ఉపన్యాసాలు ప్రజల్లో ఎంతో చైతన్యాన్ని ఉత్సాహాన్ని కలిగించాయి.తత్ఫలితంగా నిజాం సర్కార్ వారు కాళోజిని జైల్లో పెట్టారు.

1939లో మొట్టమొదటి సారిగా కాళోజీ జైలు గోడల్ని చూశారు. అయినా వారు జంకలేదు. ఆ నాడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు ప్రారంభించిన గ్రంథాలయోద్యమాన్ని తాను స్వీకరించి, గ్రామ గ్రామాలలో గ్రంథాలయాలు స్థాపించి, ''గ్రంథాలయోద్యమ ఆస్థాన కవి'' అని పిలిపించుకున్నారు. ముస్లిం,హిందూ ఐక్యతకు కాళోజీ ఎంతగానో కృషి చేశారు. వరంగల్ లో మొగిలయ్య అనే వ్యక్తిని కొందరు దుండగులు చంపినప్పుడు ఆ దుశ్చర్యను ప్రతిఘటిచటానికి పూనుకున్నాడు. ఈ సందర్భంగా ప్రభుత్వం వారిని వరంగల్ రావద్దని ఆంక్ష పెట్టింది. అంతే కాకుండా 1943లోను 1947లోను కూడా కాళోజీని జైల్లో పెట్టింది అప్పటి ప్రభుత్వం. 1948లో విడుదలయినాడు. స్వాతంత్ర్యానంతరం జరిగిన ప్రథమ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల మోసం వల్లనే అతి స్వల్పమైన తేడాతో ఓడిపోయాడు. దాపరికం లేకుండా కుండ బద్దలు కొట్టినట్లు ఉన్నదేదో ముఖం మీదే అనే వాడు కనుకనే ఇంతదాకా కాళోజీకి రాజకీయాలు అచ్చి రాలేదు. కాంగ్రెస్ పార్టీలో కల్మషం చేరడం ఆరంభించగానే అందులోంచి తప్పుకున్న కాళోజీ ఆ పార్టీ ప్రభుత్వం చేస్కున్న లోపాలు తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడూ,పౌరునిగా,కవిగా విమర్శిస్తూనే ఉన్నాడు.

అన్ని ఉద్యమాలలో కాళోజీ కవితను ఒక సాధనంగా తీసుకొని తన వాణిని ప్రజలకు వైతాళిక గీతంగా వినిపించాడు.

## ప్రజా కవిత్వం

ప్రజా కవిత్వ నిర్మాతలు ప్రజలే.ప్రజలంటే శ్రమజీవులు.శ్రమజీవుల పాటలే ప్రజల పాటలు.ఈ ప్రజలు తమకుతాము వెలువరించుకున్న కవిత్వాన్నీ, ప్రజలకోసం వారికి అర్థమయ్యేటట్లు వాళ్ల శ్రమను గురించి, జీవితాల గురించి ఇతరులు రాసే కవిత్వాన్ని ప్రజాకవిత్వం అనవచ్చు.

''నెరా నెరా నెరబండి'' అనే పాట ప్రజలకు సులువుగా బోధపడుతుంది.కొన్ని సందర్భాల్లో ఆనందాన్ని కూడా ఇస్తుంది. ఇది ప్రజాకవిత్వం. పూర్వం ఇటువంటి కవిత్వం రాసినవాడు వేమన.ఆ మహాకవి ప్రజాకవి ఆటవెలదులతో ఆడిన ఆటలు ఈ నాటికీ ప్రజల నాలుకలపై ఆడుతూనే వున్నాయి. తరువాత తెలంగాణా సాయుధ పోరాట రోజుల్లో ఇలా ప్రజల మాటల్తో కవిత్వం రాసిన వారు చాలా మంది ఉన్నారు.వారిలో కాళోజీ అగ్రగణ్యులు. అభ్యుదయ కవులు కవిత్వం ప్రజల కోసం అంటూనే ప్రజలకు అర్థం కాని కవిత్వం చెపుతుంటే కాళోజీ కవిత్వంలోనూ,భాషలోను గొప్ప మార్పు తెచ్చి ప్రజల కవిత్వాన్ని సృష్టించారు.ప్రతి తెలుగు వాడికి విన్నంతనే అర్థమవటం కాళోజీ కవితలో గల ముఖ్య లక్షణము.

## నా గొడవ

కాళోజీ ఎప్పటికప్పుడు దేశంలోని సమస్యలకు, సంఘటనలకు స్పందిస్తూ వందలకొలది కవితలు రాశారు.ఇవన్నీ ''నాగొడవ'' ద్వారా లోకానికి పరిచయమైనాయి.ఈ నా గొడవ గురించి శ్రీశ్రీ ప్రథమ ముద్రణ ఆవిష్కరణ సభలో ఇలా ప్రశంసించారు.

"ఇది కవి గొడవగానే కనిపించి నప్పటికీ చదివిన వారికి ఇది తమ గొడవగానే అర్థమవుతుంది.ఇది విశాల జగత్తు ప్రజలందరి గొడవ". ఇది మనం మననం చేసుకోవాల్సిన పుస్తకం.

కాళోజీ దేశభక్తుడు.అయితే వీరి దేశభక్తి కేవలం కవిత్వానికే పరిమితమైంది కాదు.విద్యార్థి దశ నుండి వారు నమ్మిన దానిని గురించి ప్రభుత్వానికి వ్యతిరేకమైందైనా జంకు గొంకు లేక ధైర్యంగా కవిత్వంలో చూపించారు. నిజాం కాలంలో ప్రజల బాధల్ని గాధల్ని ధైర్యంతో రాసి,పాడి జైలుకు వెళ్ళారు.

ఆయన కవితల్లో ఒక్కొక్క మకుటం పునరావృతమవుతూ ఉంటుంది. జానపద వాఙ్మయములో తరుచుగా కనిపించే "ఉయ్యాలో, ఉయ్యాలో", " రామ రామ ఉయ్యాలో" లా ఉంటుంది. ప్రపంచము అనే కవితలో

"గడియ గడియకు మారు ప్రపంచము
గవ్వకును కొఱగాని ప్రపంచము"

అంటూ మొత్తం కవితలో చివర ప్రపంచము అనే మకుటం రాశారు. అలాంటిదే మరో కవిత వ్యత్యాసాలు. ఇందులో ప్రతి పాదము చివర "ఒక చోట" అని ఉంటుంది. ఇలా ఎన్నో కవితలు కలవు.ఇలాంటి పోకడలతోనే వీరి కవిత్వం ప్రజా కవిత్వమైంది.

"మాతృదేశము" కవితలో కాళోజీ గారి దేశభక్తి వ్యక్తమవుతుంది. చిన్న చిన్న మాటల్లో పెద్ద పెద్ద భావాల్ని కలిగిస్తారు కాళోజీ

"నీరు లేని ఎడారి యైనను
అగ్గికొండల అవని యైనను
వానల వరదల వసతి యైనను
మాతృదేశము మాతృదేశమే"

ఈ నాడు ఉద్యోగ అవకాశలు లేవంటూ, చదువుకు మేధస్సుకు గుర్తింపు లేదంటూ అనేక మంది యువకులు దేశం వదలి పరదేశాలకు పోవడం మనకు తెలిసిందే కదా!.

పెట్టుబడిదారి దేశాలలోని వ్యత్యాసాల గురించి చెప్పడానికి కాళోజీ పెద్ద పెద్ద సిద్ధాంత పదాల్ని ఉపయోగించ లేదు. ప్రజల మాటల్తోనే ఇక్కడ కనిపిస్తున్న వ్యత్యాసాల్ని ఎలా వివరించారో చూడండి.

"అన్నపు రాసులు ఒక చోట
ఆకలి మంటలు ఒక చోట
హంస తూలిక లొక చోట
అలసిన దేహాలొక చోట
సంపదలన్ని యొక చోట

గంపెడు బలగంబొక చోట''

''అవనిపై జరిగేటి అవకతవకలు జూసి ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు? '' అంటూ ''కష్టపడు వారలను కాపాడగా లేను'' అనే బాధ వారిలో వ్యక్తమవుతుంది. అయినా వారు తమ వంతు కర్తవ్యంగా జనాన్ని చైతన్యపరచటమే అనుకొని ఆ పనిని చేయటానికి వారి కలాన్నే బలంగా ఉపయోగించుకున్నారు.

మన దేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. వ్యవసాయం చేసే రైతు దేశానికి వెన్నెముక .ఈ విషయాన్ని గాంధి గారు నాడు గ్రామ రాజ్యం రావాలంటి రైతు క్షేమం కావాలంటూ ఉపన్యాసలిచ్చేవారు. ఈ విషయాన్ని ''కర్షకా'' అనే కవితలో కాళోజి కమనీయంగా చిత్రించారు..

''నర్తకుని నాట్యాలు గాయకుని గానాలు
వాదితుని వాద్యాలు శిల్పకుని శిల్పాలు
చిత్రకుని చిత్రాలు అంగనల అందాలు
కందర్పు కయ్యాలు కవిరాజుకావ్యాలీ
కర్షకా నీ కట్టు కదిలినన్నాళ్లే''

ఇందులో ''కర్షకా నీ కట్టు కదిలినన్నాళ్ళే'' అనే మకుటం పునరావృతం అవటం వలన కర్షకుని ప్రాముఖ్యం వ్యక్తమవుతుంది.ప్రజలు వాడుకునే నానుడి గా మిగిలి పోయిందీ వాక్యం.

కాళోజీ ఏ విషయాన్నైనా నిర్భయంగా, నిర్మొహమాటంగా చెప్పడం అలవాటు.ఆయనకు కలిగిన భావం ఎదైనా సరే చెప్పవలసిందే.ఇతరులు ఏమనుకుంటారో అనే భయం లేదు. ఆంధ్ర మహా సభల ప్రభంజనం తెలంగాణా గ్రామాల్లో బలంగా వీస్తున్న రోజుల్లో ప్రజలు భూస్వాములు,,పోలీసులు చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా అనేక ప్రతిఘటనలు చేశారు. ఆ నాడు రక్షించ వలసిన పోలీసులే ప్రజల్ని నానా హింసలు పెడుతుంటే వాళ్ళ కిరాత కాలనుఎండగడ్తూ కాళోజి ఎన్నో గేయాలు రాశాడు.

''పాలన పేరిట పల్లెల్లో
జరిగే పాపం చాలింక
రక్షణకై ఏర్పడ్డ బలగమే
చేసే భక్షణ చాలింక''

అంటూ గద్దించాడు. కాళోజీ కైతలు విని కదలకుండా ప్రజలుండరని, వాళ్లు చైతన్యంతో మేల్కొని కాలం రాగానే కాటేసి తీరుతారని విశ్వాసాన్ని వ్యక్త పరిచాడు.

స్వాతంత్ర్యానంతరం మన ప్రజా రాజ్యం ఏదో చేస్తుందని ఎదురు చూసిన ప్రజలకు మిగిలింది నిరాశే

"స్వాతంత్ర్యం పేర సొంతానికి కట్లు
బయట పడనీయ దలచుకోలేదు ప్రభుత్వం
కూటముల కోటల్లో అధికారుల తత్వం"

అంటూ గాంధి గారికి విన్నవించుకొన్నారు. పంచవర్ష ప్రణాళికలు, పంచశీల సూత్రాలు ప్రజలకు ఏమి మేలు చేయక పోగా, వాటి పేరున డబ్బు ఎంతో ఖర్చు పెట్టి జనులకు అప్పు మాత్రం మిగిల్చారని వాపోతూ కవి,

"శృతి మించిన పంచశీల రాగాలాపన
మితిమీరిన పోకిరి పొరుగుల ప్రేలాపన
అప్పుల పాలై పోయింది జనత
తప్పుల కుప్పై పోయింది ప్రభుత"

అని వాపోతారు. అయితే ఈ పరిస్థితి పోయి గాంధి గారు కలలు గన్న గ్రామ రాజ్యమే రావాలంటే ప్రజల చేతుల్లోనే ఉందనే విషయాన్ని జ్ఞాపకం చేస్తూ,"ఓటిచ్చు అధికారమున్నట్టి వారు పురుషులెవ్వారు, కాపురుషులెవ్వారు గుర్తించి ఓటులను గురిపింప వలయు " అని హెచ్చరిక చేస్తారు.

ఇలా నా గొడవ లో నాటి నిజాం ప్రభుత్వం దురాగతాలను, నేటి ప్రజా ప్రభుత్వాల స్వార్థాలను మనం చూడ వచ్చు. దాశరధి దీన్ని గురించి చెపుతూ, "కాళోజీ నా గొడవలో చెప్పిందంతా అయ్యింది. ఈనాడు చెబుతున్నదంతా అవుతుంది. అతడు చెప్పనున్నదే కానుంది. త్రికాలజ్ఞుడైన మహర్షి కాళోజీ" అంటారు.

కాళోజీ నా గొడవ ను ప్రచురించడంలో శ్రద్ధ చూపించలేదనే విషయం నా గొడవ భాగాలు చదివితే అర్థమవుతుంది. ఏది నిజాం ప్రభుత్వం మీద రాసిందో ఏది మన ప్రజా ప్రభుత్వం గురించి రాసిందో తెలుసుకోవడం కష్టంగా ఉంది. అయినా ఇప్పటికీ ఆ కవితల్లోని వస్తువు సజీవంగానే వుంది. అంతే కాక వారి కవితల్లో పరస్పర వ్యతిరేకమైన అభిప్రాయాలు కూడా కొన్ని ఉన్నాయి. ఈ విషయాన్ని నా గొడవ మొదటి ప్రచురణ ముందు మాటల్లో ఆచార్య శ్రీ సుప్రసన్న సోదాహరణంగా వివరించారు. బహుశః దీనికి కారణ వారు దీన్ని ప్రచురించేటప్పుడు పునః పరశీలించక పోవడం కావచ్చు.

## భాష

ప్రజల భాషతో రాసిందే ప్రజా కవిత్వం. అంతేగాని ఏ ప్రజల కోసం వస్తువు నిర్దేశించబడిందో ఆ ప్రజలకు అర్థంగాని భాషలో రాయడం వ్యర్థం. కాళోజి భాష ప్రజల భాష.వాడుకలో ప్రజల్లో ఉన్న పదాలు హిందీవైనా, ఉర్దూవైనా, ఆంగ్ల పదాలైనా ఉపయోగించారు కాళోజీ. సలామత్, భాయీ భాయీ పోలింగ్ బూత్ బస్సుసీటు, బిజిలి వంటి పదాలు నిరక్షరాసులకైనా సరళంగానే అర్థమవుతాయి. ఇలా సజీవమైన భాషను ప్రయోగించడం వల్లనే కాళోజీ ప్రజా కవి అయినాడు.

## ఇతర రచనలు

కాళోజీ కొన్ని కథలు కూడా రాశారు. ''కాళోజీ కథలు'' అనే పేరుతో ఓ పుస్తకం ప్రచురింపబడింది. ఈ కథల్లో కాళోజీ నైజాం పాలనలోని ప్రజల జీవితాల్ని వర్ణించాడు. ఇంకా ''తుది విజయం మనది''' ,'' నిజం'', ''పార్థివం'' వీరి ఇతర రచనలు.

''నా భరతదేశ యాత్ర'', ''జీవన గీత'' వీరి అనువాద గ్రంథములు. ఇందులో ''జీవనగీత'' అనే అనువాద గ్రంథం కాళోజీ అనువాద నైపుణ్యానికి చక్కని నిదర్శన గ్రంథం. ఖలీల్ జిబ్రాన్ రాసిన ''ది ప్రాఫెట్'' కు తెలుగు పేరు జీవనగీత.ప్రపంచం లోని అనేక భాషల్లోకి అనువదించబడింది. అలాంటి ఉత్తమ గ్రంథాన్ని తెలుగు పాఠకులకు అందించటానికి కాళోజీ చేసిన కృషి సాటి లేనిది.

## ముగింపు

''ఒక్క చుక్క సిరా వేయి మెదళ్లకు కదలికి'' అనే వీరి మాటలు తెలుగునాట నానుడిగా నిలిచి పోయాయి. ప్రజల నాలుకల మీద నిలిచిపోయే కవిత్వం రాసిన వేమన, కాళోజీ ప్రాతః స్మరణీయులు.

''నా తపస్సు ఫలించి, నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ నా జాతి జనులు పాడుకొనే మంత్రంగా మ్రోగించాలని'' ప్రతి కవి కోరుకుంటాడు. అయితే అలా జాతి జనులు పాడుకొనే గీతాలు రాయడానికి కృషి చేయాలి ప్రతి కవి. కొంత మంది కవులు వాళ్ల ప్రతిభ, కృషి వల్ల ఇలా కలకాలం జాతి గుండెల్లో నిలిచి పోతారు.

కాళోజీ వ్యక్తిగా మొహమాటం లేని మనిషి. ఎవరి మీదనైనా, దేని మీదనైనా వారికి కలిగిన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా వెలిబుచ్చుతారు. మంచి ఎక్కడ ఏ కొద్దిగా కనిపించినా కాళోజీ మెచ్చుకుంటారు. శ్రీశ్రీ గురించి ఓ సందర్భంలో కాళోజీ.

''నువు రాసి పారేసిన కవితలు గుభాళిస్తున్నపుడు
నువు తాగి పారేసిన సీసాల కంపు మా కెందుకు?''

అంటూ శ్రీశ్రీ వ్యక్తిగా ఎలాంటి వాడైనా శ్రీశ్రీ తెనుగు వాడి ని వాడే ప్రతిభ కలవాడు అంటాడు.

జాతి గొడవను తన గొడవగా భావించి తన గళం వినిపించిన కాళోజీ ధన్యజీవి. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవిగా, ప్రజా కవిగా నిలిచి పోయిన కాళోజీ ప్రజల ఎదల్లో నిగూఢంగా నిరంతరం నిలిచిపోయే ఉన్నాడు........ఉంటాడు.

''ఉదయం
కానే కాదనుకోవడం
నిరాశ

ఉదయించి

అట్లానే వుండాలనుకోవడం

దురాశ".


********

వ్యాస కౌముది



# చేరా ఒక చెరగని జ్ఞాపకం

## శివచరణ్



చేరా గారితో నాకు ఇరవై యేళ్ళ క్రితం వారి మానస పుత్రిక ఆశాలత ద్వారా పరిచయం కలిగింది. ఆనాటి నుండి వారితో గౌరవ ప్రదమైన గాఢ మైత్రి కొనసాగింది. పరిచయం కలిగేనాటికే నేను వారి చేరాతల పాఠకుడిని, అభిమానిని. తెలుగులో మాండలికాలు, వాక్యము, సాహిత్యం మరియూ ఇతర అంశాలమీద కొద్దికాలం పాటు ఒక కోచింగ్ సెంటర్లో సివిల్ సర్వీసెస్ కి ప్రెపేర్ అయ్యే విద్యార్థుల కోసం ఆయనిచ్చిన సాధికారిక ఉపన్యాసాలు వినే అదృష్టం కలిగింది. ఆయన తెలుగు వాక్యం పుస్తకం ఇప్పటికీ ఒక ప్రామాణిక గ్రంథం. తెలుగు భాషా శాస్త్రవేత్తగా, సాహితీ విమర్శకుడిగా ఆయన సేవ అజరామరం. గొప్ప ప్రతిభ ఉండి ఎటువంటి బేషజాలు లేని వ్యక్తులు సాహిత్యలోకంలో అరుదు. ఆయనను దగ్గరిగా ఎరిగిన వారందరికీ తెలుసు ఆయన వ్యక్తిగా ఎంత ఉన్నతులో. అలాంటి మంచి మనసున్న చేరా మాష్టారిని కోల్పోవడం తెలుగు సాహితీలోకానికి తీరనిలోటే.

ఎంతో మంది కవులను తెలుగు పాఠకలోకానికి పరిచయం చేసి, వారి కవిత్వాన్ని విశ్లేషించి, వారికి గుర్తింపు తెచ్చి పెట్టిన ఘనత చేరాదే. స్త్రీవాద కవిత్వం మీద ఆయనకున్న ప్రత్యేకమైన అభిమానంతో చాలామంది కవయిత్రులని వెలుగులోకి తీసుకువచ్చారు. నాలుగు పదులు మాత్రమే జీవించిన కవయిత్రి సావిత్రిని ఆమె కవిత బందిపోట్లు విశ్లేషణతో, బి.యె విద్యార్థుల పాఠ్యాంశంగా మార్చి ఆమెని చిరాయువుని చేశారు చేరా. తమ కవిత్వాన్ని విశ్లేషించమనో, ముందు మాటలు రాయమనో వచ్చే

వత్తిడులకు ఆయన అప్పుడప్పుడు ఇబ్బంది పడేవారు. సన్నిహిత మిత్రుల వద్ద మాత్రమే ఇది వ్యక్త పరిచేవారు. ఎవరికీ లేదు,కాదు అని చెప్పటం నేనెరుగను.

రంగనాయికి గారి అభిమానంతో నేను చేరా గారి ఇంటి మనిషిగా మారిపోయాను. ఎన్నో సాయింత్రాలు సాహితీ సంగతులతో, కాఫీ సేవనంతో గడిచేవి. ముత్యాల సరాలమీద ఆయనకున్న అభిమానానికి ముచ్చటేసేది.వచనకవిత్వాన్ని భుజాన వేసుకున్న చేరాగారిలో, ప్రాచీన సాహిత్యాభిమాని కూడా ఉన్నాడు.నాకు వారింట్లోనే శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారితో పరిచయం కలిగింది. ఒకరు పద్య కవిత్వానికి విశేషాభిమాని, మరొకరు వచన కవిత్వ విశ్లేషకులు . కానీ వారిద్దరూ సాహిత్య చర్చలోనూ, ఇతర అంశాలలోనూ మంచి మిత్రులుగా వ్యవహరించేవారు. వివాదంలేని ఆరోగ్యకరమైన చర్చ నడిచేది. వివాదమొచ్చినా పరిష్కరించగల నైపుణ్యమూ ఉండేది. వాదనలో ఆయన పాటించే ప్రజాస్వామ్య విధానం మరెవరికీ సాధ్యం కాదు. అయినా ఇరుపక్కలా విమర్శలను ఎదుర్కొన్న ఆయనకి వాకాటి గారిచ్చిన 'ఉభయ కవి శతృవు ' బిరుదంటే చాలా ఇష్టం.

నేను ఇండియాలో ఉన్నరోజుల్లో నేను రాసిన చాలా కవితలకు చేరాగారే విశ్లేషకులు. కొన్ని కవితలని ఎంపిక చేసి ప్రచురణకు పంపమని చెబుతూవుండేవారు. చేరా మాష్టారి ప్రశంస కంటే ప్రచురణ గొప్పగా భావించే వాడినికాదు. ఎవరూ నొచ్చుకోకుండా కవిత్వాన్ని ఆయన విశ్లేషించే విధానం  అందరికీ నచ్చుతుంది. పేరున్న రచయితలనుండి కొత్త కవుల వరకూ అందరూ ఆయనతో సమయాన్ని గడపటానికి ఇష్ట పడే వారు. కారణం – సాహిత్యంలో తెలియని ఎన్నో సొబగుల్నీ, భాషా సంగతులనీ ఆయన దగ్గర తెలుసుకునే అవకాశం కలిగేది. ఆయన పారుతున్న నది లాంటి వారు. సాహిత్య దాహానికి కావలసినంత నీరు దొరికేది.

తానా సభలకి ముఖ్య ఆహ్వానితులుగా శాన్ ఫ్రాన్సిస్కో వచ్చినప్పుడు మా ఇంట్లో రెండు రోజులు ఉన్నారు. అప్పుడుకూడా ఎన్నో సాహిత్య విశేషాలను విశ్లేషించి చెప్పేవారు. తెలుగులో భక్తి రచనలమీద ముఖ్యంగా భాగవతంలోని పద్యాల సాహిత్య అంశాలమీద జరిగిన ఆసక్తికరమైన చర్చ నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. నేను రాసిన కవితలను ఎప్పుడైనా ఫోనులో వినిపిస్తే చాలా ఆసక్తిగా విని మెచ్చుకునేవారు.  రాజమండ్రిలో జరిగిన మా వివాహానికి వచ్చి నన్నూ,రజనీని ఆశీర్వదించారు.  ఆ రోజు ధవళేశ్వరంలో గోదావరి వడ్డున కాటన్ గెస్ట్ హౌస్ లో బస ఏర్పాటుచేస్తే, ఆ ప్రకృతి సౌందర్యానికి చిన్నపిల్లాడిలా సంబరపడ్డారు

లబ్ద ప్రతిష్టులైన తెలుగు కవులందరికీ చేరా గారితో పరిచయం ఉండే ఉంటుంది. ఎన్నో విషయాలను తెలుసుకొనే అవకాశం ఎక్కువగా కలిగే ఉంటుంది. కానీ, నాలాంటి ఒక సామాన్య పాఠకుడికి విలువైన సమయాన్నిచ్చి, చిరునవ్వుతో కూడిన ఆత్మీయతను పంచి, సాహితీ విశేషాలని పరిచయంచేసిన ఆయన గొప్పతనం గురించి ఏమని చెప్పను. తెలుగు సాహితీ లోకం ఆయన చేరాతలను, విమర్శనా వ్యాసాలను, మండలిక పరిశోధనలను, వాక్య తీరుతెన్నులనూ విశ్లేషిస్తుంది, సాహిత్య సేవను ప్రశంసిస్తుంది. వీటన్నిటివెనకున్న ఒక ఆత్మీయమైన మంచి మనిషిని భావితరాలు గుర్తించలేక పోవచ్చు. ఆయనతో అనుబంధమున్న వ్యక్తిగా చేరా నాకొక చెరగని జ్ఞాపకం.

ఆయన ఆరోగ్య సమస్యల గురించి తెలిసి, సన్నిహిత మిత్రుల ద్వారా ఆయన బాగోగులని కనుక్కుంటూ ఉండేవాడిని. వచ్చేసంవత్సరం వేసవిలో కలుద్దామని అనుకుంటుండగానే చేరా ఇకలేరనే వార్త వచ్చింది. ఏదో కొద్దిమంది యోగులకు మాత్రమే సాధ్యమయ్యే అనాయాస మరణాన్ని అయన ధ్యానంలో పొందారు. అది చాలు ఆయన ఎంత గొప్పవారో చెప్పటానికి.

********

వ్యాస కౌముది

# శత సంవత్సరాల కాళోజీ కవిత్వ పరామర్శ

## కాత్యాయనీ విద్మహే



జీవితం లోనూ, కవిత్వం లోనూ ఇంటి పేరు ధిక్కారానికి మారుపేరు. ఆ ఇంటి పేరు కాళోజీ. అతని పేరు నారాయణరావు. 2013 సెప్టెంబర్ 9 నుండి 2014 సెప్టెంబర్ 9 ఆయన శతజయంతి సంవత్సరం. తెలుగు ప్రాంతాలను ఒక గొడుగు కిందికి తెచ్చి, ఆంధ్ర జాతి భావనను ప్రోది చేసిన కాకతీయుల రాజధానిగా చరిత్ర ప్రసిద్ధికి ఎక్కిన వరంగల్ ఆయన ఊరు. న్యాయవాద వృత్తి. అదే ఆయన ప్రవృత్తి. నిజాం పాలనలో సకల సామాజిక ఆర్థిక రాజకీయ సంస్కరణ ఉద్యమాలు, సాయుధ పోరాటాలు, జాతీయోద్యమం, స్వాతంత్ర్యానంతరం-అసమానతకు, అన్యాయానికి, అవినీతికి, అధికారానికి వ్యతిరేకం గా వచ్చిన అన్ని ప్రజా రాజకీయ ఉద్యమాలు, విప్లవోద్యమాలు, పౌర హక్కుల ఉద్యమాల నుండి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ---వరకు అన్నింటిలో ఆయన అందువల్లనే క్రియాశీల కార్యకర్త కాగలిగాడు. ఆ జీవ లక్షణాన్నే కవిత్వ చిరునామా గా చేసుకున్నాడు. ఆ కవిత్వాన్ని, అది ఆవిష్కరించిన విలువలను జాతి జీవన యానానికి కరదీపిక లుగా అందించేందుకు శత జయంతి ఒక మంచి సందర్భం.

కాళోజీ 1940 నుండి కవిత్వం రాసినట్లు తెలుస్తున్నది. 1952 వరకు పన్నెండేళ్ళ కాలం మీద రాసిన 67 కవితలను 1953 జనవరి 1 నాడు"నా గొడవ" అనే పేరుతో సంకలనం ప్రచురించాడు. మళ్ళీ 13 ఏళ్లకు 1966 లో పరాభవ వసంతం, పరాభవ గ్రీష్మం, పరాభవ వర్షం, పరాభవ శరత్తు, పరాభవ హేమంతం, పరాభవ శిశిరం అనే శీర్షికలతో నా గొడవ ఆరు సంకలనాలు వెంట వెంటనే వచ్చాయి. ఇవి 127 కవితలు. మానవప్రవృత్తి, మానవజీవన వేదనలు, పార్లమెంటరీ ఎన్నికలు, పార్టీల, నేతల వైఖరులు, ఓటు విలువ, పౌర స్పృహ, ప్రజాస్వామ్యం, సమకాలీన రాజకీయ ఘటనలు మొదలయిన అనేకానేక అంశాల చుట్టూ అల్లిన కవితలు ఇవన్నీ. భారతదేశంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం పెట్టిన ఎమర్జన్సీ కాలంలోనూ నిషేధాలను ధిక్కరిస్తూ "నాగొడవ" నడుస్తూనే ఉన్నది. ప్రజల హక్కులను, పోరాడే హక్కును కాల రాస్తున్న ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ నినదించిన కవిత్వం

అది. అవి 76 కవితలు. ఇవి కాక భారత్ చైనా యుద్ధ సందర్భంలోనూ, బంగ్లాదేశ్ యుద్ధ సందర్భం లోనూ రాసిన కవితలు 20, తదితర కవితలు 33 ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమ కవితలు 87 ఉన్నాయి. ఈ కవిత్వం మొత్తం కలిపి "నా గొడవ" అనే పేరుతో బృహత్ సంకలనంగా కాళోజీ ఫౌండేషన్ (వరంగల్ )వారు 2001 సెప్టెంబర్ లో ప్రచురించారు. 2002 నవంబర్ 13 న మరణించే వరకు అరవయ్యేళ్ళ కాలం మీద నిరంతరం ఆయన రాస్తూ వచ్చినదంతా ఒకే ఒక మహాకావ్యం. అది --"-నా గొడవ"

గొడవ అంటే అల్లరి, ఆందోళన ---నలుగురి దృష్టిని ఆకర్షించటానికి చేసే హంగామా. కాళోజీ అల్లరి, ఆందోళన దేనికోసం ?అవి ఎవరిని ఆకర్షించాలి ?అందువల్ల ప్రయోజనం ఏమిటి? కాళోజీ 'ఈప్స'కవిత చదివితే ఈ ప్రశ్నలకు సమాధానాలు స్ఫురిస్తాయనుకుంటాను."నాకున్నది కోరిక" అని మొదలవుతుంది ఈ కవిత. -------"నా గొడవ నీకు రాసిన ఉత్తరంగా ఉండాలని" అన్న తరువాతి పాదం ఆత్మీయత, సారళ్యం కాళోజీ కవిత్వ లక్షణం అని సూచిస్తుంది. అదే సమయం లో అది వట్టి వచనం కాదు, కవిత్వమే అని నిర్ధారిస్తూ" చదువరులకు కవిత్వంగా ఉండాలని" మూడవ పాద లో అంటాడు. "భావుకులకు మెదడుగా వుండాలని / మేధావులకు ఎడద గా ఉండాలని"అన్న తరువాతి రెండు పాదాలలో ఎద మెదడుల కలయికగా కవిత్వం ఉండాలన్న దృక్పధాన్ని కనబరిచాడు. ఆ తరువాతి పాదాలలో నా గొడవ పేరున తాను చెప్పే కవిత్వం. ఏమి చెయ్యాలని తాను ఆశిస్తున్నాడో పెద్ద జాబితానే ఇచ్చాడు. కరుణ పుట్టించేదిగా, ఆపద గుర్తించేదిగా, స్నేహాన్ని బ్రతికించేదిగా, విచ్చలవిడి తనానికి గుదిబండగా, బ్రతుక్కి బాసటగా, జాతికి నీతిగా, శత్రువుకు భీతిగా నా గొడవ ఉండాలన్నది కోరిక అంటున్నాడని అంటే - అతని గొడవ లోకం లో దయ, స్నేహం,ధైర్యం, నీతి-మొదలయిన విలువలను విస్తరింప చేయటానికి, కష్టం లో ఉన్నవాళ్ళకు ఎరుకను కలిగించటానికి నిబద్ధమయినదన్న మాట. అసహాయులకు నోరు ఇవ్వాలనుకొన్న కవి సంకల్పం అది. తన కవిత్వానికి వేదన వేదంగా ఉండాలనుకొన్న ఆధునిక వాల్మీకి కాళోజీ. ఇక ఆయనకు శత్రువు ఎవరు? సమాజం లో దయ, స్నేహం,ధైర్యం, నీతి మొదలయిన ఉత్తమ విలువలకు విఘాతం కలిగించే దుష్ట శక్తులు. అమాయకులకు ఆపద కలిగించే వ్యక్తులు, వ్యవస్థలు. అవే ఆయనకు శత్రువులు. శత్రువుకు భయం కలిగించటం కాళోజీ కవిత్వ ఆశయం. శత్రువు భయపడి వెనుతిరిగితే తాను ప్రచారం చేయ దలచుకున్న విలువలు అప్రతిహతంగా పురోగమిస్తాయి. ఈప్స కవిత ముగింపులో కవి ఆశించినట్లు దివిని భువికి దించటం, ధాత్రిని ధాత్రిగా ఉంచటం, మనిషిని మనిషిగా చేయటం ఆచరణ వాస్తవం అయ్యేది అప్పుడే.

అందువల్ల కాళోజి"నాగొడవ"అతని స్వార్ధానికి సంబంధించినది కాదు. ప్రజల అసంతృప్తులకు, ఆకాంక్షలకు సంబంధించిన గొడవ. చలం మహా ప్రస్థానానికి యోగ్యతా పత్రం రాస్తూ కవులను తమబాధను ప్రపంచపు బాధగా ప్రకటించే వాళ్ళు, ప్రపంచపు బాధను తమ బాధగా చేసుకునే వాళ్ళు అని రెండు రకాలుగా వర్గీ కరించి చెప్పాడు. కాళోజీ శ్రీశ్రీ లాగానే రెండవ వర్గానికి చెందినవాడు. వేదన వేదం అయి, పదం అయి కాళోజీ కవిత్వ పాదాన్ని అలంకరించింది. కాళోజీ కవిత్వంలో వేదన జీవుని వేదన కాదు. అది సామాజిక జీవన సంవేదన అన్యాయాన్ని ఎదిరించాలన్న కామన. సమకాలీన సామాజిక పరిణామాలకు ప్రతిస్పందిస్తూ, మారుతూ, మార్పును కోరుతూ జీవించిన నిత్య చెయితన్య శీలి కాళోజీ. అతని జీవితవిశ్వాసాలు, ఆచరణ అతని కవిత్వం.

"అన్యాయన్నేదిరిస్తే
నాగొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు
నాకు ఆరాధ్యుడు"

అనటంలోనే అయన కవితా తత్వం ఇమిడి ఉంది.

1942లో నిజామ్ రాష్ట్రం లో తెలుగు ప్రజలు మాతృ భాష పట్ల చూపే నిరాదరణకు స్పందించి "ఆంధ్రుడా"అనే కవిత రాసాడు కాళోజీ. "ఏభాషరా నీది ఏమి వేషమురా/ఈ భాష ఈ వేష మెవరి కోసమురా" అని ప్రారంభం అయ్యే ఈ కవితలో స్వస్థాన వేష భాషాభిమానాన్ని కోల్పోయిన జాతి అలసత్వం పట్ల తన అసమ్మతిని ప్రకటించాడు. "అన్య భాషలు నేర్చి ఆంధ్రంబురాదంచు /సకిలించు ఆంధ్రుడా!చావవెందుకురా ?" అన్న ముగింపు పాదాలలో ఆ వైఖరిని తీవ్ర స్వరం తో నిరసించాడు. 1960 ల నాటికి ఆంధ్రభాష అంతా ఒకే శిలాజం కాదన్న అవగాహన కలగటం తో ఆయన భాషా దృక్పథమే మారింది." తెలుగుబాస ఎన్నితీర్లు" అన్నకవిత అందుకు మంచి నిదర్శనం.

1969ప్రత్యేక తెలంగాణా సందర్భం నుండి ఈ దీర్ఘ కవిత వచ్చింది."తెలుగుబాస ఎన్నితీర్లు /తెలుగు యాస ఎన్ని తీర్లు /వాడుకలున్నన్ని తీర్లు"అని ప్రారంభం అయ్యే ఈ కవితలో తెలంగాణాతో సహా ఉత్తరాంధ్ర, రాయలసీమ మాండలికాలలో రాస్తే తప్పేమిటని ప్రశ్నించాడు." రెండున్నర జిల్లోళ్ళు /రెండు మూడు తెగలోల్లు /చదువుకున్న కులపోళ్లు /రెండున్నర జిల్లాలదే /దండిబాస అని అంటే"అందులో న్యాయం ఏమున్నదని నిలదీశాడు."తక్కినోళ్ళ నోళ్ళ యాస /తొక్కి పెట్టి నొక్కేస్తే"తిరుబాటు తప్పదన్నాడు. ఆ రకంగా కాళోజీ తెలుగు భాషను ఇంగ్లీష్, ఉర్దూ అధికార భాషలయి అణచి వేస్తుంటే ఆనాడు ఎలా ఆగ్రహించాడో అలాగే పాతిక సంవత్సరాల తరువాత తెలుగు భాష లోనే చలామణి అవుతున్న అంతర్గత ఆధిపత్యాల పయి ధ్వజమెత్తాడు.

ప్రజా స్వామ్య రాజ్య భావనకు నిబద్ధుడు కాళోజీ. ప్రజలకు ఓటు ద్వారా తమ ప్రతినిధులను శాసన సభకు పంపే అవకాశం ఉండాలి. శాసన సభలో వాళ్ళు ప్రజోపయోగమయిన విధానాల రూప కల్పనకు బాధ్యత వహించాలి. ఓటు వినియోగం విషయంలో ప్రజలను, ప్రజా ప్రయోజనాల విషయంలో పాలకవర్గంలో భాగమయిన వాళ్ళను ఆయన ఎప్పుడూ హెచ్చరిస్తూనే ఉన్నాడు. 1939 లో నిజామ్ ఇస్లహాత్ అనే పేర ప్రవేశ పెట్టిన రాజ్యాంగ సంస్కరణల ఫలితంగా వృత్తుల ప్రాతిపదిక పయి ఎన్నికలు జరిగి మంత్రివర్గం ఏర్పడింది. అది అసెంబ్లీకి కాక నిజామ్ కు బాధ్యత వహించేది కావటం వల్ల కాళోజీ దానిని స్వాగంతించలేక పోయాడు. ఆనాడు స్టేట్ కాంగ్రెస్ దానిని బహిష్కరిస్తే దానికి మద్దతు గా తాను" ఇస్లహాత్ ఎందులకు" అని కవిత రాయటమే కాక ఆ సభకు ఎన్నికయిన బలదేవ్ పతంగే ని, పింగిలి వెంకట్రాం రెడ్డి ని, జస్టిస్ లక్ష్మారెడ్డి ని విమర్శిస్తూ కవితలు రాసాడు. 1947 లో నైజాం మంత్రివర్గం లో చేరటానికి వచ్చిన ఆహ్వానాన్నిబూర్గుల రామకృష్ణారావు తిరస్కరించాడని" గట్టిగుండెకలవాడని"అభినందిస్తూ కాళోజీ కవిత రాయటం గమనించ వచ్చు. స్వాతంత్ర్యానంతర ప్రజా స్వామ్య పాలనకు, పాలకులకు కూడా నిత్య హెచ్చరికగా కవిత్వం రాసాడు కాళోజీ. 1964 నాటికే ప్రజాస్వామ్యం లో ప్రజాసేవ అనే మాట దాని సారాన్ని పూర్తిగా కోల్పోయిందని గ్రహించాడు. ప్రజాసేవ పేరుతో స్వప్రయోజనాలు తీర్చుకుంటున్న నాయకులను ఎండ గడుతూ –"ప్రజాసేవన పేర బ్రతకండీ, తిన్నంగ మీరు/ప్రజల సొత్తును మీదెయనుకోండి /సులభమయిన భుక్తి మార్గము/సుళువుగా పయికొచ్చు మార్గము"అని ప్రారంభించి రాసిన వ్యంగ్య కవిత చెప్పుకో దగినది.

1973 లో "కలదందురు లోకసభను /కలదందురు ప్రభుత్వములోన పంచాయితిలో /కలదందురు రాజ్యంగమున /కలదు ప్రజాస్వామ్యమనెడు వింత కలదో ? లేదో ?"అని సందేహాన్ని వెలిబుచ్చాడు అంటే ఆయన సమకాలీన పార్లమెంటరీ రాజకీయాలను సన్నిహితం గా గమనిస్తూ ఎంత విసిగి పోయాడో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ని"అధికార రాజకీయార్భాటము :ఎన్నాళ్ళు ?ప్రజాకీయాధికార పరాభవము :ఎన్నాళ్ళు?"అని ప్రశ్నిస్తూ కవిత (మంత్రగాడు మర్రిచెన్న ) రాయటమే కాదు " ఏమంటావ్ మర్రిచెన్నా ?" అనే కవితలో ప్రజాస్వామ్యం పోలీసు రాజ్యం గా మారటాన్ని, ప్రజలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా కాలరాయ బడటాన్ని తీవ్రంగా ఖండించాడు.

ఎమర్జన్సీ కాలంలో(1975)ప్రధాని ఇందిరా గాంధీ ని సంబోధిస్తూ ఆమె రాజకీయ విధానాలను విమర్శకు పెడుతూ కాళోజీ రాసిన కవితలు, రాష్ట్రపతిని, జలగం వెంగళరావు ని సంబోధిస్తూ రాసిన కవితలు పాలక వర్గం పయి బాధ్యతాయుతమయిన ప్రతిపక్షం ఎక్కు పెట్టిన నిశిత విమర్శనాస్త్రాలు. అలాగే ఆయనకు ప్రజాస్వామ్య మనుగడకు ఊపిరి పౌర చయితన్యం అని కూడా తెలుసు.కనుకనే 1949 నుండే " ప్రాణతుల్యము ప్రజాస్వామ్యమున ఓటు"అని చెప్తూ వచ్చాడు." పురుషులేవ్వారు కాపురుషులెవ్వారు /గుర్తించి ఓటులను గురిపింపవలయు" అని హెచ్చరించాడు. పౌరుడు అంటే వివేకవంతుడు. పౌరుల వివేకం ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ. నేటి బాలలే రేపటి పౌరులు అన్నసూక్తిని" పెరిగిన పోరడె పౌరుడు"అని సాదా సీదా తెలంగాణ పలుకుబడి లో చెప్పటమే కాదు... తరిగిన పౌరుడె పోరడు అని తిరగేసి చెప్పి బానిసబలగం కవితలో పౌరులకు ఉండవలసిన వివేకం గురించి సూచించాడు. హక్కుల కోసం నిలబడని పౌరులు ఆయన దృష్టిలో పురుగులు." పౌరులమా ?పురుగులమా ?"అన్న కవితలో అదే చెప్పాడు. పౌర హక్కుల ఉద్యమానికి తాను బాసట అయి మహామనీషిగా చరిత్రలో నిలబడ్డాడు.

ప్రజాస్వామ్యమంటే" సంరక్షిత పౌర మతము " అని భావించే కాళోజీ అహింసా వాది అయిన గాంధీజీ ని అభిమానించటం అతి సహజం. ఎంతగా అభిమానించాడు అంటే ఆయన అభిమతం దేశానికి ఆదర్శం అయి ఆచరణ వాస్తవం కావాలని క లలు కనే అంతగా... అయితే తన కలలు కల్లలే అని గాంధి మరణించే నాటికే తనకు అర్ధమవుతుంటే లోలోపల పొగిలే దిగులుని,దుఃఖాన్ని అ సంఖ్యాక కవితలుగా రాసాడు. వ్యంగ్యం ఆ కవితలలో జ్వలిస్తుంటుంది."బాపూజీ బ్రతికిన యప్పటి /సత్యాహింసల దుప్పటి/బొంకులబొంతగ మారెను"అని" ఈ అలజడి కొన్నాళ్ళు" కవిత రాసేనాటికే (1951)గుర్తించినప్పటికీ ఏమో మంచికి మారకపోతుందా ఈ పాలక వర్గం..అన్న చిన్న ఆశతో అనుక్షణం దానిని సంబోధిస్తూ కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ, హెచ్చరిస్తూ, మొట్టికాయలు వేస్తూ, అసమ్మతిని, నిరసనను వ్యక్తం చేస్తూ కవిత్వం రాస్తూ ఇరవయ్యేళ్ళ పాటు సహనాన్ని కనబరుస్తూనే వచ్చాడు కాళోజీ. మొండికెత్తిన, ప్రజాస్వామిక సారాన్ని, పరమార్థాన్ని కోల్పోయిన రాజ్యం పయి ధిక్కార ప్రకటన అనివార్యమని భావించాడు. తిరుగు బాటును సమర్ధించాడు."తిరుగబడమంటే తప్పా"(1971)అనే కవిత ఆ పరిణామానికి కొండ గుర్తు.

"ఓసీ ప్రభుత్వమా!
దోపిడి వర్గాల నువ్వు అదుపులో పెట్టజాలనప్పుడు
పీడిత వర్గాల నేను తిరుగబడమంటే తప్పా?
బ్లాకుమార్కెటు దొర్ల నల్లబజారు కుబేరుల
నువు ఉరిదీయాలే నప్పుడు
ప్రజానీకాన్నే కసిదీర్చు కొమ్మనడం తప్పా?
కలితీ గత్తర పిశాచాల నువ్వు చితప లేనప్పుడు
కూలీ లేని సుత్తెల నా పని కాస్తా చెయ్యమంటే తప్పా ?
రౌడీ నాయకుల నువ్వు పట్టి బంధించలేనప్పుడు
ప్రజల్నే సాయుధులు కమ్మనడం తప్పా ?
దోపిడిదొర్లకే నువు సాయపడుతున్నప్పుడు
సాయుధులయ్ నిన్ను మూలంట పెరకమని
నీ అస్తిత్వం లేకుండా చెయ్యమని

జనాన్ని ప్రేరేపిస్తే తప్పా ?
చెప్పు
ప్రతి హింస తప్పెట్లవునో చెప్పు
హిరణ్యకశ్యపుని పొట్ట చీల్చి
నరసింహుడు చేసిందే ప్రతిహింస
నువ్వు చేస్తున్నది
హిరణ్యకశ్యపుని అధికృత హింస
నాది అక్షరాధికారం"

ప్రభుత్వానికంటే ప్రజలచేత ఎన్నుకొనబడి చట్టబద్ధం గా పొందిన అధికారం ఉంది. పీడిత వర్గాలను తిరగబడమనటానికి, ప్రజలను సాయుధులను కమ్మనటానికి

నీకున్న అధికారం ఏమిటని ఎవరయినా ప్రశ్నించవచ్చు. కవికి ఉన్న అధికారం అక్షరం పయిన. అక్షరాన్ని అస్త్రం గా సానపెట్టి వాడగల నయిపుణ్యం దృక్పధం వల్ల అలవడుతుంది. అక్షరాన్ని ప్రజా ప్రయోజనాలకు అంకితం చేసిన కవి కనుక కాళోజీ నాది అక్షరాధికారం అని గొప్ప విశ్వాసం తో ప్రకటించ గలిగాడు. రాజ్యాధికారం అక్షరాధికారం ముందు దిగదుడుపే. రాజ్యాధికారం కోసం నిరంతర సంఘర్షణలు,ఒకరు అధికారాన్ని కోల్పోవటం, మరొకరు పొందటం చరిత్ర పొడుగునా జరుగుతున్నదే. అందువల్ల నశింపు దాని లక్షణం." అక్షర" అధికారం నాశనం లేనిది. అది ప్రజల మధ్య నిరంతరం ధ్వనించే ప్రణవం. కవి గా కాళోజీ ధీమా అదే.

1975 లో జాతిని కాపాడుటకే ఎమర్జన్సీ అని ఇందిరా గాంధీ చెప్పిన దానిని వీరభక్తి తో సమర్ధించిన ఆనాటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ను సంబోధిస్తూ రాసిన"జాతిని కాపాడుటకు"అనే కవితలో ఈ ధీమా ను మరింత స్పష్టంగా, సోదాహరణం గా వ్యక్తం చేసాడు. ఎమర్జన్సీ ఘాతుకాలను దృష్టిలో పెట్టుకొని ఆ కవితలో"పట్టెయ్యి కాళోజీ ని / మెడ కొట్టెయ్యి కాళోజీ ది / నా గొడవ సాగకుండ/ చేసెయ్యి వెంగళ్రావ్".... అంటూనే నియంతలు కాల గర్భం లో నశించి పోతారు కాని వాటిని ధిక్కరించి నిలిచిన ప్రజల ఆందోళనలు, వాటిని అక్షరీ కరించిన కవి వాణి చరిత్రలో నిలిచి ఉన్నాయని చెప్పాడు. దానికి కొనసాగింపుగా" నీఉండవు, నీ మాటుండదు / నీ ఆసర పయిన ఉన్న /ఇందిరమ్మ ఉండదసలు /నా మాటుంటది /ఈనాడు కాకున్న /నువ్వు లేని నాడు /నీ మాటలేని నాడు /నామాట నిలిచి ఉంటది /బ్రతికి ఉన్న ప్రజ వింటది"అని చెప్పిన కాళోజీ లోని ఈ మానవీయ జీవిత తాత్విక బలం వర్తమాన కవి ప్రపంచానికి లభించిన గొప్ప వారసత్వ సంపద. దాన్ని అందిపుచ్చుకొనటమే కాళోజికి శత జయంతి నివాళి.

********

# వ్యాస కౌముది



## కవికి స్వవిమర్శ అవసరమే!
## కర్లపాలెం హనుమంతరావు

ఏకాలంలోనైనా కవిత్వానికి ఆదరణ కొంచెం తక్కువే. వర్తమానంలో ఐతే ఇది మరీ ఎక్కువ. వ్యాపార పత్రికలలో కవిత్వానికి దక్కుతున్న చోటు---ఆ చోటులో కనిపిస్తున్న కవిత్వం గమనిస్తే..నిజానికి ఎవరికీ కవిత్వం మీద అంత సదభిప్రాయం కలిగే అవకాశం లేదు. కవిత్వానికే మీదు కట్టిన కొన్ని సాహిత్య పత్రికల్లో సైతం లబ్ధ ప్రతిష్టులకు మాత్రమే అవకాశం దక్కే పరిస్థితి. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా కవిత్వం ధారాపాతంగా వర్షిస్తూనే ఉండటం హర్షించదగ్గ పరిణామమే.

కవిత్వం మీద మోజు చూపిస్తున్న వర్గాల్లో ముఖ్యంగా యువతదే ప్రధాన భూమిక. ఇది మరీ సంతోషించదగ్గ విషయం. ఇప్పుడు వస్తున్న కవితాసంపుటాలే ఇందుకు ఉదాహరణ.

కవిత్వం అంటే ఒకప్పుడు చంధోబద్ధంగా ఉండి తీరాల్సిన పరిస్థితి. భాష మీద కొంత పట్టు---వ్యాకరణం మీద కనీస అవగాహన---పూర్వ సాహిత్యంతో స్వల్పంగానైనా పరిచయం లేకుండా కవిత్వం రాయడానికి అవకాశం ఉండేది కాదు. గిడుగు వారి వ్యావహారికోద్యమ ఫలితంగానో, గురజాడ వంటి అభ్యుదయవాదుల కృషి మూలకంగానో---శ్రీశ్రీ వంటి అతివాదుల పుణ్యమా అనో చందోబంధనాలన్నీ చటాఫట్ తెగిపోయి తెలుగు కవితామతల్లికి సంపూర్ణ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభించాయి. కాలానుగుణమైన మార్పులు ఎన్నో చోటు చేసుకోవడం వల్ల కవిత్వం రూపమే పూర్తిగామారి పోయింది. ఇవాళ మనసుకి ఎలా అనిపిస్తే అలా రాయడమే అసలైన కవిత్వం అనే భావన పూర్తిగా బలపడి పోయింది. అదీ ఆనందించ దగ్గ పరిణామమే. కాకపోతే ఈ స్వేచ్ఛను నేటి యువత నిజంగా ఎంత సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నారన్నదే ప్రశ్న.

భాషాపాటవం, సంవిధాన చాతుర్యం, శిల్ప విజ్ఞానం పుష్టికరమైన కవిత్వానికి ముఖ్యమైన దినుసులు. అవి స్వాధీనం అవాలంటే ఒక రస తపస్సు తప్పనిసరి. గతకాలపు కవితా ప్రక్రియలను (ఇప్పుడు మనం వాటిని ఉపయోగించకపోయినా సరే)ఒక పరిశీలనా దృష్టితో.. సావధాన చిత్తంతో--- అధ్యయనం చేయకుండా రాయబూనుకుంటే ఆ కవిత్వం తేలిపోతుంది. నన్నయ భారతం ఎందుకు రాయాల్సి వచ్చింది? పాల్కురికి సోమనాథుడు తన కాలం నాటి ఇతర కవుల మాదిరిగా కాకుండా దేశికవితల్లోనే రచనలు ఎందుకు చేయాల్సి వచ్చింది? తిక్కనగారు భారతాన్ని ఎంత నాటకీయత దట్టించి రాసారూ? శ్రీనాథుడుకి, పోతనకు వ్యక్తిత్వాల మధ్య వైరుధ్యం

కన్నా.. వ్యక్తీకరణల మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? రాయల వారి భువన విజయంలోని అష్టదిగ్గజాల మధ్య గల రాజకీయాలకన్నా..వారి వారి రచనల మధ్య గల సామ్యాలు.. తారతమ్యాలు ఎలాంటివి? ప్రబంధ సాహిత్యం ఎందుకు చివరి దశలో తిరస్కరణకు గురయింది? పద్య ధోరణుల మీద భావకవిత్వం చేసిన తిరుగుబాటు ఎటువంటిది? నవ్యకవిత్వం వచ్చి భావవిత్వాన్ని ఎలా వెనక్కు నెట్టి పారేసింది.. నవ్య కవిత్వం మొత్తం అభ్యుదయ కవిత్వమే అనుకోవడం ఎంతవరకు సబబు? అభ్యుదయ కవిత్వం మీదా దిగంబరకవులు ఎలా ఎందుకు తిరగబడినట్లు? ఆ వేడి ఇట్టే చప్పున చల్లారి పోవడానికి వెనక తాత్త్వికమైన కారణాలేమన్నా ఉన్నాయా? విప్లవ కవిత్వం ఎప్పుడు ఏ సందర్భంలో ఎవరి ఏ అవసరాలకు అనుగుణంగా చొచ్చు కొనొచ్చింది..? తరువాతి కాలంలో అదీ చీలికలు పాలవటానికి కారణాలేమిటి? ప్రపంచీకరణ పెచ్చు మీరుతున్న తరుణంలో కవిత్వంలో జరిగిన పరిణామాలు ఎలాంటివి?ఆధునికానంతర వాదంగా ముందుకు వచ్చిన... వస్తున్న ఇవాళ్టి అస్తిత్వ పోరాటాల కథా కమామిషు లేమిటి? కుల మత వర్గ లింగ వ్యత్యాసాల ఆధారంగా కవిత్వంలో కొత్తగా ఏర్పడుతున్న అస్తిత్వ ధోరణుల ముందు గతి ఏమిటి? ఎలాంటి విశ్వ సాహిత్యంతో మన సాహిత్యం ముందు నుంచీ ప్రభావిత మవుతూ వచ్చింది? ప్రస్తుతం మనం రాస్తున్న కవిత్వం ప్రపంచ సాహిత్యంతో ఏ మేరకు తులనాత్మకంగా తూగ గలుగుతోంది? ఇలా--- కవిత్వ చరిత్రను మొత్తంగా ఒక స్థూల దృష్టితో అర్థం చేసుకునే ప్రయత్నం ఏదీ చేయకుండా.. నిజానికి అర్థవంతమైన కవిత్వం రాయడం కుదరదు. ఆ పని చేస్తున్న యువకవులు ఎంతమంది అంటే.. వచ్చే సమాధానం అంత సంతృప్తికరంగా లేదు.

అధ్యయనం ఒక వంకనుంచి జరుగాల్సిన ప్రయత్నమైతే.. ఇంకో వంకనుంచి ఆచరణాత్మకమైన కృషీ ఇంకెంతో జరగాల్సివుంది. ఒక కవిత రాయడం పూర్తయి నదనుకున్న తరువాత.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటున్నామా అంటే అదీ సందేహమే. "కవి తన ప్రతి అభివ్యక్తినీ నిశితంగా తీర్చి దిద్దుకున్నప్పుడే..ఆ భావ శకలాలు చదువరి హృదయ క్షేత్రంలో బలంగా నాటుకునే అవకాశం ఉండేది"అంటారు ప్రముఖ సీనియర్ కవి ఆవంత్స సోమసుందర్ ఒక పరిశీలనా వ్యాసంలో. కవితకు ఈ సునిశితత్వం ఎలా సంక్రమిస్తుంది?ఆయన మాటల్లోనే చెప్పాలంటే---"రచన పూర్తయిన తరువాత చప్పున తృప్తి పడకుండా---చెప్పిన రీతి కంటే మరింత రమణీయంగా తీర్చిదిద్దటానికి ఇంకేమన్నా అవకాశాలున్నాయా?' అని అధ్యయన బుద్ధితో పరిశీలించుకోవాలి. సంవిధానం విషయంలో భావాభివ్యక్తి విషయంలో మరిన్ని మెరుగులు సంతరించుకోగల పరాత్మక పరీక్షకు కవి పూనుకున్నప్పుడే ఉత్తమత్వం కవిత్వంలోనుంచి పుట్టుకొచ్చేది. ఇదీ సోమసుందర్ అభిప్రాయం. ఈ ధ్యాన మగ్నతను ప్రారంభంనుంచే అలవర్చుకున్న వాడే మంచి కవిగా రూపు దిద్దుకునే అవకాశం పెరిగేది. ఓర్పు లేని కవి ఎంత రాసినా నేర్పు కొరవడి తేలిపోయే అవకాశమే ఎక్కువ.

ప్రతిభను నిత్య హరరితంగా రక్షించేది వ్యుత్పన్నతే. ఇది లోకవృత్త పరిశీలన వల్లా, ముందే చెప్పుకున్నట్లు విస్తృత గ్రంధాధ్యయనం వల్లా,అనుభవ పరిపాకంలో ఆలోచనలను జీర్ణించుకోవడం వల్ల ఏర్పడుతుంది.భావుకత్వం ఒక్కటే కవిని ఒక మంచికవిగా తీర్చిదిద్దలేదు.రచన పూర్తయిన వెంటనే నిర్ధపు స్వరూపం సిద్దించినట్లు తృప్తిపడే వాడు తనకు తానే కాదు కవిత్వానికి కూడా హాని చేస్తున్నట్లు లెక్క.రాసేసిని మరుక్షణంలోనే ఏ పత్రికకో పంపించాలనో..ఇవాళ ఈ అంతర్జాలంలో అత్యవసరంగా అత్యంత సులభంగా ప్రచురించుకునే వీలుంది కనక..కవిసంగమం లాంటి వేదికలో ప్రకటించేసేయాలనో---గత్తర పడితే.. చివరికి దక్కేది ఒక వ్యతిరేక ఫలితం మాత్రమే కాదు---తుడుపు కోవడానికి చాలా కష్టపడాల్సిన 'చెడ్డముద్ర' .

అందుకే రచన పూర్తవంగానే కవి అవతారం చాలించి విమర్శకుడి అవతారం ఎత్తండి. కవికి.. కవిత్వానికీ అది చాలా మేలు చేస్తుంది.★★★

# భారతీయేతర జానపదగాథలు – మానవజీవితం

: డా. శిరీష ఈడ్పుగంటి

సాహిత్యం సమాజం నుండి పుడుతుంది. సమాజంలోని వ్యక్తులు, స్వభావాలు, వారివారి జీవితాలు, సుఖదుఃఖాలు మొదలైన అంశాలన్నింటి గూర్చి రచయితలు సాహిత్యరచనలరూపంలో పాఠకులకు తెలియజేస్తారు. తద్వారా మనిషి వాటిని చదివి మానసిక ఆనందాన్ని పొందుతున్నాడు. సాహిత్యం మనిషి జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అంతేగాకుండా మనిషి జీవితానికి, సామాజికస్థితికి అత్యంత చేరువలో ఉంటుంది.

సాహిత్యం అనేది రచనలు చేసే కళ. సాహిత్యం అనే పదానికి అర్థం "అక్షరాలతో సాన్నిహిత్యం". ఇది ఒక ప్రక్రియ. ఒక సాహిత్యప్రక్రియను పాఠకునికి ఒక నిర్దిష్టప్రభావాన్ని అందించడానికి సాహిత్యరచనలో ఉపయోగిస్తారు. మనిషి జీవితాన్ని తీసుకుని ఒక స్వచ్ఛమైన కళారూపంగా మార్చి చూపేది సాహిత్యప్రక్రియ. ఒక జీవన యానాన్ని ఆ ప్రయాణంలో నమోదైన సంఘటనలను పునర్నిర్మిస్తుంది. వాస్తవబద్ధమైన మానవజీవితాన్ని ప్రదర్శిస్తుంది. మానవ జీవితాన్ని, మనిషి వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తుంది. ఈ సాహిత్యప్రక్రియ మనకు రెండురకాలుగా కనబడుతుంది. 1. లిఖితరూపం 2. మౌఖికం. లిఖితరూప సాహిత్యప్రక్రియ అనేది రచనల రూపంలో కనిపిస్తుంది. నవల, నాటకం, పద్యం, గద్యం, శతకం, కథా... మొదలైన ప్రక్రియలరూపంలో సాహిత్యం లిఖితరూపంలో ఉంటుంది. మౌఖిక సాహిత్యప్రక్రియ మౌఖిక సంప్రదాయాలను సూచిస్తుంది. వీటిలో ఇతిహాస, కవిత్వ, నాటక, జానపదగాథ, జానపదగేయగాథ వంటివి పలురకాలున్నాయి. ఈ మౌఖికసాహిత్యంలోని జానపదగాథాప్రక్రియను గూర్చి ఈ వ్యాసంలో ప్రస్తావిస్తున్నాను.

**జానపదగాథాప్రక్రియ**

జానపదగాథలు అనేకం కనిపిస్తాయి. ***బొబ్బిలికథ*** మన తెలుగుప్రాంతంలో ఒక వీరోచిత జానపదగాథ. తెలుగేతర ప్రాంతాలలో కూడా జానపదగాథలున్నాయి. ***మల్లెలయువరాజు*** తమిళంలోని జానపదగాథ. హిందూమతంలోనే కాక బౌద్ధ, జైన మతాలలో కూడా జానపదగాథలున్నాయి. గౌతమబుద్ధుడు ఒక తెల్ల ఏనుగురూపంలో భూలోకంలో అవతరించినట్లు గాథ ఉంది. ఈవిధంగా మనదేశంలో తెలుగు, తెలుగేతర ప్రాంతాలలోనూ, వివిధమతాలలోనూ జానపదగాథలున్నట్లే భారతీయేతర ప్రాంతాలలో కూడా జానపదగాథలున్నాయి.

**భారతీయేతర జానపదగాథలు**

ప్రపంచసాహిత్యం వలె భారతీయసాహిత్యం వివిధప్రక్రియల రూపంలో ఉంది. వాటిల్లో ఒక ప్రక్రియ జానపదగాథ. భారతదేశంలో వివిధ ప్రాంతాలలో పలురకాల జానపదగాథలున్నాయి. అలాగే ప్రపంచంలో వివిధదేశాలలో (భారతీయేతర ప్రాంతాలలో) అనేక జానపదగాథలు కనిపిస్తాయి. ఈ జానపదగాథలలో ఐదింటిని (ఐదు ప్రాంతాలకు చెందిన) ప్రస్తుత వ్యాసంలో చర్చిస్తున్నాను. ఈ ఐదు జానపదగాథలను వివరిస్తూ, వాటిలో మానవజీవితం ఏవిధంగా ఉన్నది తెలుపుతున్నాను. ఈ గాథలలోని మానవుని ఆలోచన, బుద్ధి, స్వభావం, ప్రవర్తన, మనిషిజీవితం మొదలైన అంశాలను ప్రస్తావిస్తున్నాను. జానపదగాథాసాహిత్యంలోని మానవజీవితాన్ని విశ్లేషిస్తున్నాను.

**తూర్పు ఐరోపా జానపదగాథ**

ఒక ముసలిజాలరి సముద్రంలో చేపలు పట్టలేక నదిలో చేపలు పట్టి వాటిని అమ్మి జీవనం సాగించేవాడు. మండువేసవిలో చేపలు పట్టలేక తన దుస్థితికి తనే బాధపడతాడు. అప్పుడు వెండిలా తళతళ మెరిసే ఈకలున్న ఒక పెద్దపక్షి చూస్తుంది. దానిపేరు కహ్, దేవతాపక్షి. ఆ పక్షి ముసలిజాలరి పై జాలిపడి ఇలా అంటుంది. తాత రోజూ నేను నీకు ఒక పెద్ద చేపను ఇస్తాను. నువ్వు దాన్ని అమ్మి జీవనం సాగించు అని ఎగిరిపోతుంది. ఆ ప్రకారమే పక్షి రోజూ ఒక పెద్ద చేపను ముసలిజాలరి ఇంటిముందు వేస్తూఉంటుంది. దాన్ని అమ్మి ఆహారం తెచ్చుకునేవాడు ముసలిజాలరి. ఆరోజులలో పెద్దచేపలకు గిరాకీ ఎక్కవ ఉండటంతో ముసలిజాలరి డబ్బులు బాగా కూడబెట్టాడు. వాటితో సముద్రతీరంలోనే ఒక ఇల్లు, వంటమనిషిని ఏర్పాటుచేసుకోగలిగాడు. కొద్ది రోజులక్రితమే అతని భార్య చనిపోవడంతో మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి తగిన వధువు కోసం వెతుకుతున్నాడు. ఒకరోజు రాజభటుడు వేసిన దండోరా వింటాడు. అది "రాజుగారికి కహ్ అనే దివ్యపక్షి కావాలి. దానిగూర్చి తెలిసినవారెవరైనా ఉంటే, దాన్ని పట్టుకోవడంలో సహాయం చేస్తే తగిన బహుమతి ఇస్తాం అని". కోశాగారంలోఉన్న బంగారంలో సగం, అర్ధరాజ్యాన్ని ఇస్తాం అని ప్రకటన. ఆ ప్రకటన విని ముసలిజాలరి అర్ధరాజ్యముంటే తను కూడా రాజేనని మురిసిపోతూ ఆ పక్షి ఎందుకు? అని రాజభటుల్ని అడుగుతాడు. రాజుగారికి కంటిచూపు పోయింది. కహ్ పక్షి నెత్తురుతో కళ్ళను శుభ్రంచేస్తే చూపు వస్తుందని వైద్యులు చెప్పారు. ఆ పక్షి గూర్చి నీకేమైనా తెలుసా అని అడుగుతారు భటులు. అప్పుడు ఆ ముసలిజాలరి దురాశకు పోయి ఆ పక్షిని పట్టుకోవడంలో సహాయం చేస్తానంటాడు. రాజభటులను తన ఇంటికి తీసుకుని వెళతాడు. ఎప్పటిలాగే కహ్ పక్షి మాత్రం జాలరి ఇంటిముందు ఒకపెద్దచేపను వదిలివెళ్ళిపోతుంటే ఆ ముసలిజాలరి పక్షితో ఇలా అంటాడు. "నువ్వు రోజు చేపను వేసి వెళ్ళిపోతావు కనీసం నన్ను కృతజ్ఞత అయిన చెప్పుకోనివ్వి అని పదేపదే వేడుకోవడంతో ఆ పక్షి నేలమీదకి దిగుతుంది. మరుక్షణమే దాని కాలు గట్టిగా పట్టుకుని భటుల్ని పిలుస్తాడు. ఇంటివెనక దాగిఉన్న భటులు పక్షిని పట్టుకోవడానికి పరిగెత్తుకుని వస్తారు. వాళ్ళు వచ్చేలోపే ఆ పక్షి జరగబోయే విషయాన్ని గ్రహించి ఆ ముసలిజాలరితో సహా పైకి ఎగిరిపోతుంది. ఆ తర్వాత ఎన్నడూ ఎవరికీ కహ్ పక్షిగాని ఆ ముసలిజాలరి గాని కనిపించలేదు.

## విశ్లేషణ

జాలరి ముసలితనాన్ని గమనించి అతని అవస్థకు పక్షి జాలిపడుతుంది. సహాయం చేస్తుంది. కాని ముసలిజాలరి అది గుర్తించకుండా దాని ప్రాణాలకే హాని కలిగించేవిధంగా ప్రవర్తిస్తాడు. చివరికి ప్రాణం పోగొట్టుకుంటాడు. చేసిన సహాయం మరిచి పక్షికే అపకారం తలపెడతాడు. డబ్బు, అర్ధరాజ్యం కోసం ఆశపడతాడు. పక్షి చేసిన సహాయంతో తృప్తి చెందడు. కృతజ్ఞత చూపక, దురాశకు పోతాడు. చేసిన మేలు మరిచి పక్షికే కీడు తలపెడతాడు. కనుక ఎవరైనా సరే సహాయాన్ని పొంది కృతజ్ఞత చూపగ పోగా కీడు తలపెట్టకూడదు. దురాశ దు:ఖానికి చేటు.

ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ.

ఉపకారం చేసినవారికి ప్రత్యుపకారం చేయడం గొప్పేమీ కాదు. అపకారికి వాడి తప్పులు మన్నించి ఉపకారం చేసేవాడే నేర్పరి అవుతాడు. ఈ కథలో జాలరి పక్షి చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయకపోగా అపకారం తలపెట్టి ప్రాణాలు పోగొట్టుకుంటాడు.

## పఠాన్ గర్వం (ఆఫ్గన్ జానపదగాథ)

అలామత్ అనే వ్యక్తికి భార్యాపిల్లలు కుటుంబం ఉంది. కట్టెలు కొట్టి వాటిని అమ్మి కుటుంబాన్ని పోషించేవాడు. "ఈద్" పండుగకు తనకు, పిల్లలకు కొత్తబట్టలు కావాలని భార్య అడుగుతుంది. అతడి దగ్గరేమో చిల్లిగవ్వ లేదు. డబ్బు కోసం ఆలోచిస్తుండగా అతనికి ఒక వర్తకుడు కనిపిస్తాడు. ఆ వర్తకుడు గాడిదమీద బట్టల మూటలు పెట్టుకుని అమ్ముతున్నాడు. అతణ్ణి చూడగానే అలామత్ కు తన సమస్యకు పరిష్కారం దొరికిందని అనుకుంటాడు. వెంటనే మూడు రాళ్ళు తీసుకుని ఆ వర్తకుని మీదకు ఒక రాయిని విసురుతాడు. ఆ రాయి వర్తకుని భుజానికి తగులుతుంది. నన్నెందుకు కొడుతున్నావు అని వర్తకుడు అలామత్ ని అడుగుతాడు. "నేను దోపిడిదొంగను, నాకు'నీ బట్టలమూటలు కావాలి అంటాడు అలామత్. వర్తకుడు "నాకు నిన్ను ఎదురించే ధైర్యం లేదు." కావున ఈ బట్టల మూటలు తీసుకో అంటాడు. అలామత్ వెంటనే రెండవరాయి విసురుతాడు. దాంతో వర్తకుడు భయపడి బట్టల మూటలు తీసుకోమన్నాను కదా ఇంకా ఎందుకు రాళ్ళు విసురుతున్నావు అని అడుగుతాడు. "దోపిడి అనేది ఎప్పుడూ మోసంతో ఉంటుంది. అలాకాకుంటే అడుక్కునేవాడికీ, నాకూ తేడా ఏముంటుంది?" అని మూడవరాయిని విసురుతాడు అలామత్. వెంటనే వర్తకుడు గాడిదను, బట్టలమూటలను వదలిపెట్టి పరుగుతీస్తాడు. అలామత్ వాటిని తీసుకుని వెళ్ళి భార్యకు ఇస్తాడు.

పిల్లలకు, తమ బంధువులకు అందరికీ బట్టలు కుట్టించుకోమని ఇస్తాడు. ఈద్ పండుగను ఎంతో ఆనందంతో జరుపుకుంటారు.

కొన్నాళ్ళ తరువాత అలామత్ సంతలో చిక్కుడుగాయలు కొంటుంటే అతని భుజంపై ఒక చేయి బలంగా పడుతుంది. వెనక్కి తిరిగి చూస్తే ఆమధ్య తాను దోపిడి చేసిన వర్తకుడు. "ఏం కొంటున్నావ్ భాయ్ అని అడుగుతాడు." చిక్కుడుగాయలు అని తడబడుతూ చెబుతాడు అలామత్. అప్పుడు వర్తకుడు తనకు చిక్కుడుగాయల పంట ఉన్నదని ఎన్ని కావలిస్తే అన్ని ఉచితంగా ఇస్తానని అంటాడు. వర్తకునికి ఇరువైపులా ఇద్దరు వస్తాదులున్నారు. వారిని చూసి అలామత్ తల ఊపక తప్పలేదు. వర్తకుడు అలామత్ ను ఇంటికి తీసుకుని వెళ్ళి అతిధిమర్యాదలు చేస్తాడు. కాని అలామత్ మాత్రం తనకు ఏం శిక్ష విధిస్తాడో అని భయపడుతూనే ఉంటాడు. ఈ గండం గడిస్తే ఇంకెప్పుడూ తప్పులు చేయనని మనసులోనే అనుకుంటాడు. చివరికి వర్తకునితో ఇలా అంటాడు. "అయ్యా చిక్కుడుగాయలు ఇస్తే వాటి ఖరీదు చెల్లించి వెళ్ళిపోతానని". వెంటనే ఒక బస్తా చిక్కుడుగాయలు తెప్పించి, అలామత్ వచ్చిన గాడిద మీద పెట్టించి ఇక నువ్వు వెళ్లు అంటాడు వర్తకుడు.

తనకు అన్ని కాయలు అవసరం లేదని, తన దగ్గర అన్ని డబ్బులు లేవని అంటాడు అలామత్. ఉచితంగా తీసుకోమని వర్తకుడు అంటాడు. వెంటనే అలామత్ "ఉచితంగానా? నేనేమన్నా బిచ్చగాణ్ణా?" అని భయంతో అంటాడు. అప్పుడే అతని వీపు పై తుపాకీ గొట్టం తగులుతుంది. "మర్యాదగా నీ గాడిద పై ఎక్కి కూర్చొని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపో. లేకుంటే నీతలకాయ ఎగిరిపోతుంది" అని వర్తకుడు గర్జిస్తాడు. ఒక బిచ్చగాడికి దానం చేసినట్లు తనకు ఉచితంగా చిక్కుడుగాయలు ఇవ్వడాన్ని అవమానంగా భావిస్తాడు అలామత్. భారాన్ని బలవంతంగా దిగమింగుకుంటు గాడిద మీద ఇంటికి వెళతాడు.అప్పటినుంచి అలామత్ ప్రతివారం ఒక కట్టెలమోపు చొప్పున ఆ వర్తకుడి ఇంటిముందు వేస్తాడు. ఈ విధంగా క్రమం తప్పకుండా పదిసంవత్సరాల పాటు వేస్తాడు. ఒకరోజున ఆ వర్తకుడు "ఇక చాలు నా బట్టలకు, చిక్కుడుగాయలకు తగిన మూల్యం లభించింది" అంటాడు. అప్పుడు అలామత్ వర్తకునికి నమస్కరించి, సగర్వంగా తలెత్తుకుని గాడిద మీద ఇంటికి వెళతాడు. ఇక తనను బిచ్చగాడని ఎవరు అనలేరని లోలోపల ఎంతగానో ఆనందపడతాడు.

**విశ్లేషణ**

అలామత్ స్వభావం ఎవరి దగ్గర ఏది ఉచితంగా తీసుకోడు. అలా తీసుకుంటే తాను బిచ్చగాణ్ణి అనే అభిప్రాయం కలవాడు. డబ్బులేక వర్తకుని వద్ద బట్టలు మోసంతో తీసుకోవాలనుకుంటాడు. కాని వర్తకుడు ఉచితంగా బట్టలు ఇస్తానన్న తీసుకోడు. వర్తకుడు భయంతో పారిపోవడం అలామత్ బట్టల మూటలు ఇంటికి తీసుకుని వెళతాడు. ఈ సంఘటనతో వర్తకుడు ఇద్దరు వస్తాదులను తనకూడా పెట్టుకుంటాడు. తుపాకీ ఇంటిలో ఉంచుకుంటాడు. తనలోని భయాన్ని పారద్రోలి ధైర్యంగా వ్యాపారం చేయడం మొదలుపెడతాడు. వర్తకునికి అనుకోకుండా ఒకరోజున అలామత్

కనిపిస్తాడు. ఇంటికి తీసుకుని వెళ్ళి అతిధిమర్యాదలు చేస్తాడు వర్తకుడు. కాని అలామత్ కు లోలోపల తాను చేసిన పనికి వర్తకుడు ఏం శిక్ష విధిస్తాడో అనే భయం ఉంటుంది. వర్తకుడు అలామత్ కి ఉచితంగా చిక్కుడుగాయలు ఇస్తాననడం, అలామత్ వద్దని అనడం జరుగుతుంది. వర్తకుడు అలామత్ ను బెదిరించి బస్తా చిక్కుడుగాయలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. భయంతోనే అలామత్ వాటిని ఉచితంగా తీసుకుంటాడు. కాని అలా తీసుకోవడం అవమానంగానే భావిస్తాడు. చివరకు అలామత్ వర్తకుణ్ణి బెదిరించి తీసుకున్న బట్టలమూటలకు, అలామత్ ను బెదిరించి వర్తకుడు ఇచ్చిన బస్తా చిక్కుడుగాయలకు అన్నింటికి కలిపి డబ్బులు కట్టెలరూపంలో అలామత్ వర్తకునికి పదిసంవత్సరాలలో ఇవ్వడం జరుగుతుంది. తదనంతరం తాను బిచ్చగాణ్ణి కాదు అని అలామత్ కు పట్టరాని సంతోషం కలుగుతుంది.

అలామత్ భార్య కుటుంబ పరిస్థితి తెలిసి కూడా పండుగకు కొత్తబట్టలు కావాలనుకోవడం, అలామత్ కు ఏది ఉచితంగా తీసుకోవడం ఇష్టంలేక ఒకసారి వ్యాపారిని బెదిరించి, రెండవసారి తాను భయపడి ఉచితంగా తీసుకుంటాడు. వాటి విలువను మరల చెల్లించి ఎంతో ఆనందపడతాడు. వర్తకుడు మొట్టమొదట అలామత్ ను ఎదిరించే ధైర్యం లేక గాడిదను, బట్టలమూటలను వదులుకుంటాడు. రెండవసారి ఇద్దరు వస్తాదులు, చేతిలో తుపాకీతో భయపెట్టే స్థితిలో ఉంటాడు. **బలమున్న వాడిదే రాజ్యం** అనే సామెత రుజువవుతుంది.

నయమున బాలును ద్రావరు

భయమున విషమ్మునైన భక్షింతురుగా

నయమెంత దోషకరియో

భయమే చూపంగ వలయు బాగుగ సుమతీ!

ఈ లోకంలో మెత్తని మాటాలతో, మంచితనంతో చెపితే ఎవరూ పాలు కూడా తాగరు. భయపెడితే విషాన్నైనా తాగుతారు. కనుక ఏదైనా పని అవ్వాలంటే మంచితనం కన్నా భయపెడితేనే అవుతుంది. అదే పని వర్తకుడు చేశాడు.

**మూర్ఖపు ప్రశ్నలు (నేపాలీ జానపదగాథ)**

భూపేంద్రప్రసాద్ అనే వ్యక్తి తన ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి అంగరంగ వైభవంగా జరిపిస్తాడు. తన కొత్తకోడలి తెలివితేటలను పరీక్షించాలనుకుంటాడు. ఆమె దగ్గరకు వెళ్ళి ఇలా అడుగుతాడు. "మీ పెళ్ళికి నేనెంత ఖర్చు చేశానో ఊహించగలవా?" దానికి కోడలు "ఒక ధాన్యం బస్తా ఖర్చయి ఉంటుంది" అని సమాధానం చెబుతుంది. అది వినిన భూపేంద్రప్రసాద్ తన కొడుకు పెళ్ళాం ఎంత తెలివితక్కువది అనుకుంటాడు. కొడుకు పై మనసులోనే జాలిపడతాడు. అలా కొన్ని రోజులు గడుస్తాయి. ఒకరోజు భూపేంద్రప్రసాద్ కొడుకు కోడలితో కలిసి బంధువుల పెళ్ళికి వెళతాడు. మార్గమధ్యంలో కొంతమంది వ్యక్తులు ఒక శవాన్ని తీసుకుని వెళ్ళడం చూస్తాడు. వారిని ఆపి "చనిపోయింది ఎవరు?"

అని అడుగుతాడు అంతలో కోడలు "చనిపోయింది ఒకరా? వందమందా?" అని ప్రశ్నిస్తుంది. దాంతో భూపేంద్ర ప్రసాద్ కు కోడలి ప్రశ్నకు తలకొట్టేసినట్టయింది. ఎదుటి వ్యక్తి సమాధానం వినకుండానే వెళ్ళిపోతాడు. మరికొంచెం దూరం వెళ్ళాక పంటచేలలో కూలీలను పలకరిస్తాడు భూపేంద్రప్రసాద్. "ఈ సంవత్సరం పంట బాగా పండినట్టుంది" అంటాడు. అప్పుడు కోడలు "ఈ సంవత్సరం పంటేనా? గతసంవత్సర పంటా?" అని అడుగుతుంది. ఈవిధంగా అడగడంతో కోడలు ఒట్టి మూర్ఖురాలు అని తెలివి తక్కువదని అంచనా వేస్తాడు భూపేంద్రప్రసాద్. కొడుకు దగ్గరికి వెళ్ళి "నీ భార్య ఎంత చెత్త ప్రశ్నలు వేస్తుందో" అని అంటాడు. దాంతో కొడుకు చెత్తా? అని ఆశ్చర్యపోయి ఇలా అంటాడు. అవి పైకి కనబడేంత చెత్త ప్రశ్నలేమి కావు. వాటి అర్థమేమిటో ఆమెనే అడగమని అంటాడు. కొడుకు చెప్పిన దానిప్రకారం భూపేంద్రప్రసాద్ కోడలు దగ్గరికి వెళ్ళి ఇలా అంటాడు. "ఆ చావు ఊరేగింపు వాళ్ళను ఒక్క శవాన్ని తీసుకుని వెళుతున్నారా? వందమందా?" అని అడిగావు నీ ఉద్దేశ్యం ఏమిటి? అని అడుగుతాడు. దానికి కోడలు సమాధానం ఇలా చెబుతుంది. "కొందరి మీద ఆధారపడేవాళ్ళు చాలామంది ఉండవచ్చు. అలాంటి వ్యక్తి మరణించినప్పుడు వాళ్ళందరి జీవితాలు చిందరవందర అవుతాయి. ఒకరకంగా చెప్పాలంటే అతనితోపాటు వాళ్ళంతా చచ్చినవాళ్ళు కిందే లెక్క." అందుకే నేను అలా అడిగింది అని వివరించి చెప్పింది కోడలు. మరి వ్యవసాయకూలీలను "ఈ సంవత్సరం పంటేనా? గతసంవత్సర పంటా?" అని అడిగావు దాని అర్థమేమిటి అంటాడు భూపేంద్రప్రసాద్. సాధారణంగా రైతుకూలీలు అప్పుల్లో ఉంటారు. వాళ్ళు తీసుకున్న అప్పు గత సంవత్సరానిదా, ఈ సంవత్సరానిదా అని అడిగాను అంది కోడలు. కోడలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వివరంగా చెప్పిన తరువాత భూపేంద్రప్రసాద్ కు తాను మొట్టమొదట కోడల్ని అడిగిన ప్రశ్నకు సమాధానం వివరంగా తెలుసుకోవాలనిపిస్తుంది. వెంటనే మీ పెళ్ళికి నేను చాలా డబ్బు ఖర్చు చేసి ఎంతో వైభవంగా పెళ్ళి జరిపించాను. కాని నువ్వు పెళ్ళి ఖర్చు కేవలం "ఒక ధాన్యం బస్తాఖరీదు" మాత్రమే అని చెప్పావు అలా ఎందుకన్నావు? అని అడుగుతాడు. "మీరు పెళ్ళికి ఉపయోగపడే ఖర్చు చేసిన దానివిలువ అంతే అవుతుంది. మిగతా ఖర్చంతా మీ పరువు, ఆడంబరాల కోసం ఖర్చు చేసిందే" అంటుంది కోడలు. ఈ సమాధానాలతో భూపేంద్రప్రసాద్ తన కోడలు మూర్ఖురాలు కాదని చాలా తెలివైనదని తెలుసుకుంటాడు.

**విశ్లేషణ**

భూపేంద్రప్రసాద్ కొడుకు పెళ్ళికి పరువుప్రతిష్ఠల కోసం ఎంతో డబ్బు ఖర్చుపెడతాడు. కొత్తకోడలు తెలివైనదా కాదా తెలుసుకోవాలనుకుంటాడు. ఆమెను ఒకప్రశ్నవేస్తాడు. దానికి ఆమె చెప్పిన సమాధానం విని కోడలు తెలివితక్కువదని నిర్ధారణకు వస్తాడు. అంటే కోడలు తెలివైనదా కాదా ఆమెను గూర్చి తెలుసుకోవాలనే కుతూహలం ఉంది. కాని ఆమె చెప్పిన సమాధానం తాలుకా వివరణ గ్రహించలేక తనలో తానే కోడలకు తెలివిలేదని అనుకుంటాడు. కోడలు సమాధానం అలా ఎందుకు చెప్పిందో గ్రహించలేకపోవడం భూపేంద్రప్రసాద్ తెలివి తక్కువదనం. పైగా కొడుకుపై మనసులోనే జాలిపడతాడు. అంతేగాకుండా కోడలు ఇతరుల్ని అడిగినప్రశ్నలు విని మూర్ఖురాలని అనుకుంటాడు. ఆ ప్రశ్నలలోని ఆంతర్యాన్ని అర్థంచేసుకోలేకపోతాడు. కొడుకు దగ్గర కోడలు చెత్తప్రశ్నలు

వేస్తుందని అంటాడు. దానికి కొడుకు ఆశ్చర్యపోయి ఆ ప్రశ్నలలోని అర్థాన్ని కోడల్ని అడిగి తెలుసుకోమంటాడు. చివరకు కొడుకు సలహా పాటిస్తాడు. వాటిని గూర్చి కోడలు దగ్గర వివరంగా తెలుసుకుంటాడు. అనంతరం కోడలు మూర్ఖురాలు కాదని చాలా తెలివైనదని గ్రహిస్తాడు.

**టక్కరిబాలుడు – తెలివితక్కువ దయ్యం'(మెక్సికో జానపదగాథ)**

ఒకసారి ఒకదయ్యం ఒక సహాయం కోసం మానవరూపం ధరించి ఒక ఊళ్ళోకి వెళుతుంది. దాని దృష్టి ఎదురుగా వస్తున్న బాలుని పై పడుతుంది. ఏయ్ అబ్బాయ్ నీకు ఉద్యోగం కావాలా అంది. కావాలి అన్నాడు బాలుడు. నీకు చదవడం వచ్చా అని అడిగింది దయ్యం. వచ్చు అంటాడు బాలుడు. అయితే ఉద్యోగం నీకు ఇవ్వలేను అంటుంది. చదువు రానివాడు కావాలి అంటుంది. వెంటనే ఆ బాలుడు ఇలా అంటాడు. వెనకాల నా సోదరుడు వస్తున్నాడు అతనికి చదువురాదు అని చెప్పి వెళ్ళిపోతాడు. దయ్యం కొంచెం ముందుకు వెళ్ళగానే ఆ పిల్లవాడు మరొక దొంకదారి గుండా, దాని కన్నా ముందే ఊళ్ళోకి వెళ్ళి ఆ దయ్యానికి ఎదురుగా వస్తాడు. ఎదురుగా వచ్చిన బాలుణ్ణి చూసి ఆ దయ్యం ఇలా అడుగుతుంది. "ఇందాక నాకు కనిపించిన అబ్బాయి సోదరుడివి నువ్వేనా? నీకు చదువురాదని, ఉద్యోగం కోసం వెతుకుతున్నావని అతడు చెప్పాడు" అంటుంది దయ్యం. ఆ అబ్బాయి అవును అన్నట్లుగా తల ఊపుతాడు. అప్పుడు దయ్యం ఆ అబ్బాయిని ఒక గ్రంథాలయంలోకి తీసుకుని వెళుతుంది. ఆ అబ్బాయి చేయవలసిన పని దయ్యం చదివిన పుస్తకాలను దుమ్ము దులిపి ఎప్పటికప్పుడు యథాస్థానంలో పెట్టడం. దయ్యం బయటకు వెళ్ళినప్పుడు ఆ అబ్బాయి ఏమితోచక ఒక్కొక్క పుస్తకం చదవసాగాడు. అవి మాయలు-మర్మాలు, మంత్రతంత్రాలు, ఇంద్రజాలం, కనికట్టు, గారడీ, విద్యల గూర్చి ఎంతో ఆసక్తికరంగా ఉండేవి. ఒకరోజున ఆ అబ్బాయి పుస్తకం చదువుతుండగా దయ్యం చూస్తుంది. ఆ బాలుడు చదువురాదని చెప్పి తనను మోసం చేశాడని గ్రహిస్తుంది. వెంటనే తన నిజస్వరూపాన్ని ధరించి ఆ బాలుణ్ని భయపెడుతుంది. అయితే ఆ బాలుడు కూడా అప్పటికే చాలా విద్యలు పుస్తకాలలో చదివి నేర్చుకున్నాడు. కాబట్టి వెంటనే కుందేలుగా మారి బయటకు పరుగుతీస్తాడు. ఆ దయ్యం తోడేలుగా మారి కుందేలును తరమసాగింది. అప్పుడు కుందేలు పావురంగా మారి ఆకాశంలో ఎగిరిపోతుంది. ఆ వెనువెంటనే తోడేలు గద్దలామారి పావురాన్ని తరుముతుంది. పావురాన్ని పట్టుకునే లోపు అది గులకరాయిగా మారి భూమిమీద పడుతుంది. అప్పుడు గద్దరూపంలో ఉన్న ఆ దయ్యం వడ్లగింజగామారి భూమిమీద పడబోతుంది. గులకరాయిగా మారిన ఆ బాలుడు భూమి మీద పడిపడగానే కోడిపుంజుగా మారతాడు. సరిగ్గా అదే సమయానికి వడ్లగింజగా మారిన దయ్యం భూమి మీద పడుతుంది. కిందపడి పడగానే వడ్లగింజను కోడిపుంజు మింగేస్తుంది.

**విశ్లేషణ**

విద్య లేనివాడు వింత పశువు అంటారు. చదువు అనేది ఆ బాలుడి ప్రాణాలు కాపాడింది. దయ్యం బయటకు వెళ్ళిన సమయం లో ఆ బాలుడు పుస్తకాలను చదవబట్టి అందులోని మంత్రతంత్రాలు ... వగైరా విద్యలు

నేర్చుకోగలిగాడు. తద్వారా దయ్యం బారినుండి తన ప్రాణాలు కాపాడుకోగలిగాడు. దయ్యం దగ్గర తెలివిగా ఉద్యోగం సంపాదించడమే కాకుండా తనను తాను రక్షించుకోగలిగాడు.

విద్య నిగూఢగుప్త మగు విత్తము రూపము పూరుషాళికిన్

విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుండున్

విద్య విశిష్టదైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్

విద్య నృపాల పూజితము విద్య నెరుంగనివాండు మర్త్యుండే.

మనుషులకు విద్య నిగూఢంగా దాచి పెట్టబడిన ధనం. విద్య కీర్తి, భోగాలను ఇస్తుంది. విద్యగురువు, విదేశ బంధువు, విశిష్టదైవం. విద్యకు సాటిరాగల ధనం ఈలోకంలో లేదు. ప్రభువులచే పూజింపబడేది విద్య. విద్య తెలియనివాడు మనిషి కాదు. పశువుతో సమానం.

**<u>చైనా జానపదగాథ</u>**

చైనాలో ఒకరాజు నివాసం అడవికి దగ్గరగా ఉండేది. ఒకరోజు రాజుగారు రాత్రివేళ పుస్తకం చదువుతుండగా ఒక కోయిల పాట వినిపిస్తుంది. అది ఎంతో మధురంగా ఉంటుంది. ఆ పాటను వినిన రాజుగారు వెంటనే భటుల్ని పిలిపించి అడవిలోని ఆ కోయిలను తెమ్మని పంపుతాడు. భటులు ఆ కోయిలను కనుక్కొని రాజుగారి దగ్గరకు రమ్మని అంటారు. కాని కోయిలకి అడవిని విడిచి వెళ్ళటం ఇష్టం లేదు. కాని రాజుగారి సంతోషం కొరకు వెళుతుంది. రాజుగారికి మందిరంలో రకరకాల పాటలు వినిపిస్తుంది కోయిల. రాజుగారు ఆనందంతో కోయిలకు బంగారు పంజరం చేయించి తన దగ్గరే ఉంచుకుంటాడు. ప్రతిరోజు ఆ కోయిల పాటలతో ఆనందపరవశుడవుతాడు. ఒకనాడు పర్షియా చక్రవర్తి చైనారాజుకు ఒక కానుక పంపిస్తాడు. అది ఒక బొమ్మ కోయిల. దానినిండా వజ్రవైఢూర్యాలు పొదిగారు. దానికి ఒక మీట ఉంది. అది తిప్పితే ఆ బొమ్మ ఆగకుండా ఐదునిమిషాల వరకూ పాడుతుంది. దాంతో రాజుగారు చాలా ఆనందంతో బొమ్మకోయిల పాటలు వింటూ, పంజరంలో ఉన్న నిజమైన కోయిలను మరచిపోతారు. ఒకరోజు రాజభటుడు పంజరం మూతతీయగా కోయిల రివ్వున అడవిలోకి ఎగిరిపోతుంది. రాజుగారు మాత్రం బొమ్మకోయిలను ఎప్పుడూ తనవెంటే ఉంచుకుని పాటలు వింటుండేవారు. కొంతకాలం తర్వాత బొమ్మకోయిల లోపల ఏదో విరిగి పాడకుండా ఆగిపోతుంది. దాన్ని రిపేరు చేయడానికి ఎంతోమంది వస్తారు. కాని అది పనిచేయదు. చివరకు గడియారాలు బాగుచేసే అతను దాన్ని రిపేరు చేసి అది నెలకో, సంవత్సరానికో ఒకసారి పనిచేస్తుంది అని చెబుతాడు. అదేవిధంగా అది అప్పుడప్పుడు మాత్రమే పనిచేస్తుంది. దాంతో రాజుగారు ఎంతో బాధపడతాడు. అదే ఆలోచనతో

ఉండటం వలన రాజుగారికి తీవ్రంగా జబ్బుచేస్తుంది. ఒకరోజున రాజవైద్యులు రాజుగారిని పరీక్షించి మరణించారు అని ప్రకటిస్తారు. ఆ స్థితిలో రాజుగారి దగ్గరికి అడవిలోకి ఎగిరిపోయిన నిజమైన కోయిల వచ్చి మధురంగా పాడుతుంది. దాని పాట విని రాజు నెమ్మదిగా కళ్ళు తెరుస్తాడు. నా మిత్రుడు మళ్ళీ వచ్చాడు అని రాజు ఆనందిస్తాడు. ఆ రాత్రంతా కోయిల పాటలు వింటూనే ఉంటాడు.

**విశ్లేషణ**

రాజుగారికి పుస్తకాలు, సంగీతం అన్న ప్రాణంతో సమానం. అడవిలోని కోయిల పాట విని దాన్ని తెప్పించుకుని బంగారు పంజరం చేయిస్తాడు. నిరంతరం తనతోనే రాజమందిరంలో కోయిలను ఉంచుకుని పాటలు వినేవారు. పాటలు వినడమనేది నిత్యకృత్యంగా చేసుకుంటాడు రాజు. కొంతకాలం తర్వాత తనకు కానుకగా వచ్చిన బొమ్మకోయిల నిరంతరం పాడటంతో దానిపై రాజుగారి దృష్టి మల్లుతుంది. బొమ్మకోయిల మీట నొక్కితే రకరకాల పాటలు వస్తుండేవి. దాని వ్యామోహంలో పడి రాజుగారు నిజమైన కోయిలను విస్మరిస్తారు. నిజమైన కోయిలకు అడవిని విడిచి రావడం ఇష్టం లేకపోయిన రాజుగారి ఆనందం కోసం వస్తుంది. అట్లాంటి కోయిలను రాజుగారు మరచిపోయేసరికి కోయిలకు బాధకలుగుతుంది. తిరిగి అడవికి వెళ్ళిపోతుంది. రాజుగారి బొమ్మకోయిల మీట కొంతకాలం పనిచేసి తర్వాత పనిచేయడం మానేస్తుంది. ఎంతమంది ఎన్ని రిపేర్లు చేసినా బాగవ్వదు

ఎలుకతోలు తెచ్చి యొన్నాళ్ళు నుదికిన
నలుపు నలుపే కాని తెలుపు కాదు!
కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన పలుకునా?
విశ్వదాభిరామ వినురవేమ!!

నల్లగా ఉండే ఎలుక చర్మాన్ని తీసుకుని వచ్చి ఎన్ని రోజులు పాటు ఉతికినా దాని నలుపు పోయి తెల్లగా మారదు. ప్రాణంలేని కొయ్యబొమ్మను ఎంత కొట్టినా దానిచేత పలికించడం సాధ్యం కాదు.

ఈ కథలో బొమ్మ కోయిల పనిచేయడం మానేసిన తర్వాత రాజుగారికి నిజమైన కోయిలకి, బొమ్మకోయిలకి ఉన్న తేడా అర్థమవుతుంది. ప్రాణమున్న కోయిల ఎప్పుడంటే అప్పుడు పాటలు పాడేది. ఇప్పటికీ పాడుతుంది. అదే ప్రాణమున్న కోయిలకి, ప్రాణములేని బొమ్మకోయిలకి తేడా. అది గ్రహించిన రాజుగారు బొమ్మకోయిలను చూసుకుని నిజమైన కోయిలను నిర్లక్ష్యం చేసినందుకు బాధపడతాడు. పాటలు వినకపోవడంతో జబ్బుపడతాడు. చివరకు మరణావస్థలో ఉండగా అడవినుండి నిజమైన కోయిల వచ్చి రాజుగారిని బతికిస్తుంది. రాజుగారు తప్పు తెలుసుకుని నిజమైన కోయిలకి తగిన గౌరవం ఇవ్వడంతో అది ఎంతో ఆనందిస్తుంది. రాజుగారికి నిరంతరం పాటలు వినిపిస్తూ ఆనందింపజేస్తుంది.

రాజు సజీవంగా ఉన్న కోయిలను పక్కనపెట్టి నిర్జీవమైన బొమ్మ కోయిల వ్యామోహంలో పడి జబ్బుపడతాడు. చివరకు తాను నిర్లక్ష్యం చేసిన కోయిలే రాజుగారి ప్రాణాలు కాపాడుతుంది.

తనుజులనుం గురువృద్ధుల
జననీ జనకులను సాధుజనుల నెవడు దా
ఘనుడయ్యు బ్రోవడొయా
జనుడే జీవన్మృతుండు జగతి కుమారా!

తన కుమారులను, గురువులను, పెద్దవారిని, తల్లిదండ్రులను, సజ్జనులైన వారిని, ఎవడు తన చేతనైనను తగిన సమయమున రక్షింపడో అతడు బ్రతికిఉన్నను చచ్చినవాడితో సమానమే. ఈ కథలో కోయిల సరైన సమయంలో అడవి నుంచి వచ్చి రాజుగారి ప్రాణాలు కాపాడుతుంది.

**ముగింపు**

ఈ ఐదు జానపదగాథలలో మనిషి స్వభావం అనేది చూస్తే స్పష్టంగా అవగతమవుతుంది. **మూర్ఖపు ప్రశ్నలు** కథలో భూపేంద్రసింగ్ ఎదుటివారి తెలివితేటలు తెలుసుకోవాలనే కూతూహలం, **పఠాన్ గర్వం** కథలో అలామత్ ఏది ఉచితంగా తీసుకోకపోవడం అలా తీసుకుంటే తాను బిచ్చగాడిని అయిపోతాననుకోవడం, **ముసలిజాలరి** కథలో పక్షి చేసిన సహాయాన్ని మరచి సొమ్ము కోసం దానికే కీడు తలపెట్టడం, **టక్కరిబాలుడు** కథలో బాలుడు చదువుకోవడం వలన దయ్యం బారి నుండి ప్రాణాలు కాపాడుకోగలగడం, **చైనాకథలో** రాజు ప్రాణమున్న కోయిలను మరచి ప్రాణంలేని కోయిలను నమ్ముకోవడం మొదలైన అంశాలు మనిషి బుద్ధిని తెలియజేస్తున్నాయి. జానపదగాథల్లో మానవీయ విలువలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చి సంస్కృతీ, సంప్రదాయాలు రూపొందాయి. నానాటికీ మనిషిలో స్వార్థం పెరిగిపోతుంది. నాడున్న మానవీయవిలువలు నేడు మసకబారుతున్నాయి.

********

వ్యాస కౌముది



# "అ ఆ ల ఆరామస్థలి" ఆమె కవిత

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

ఆమె బ్లాగు పేజీ తెరిస్తే చాలు, అన్నిటికన్నా పైన " అ ఆ (అనుభూతి ఆలోచన) లు " ఆమె కవిత్వం –అని ఉంటుంది.

పిల్లల పిలుపుపై అమెరికా బే ఏరియాలోకి అడుగుపెట్టిన తెలుగు సాహిత్యవ్రతులామెకు పరిచయమైతే చాలు, ప్రేమగా గౌరవంగా ఇంటికి పిలిచి ' అ ఆ లు' (అనుభూతి, ఆత్మీయతలు) రంగరించి ఆతిథ్యమిచ్చి, చుట్టుపట్ల విశేషాలను తిప్పి చూపించి, తాను ఆనందిస్తుంటుంది. అది –ఆమె వ్యక్తిత్వం.

అనుభూతి, ఆలోచనలు కవిత్వమనడం కవిత్వానికే ఎంత సూటియైన, సరళమైన, సమగ్ర నిర్వచనం! "శబ్దార్థ సహితౌ" అనే మాటను ఆధునీకరించి, కవిత్వీకరించి చెప్పినట్లుంది. ముందు శబ్దనిష్ఠమైన అనుభూతి స్పృశించాలి, తరువాత అర్థనిష్ఠమైన ఆలోచన వికసించాలి. "అనుభూతి కవిత్వ" దృక్పథానికి ఇది అతిచక్కటి సరళమైన అభివ్యక్తి, నిర్వచనం.... ఆ శకంలో తెలుగు కవితారంగంలో అడుగుమోపిన ఆమెకు, కవయిత్రిగా అప్పుడే పాతికేళ్ళు!!

ఆమె డా|| కె. గీత.

కవిత్వం, వ్యక్తిత్వం రెంటిలో తన ప్రత్యేకశైలీ, విశిష్టతల్ని నిరూపించుకొన్న గీత!

★★ ★★ ★★

ఒకవ్యక్తి జీవితంలో పాతికేళ్ళు అంత తక్కువ కాలమేమీ కాదు. అందులోనూ చదువూసంధ్యా పూర్తి చేసుకొని జీవితంలో స్థిరపడాల్సిన తొలిభాగంలో. చరిత్రలో అయితే అది ఒకతరం కాలం. అంటే ఒక చరిత్రను నిర్మించుకొనే కాలం. పట్టుమని నలభైనాలుగు కూడా నిండని గీత, కవితారంగంలో పాతికేళ్ళ నిర్విరామకృషితో తనకంటూ ఒక చరిత్ర సృష్టించుకొంది. తెలుగు స్త్రీవాద కవితాచరిత్రలో తనకూ ఒక స్థానం దక్కించుకొంది. అందుకు **'నీలి మేఘాలు'** సాక్షి. చరిత్ర సృష్టించిన తొలితరం తెలుగు స్త్రీవాద కవయిత్రుల అత్యుత్తమ కవితల సంకలనం 'నీలిమేఘాలు' (1993) లో ఆ చిన్నవయసుకే గీత రాసిన కవితలు మూడు చోటుచేసుకొన్నా యంటే ఆమె ప్రతిభ, కవితాశక్తి గూర్చి విడిగా చెప్పక్కర్లేదు.

'88 అక్టోబర్10 'ఆంధ్రజ్యోతి' సాహిత్యవేదికలో ఆమె తొలికవిత " ఓ రోజంతా" అచ్చయింది. అప్పటికి ఆమె వయసు కేవలం పదిహేడేళ్ళే. అప్పట్లో ఆంధ్రజ్యోతి ఒక ఉద్యమస్థాయిలో కొత్త కవులను, కొత్త కవితా దృక్పథాలను, వాదాలను, పలుకుబళ్లను పరిచయం

చేయసాగింది. 'భారతి' అనంతరయుగంలో సాహిత్య సృజనకు ఓ పెద్ద పట్టుగొమ్మగా నిలిచింది. అప్పట్లో ఆంధ్రజ్యోతి అందించిన అనుభూతి–స్త్రీ వాద కవయిత్రు లలో అందరి కంటె చిన్నవయస్కురాలు గీత.

ఆమెది స్త్రీవాదకవిత కాదు, స్త్రీ సంవేదనాకవిత. మగ ప్రపంచంలో స్త్రీ తన అస్తిత్వాన్ని, ప్రత్యేకతను నిలబెట్టుకోడానికి చేసే సాంస్కృతిక పోరాటమే స్త్రీవాదం. అందులో ధిక్కారం ఉండొచ్చు, తిరస్కారముండొచ్చు. ప్రశ్న ఉండొచ్చు, తమని తాము చూసుకొమ్మనే నిలదీత ఉండొచ్చు. ఇదంతా ఒకవైపు. మరోవైపు ఇన్ని తరా ల్లోనూ అక్షరావిష్కృతి పొందని స్త్రీల దుఃఖాలు, వేదనలు, శృంగార ప్రతిరూపంగా మాత్రమే లోకం చూసే వారి శరీరాల్లోని సున్నితమైన బాధలు, సంవేదనాపార్శ్వాల చిత్రణ ఉంది. స్పష్టతకోసం దీన్ని'స్త్రీ సంవేదనాకవిత' అనడం సమంజసం. గీత కవిత ఈ పార్శ్వానికి సంబంధించింది. జన్మరీత్యా స్త్రీ పొందే ఓ బాధని చెప్తూ " ఎన్నాళ్ళిలా అవయవాల్ని కడుపులోకి కూడగట్టుకోవటం?/ దారంలేని గాలిపటాన్నిఎన్నాళ్ళని కాపాడు కోటం?/ ఈ ఒక్క అవయవాన్ని విసిరవతల పారేస్తే చాలు/మరో సృష్టి ఇంకాగిపోతే చాలు.." " భగవంతుడా ! అణచివేత, మోసపోవడం, క్షమ,బాధ్యత, జైలుజీవితం,/కన్నీళ్ళు నిండిన పక్కటెముకని తీసి స్త్రీని తయారు చేశావెందుకు?" (ద్రవభాష, పు.94,76) అన్న మాటలు ఆ స్త్రీ వేదనకు, సంవేదనకు గుర్తులే. ఒక పురుషుడు ఎన్నడూ గుర్తించలేని తీవ్ర ఆక్రోశానికి అభివ్యక్తులే. ప్రకృతివివక్షకూ, పురుష ప్రకృతివివక్షకూ గురైన స్త్రీ హృద యాన్ని ఆవిష్కరించడమే ఆమె దృక్పథం.

ఇది ఆమెకు తల్లినుంచి వచ్చిన లక్షణం. అమ్మ కె.వరలక్ష్మి పేరొందిన కథా రచయిత్రి. స్త్రీ వేదనలో, అందునా మధ్యతరగతిక్కూడా చేరని స్త్రీల బాధలో ఎన్ని కోణాలున్నాయో అన్నిటినీ అతి సంవేదనాశీలమైన భాషలో రాస్తారు. అదే అమ్మాయిక్కూడా సంక్రమించి, సున్నిత కవిత్వరూపంలో ఆవిష్కారం పొందింది. " రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ఒంటిని ఆరబెట్టుకొనే మల్లెమొక్కా/...నన్ను కాస్త బయటికి సాగనంపుమనే గది నేల మీది దుమ్ము/..ఇక నా పనయ్యిందంటూ విశ్రమించే గోడకున్న బల్బు..." ఇలా సాగే 'ఓరోజంతా' కవిత అచ్చమైన అనుభూతి కవితగా విమర్శకుల ప్రశంసలందుకొంది. ఆ కవితలో ప్రత్యేకంగా 'వస్తు'వంటూ లేదు. సరళమైన, సూటియైన భాషలో ఉదయం నుంచి, సాయంకాలం దాకా ఓ రోజు భావుకుల గుండెలో మిగిల్చిన అనుభూతి మాత్రమే ఉంటుంది. నిజాయితీగా, తనుకు తనుగా పొందే స్పందన మాత్రముంటుంది. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆమె కవిత్వ లక్షణమే అది. వ్యక్తిత్వమున్న మనిషిగా తాను అనుభవించే స్పందనను, నిర్వేదాన్ని నిజాయితీగా సూటిగా చెప్పడమే ఆమె కవిత్వం. అందులో భావజాలాల ప్రదర్శనలుండవు, అభివ్యక్తి చిత్రాల కసరత్తులుండవు. ***గుండెల్లో భావానుభూతి–మాటను విద్యుదీకరిస్తే ఆమె కవిత!***

అప్పటినుంచి, ఆమె వివిధ ప్రక్రియల్లో రాస్తున్నా, కవిత్వాన్నే తన ప్రధాన మాధ్యమంగా, 'ఆత్మ' గా ఎంచుకొని, 'ద్రవభాష'(2001), 'శీతసుమాలు'(2006), 'శతాబ్దివెన్నెల'(2012)--మూడు కవితాసంపుటాలను వెలువరించింది. మరో కవితాసంపుటి కూడా త్వరలో రానుంది. 'సిలికాన్ లోయ సాక్షిగా కథలు' పేరిట ఒక కథలసంపుటి వెలువడనుంది. ఆ కథలు కూడా ఓ విధమైన కవితా చిత్రాలే. గత మూడేళ్ళు గా రాస్తున్న "నా కళ్ళతో అమెరికా" ట్రావెలాగ్స్ అంతే. ఏది రాసినా అందులో అచ్చమైన కవితానుభూతి వాక్యవిన్యాసం చేస్తూనే ఉంటుంది.

★★ ★★ ★★

**'ద్రవభాష'** ఎంత అందమైన పేరు! వ్యవహారబోధ కలిగించేది సాధారణభాష. మనస్సు ద్రవించి, ద్రవింపచేసేది కవితాభాష. మాట తగలగానే మనిషిలో కరుడుగట్టిన మరోమనిషి ద్రవించాలి. అప్పుడే అది కవిత్వం. "అఆ(అనుభూతి,ఆలోచన)లు.. కవిత్వ"మనడం ఎంత సరళమైన చక్కటి నిర్వచనమో, కవితా భాషను, దరిమిలా కవితాత్మను, ద్రవభాష అనడం కూడా అంతే చక్కటిప్రయోగం. *ఆ మాట , ఈ పేరూ ఆమె కవితాతత్త్వానికి ప్రతీకలు .*

ద్రవభాషలోని కవితలన్నీ అలా హృదయాలను ద్రవింపచేసేవే. " అసందిగ్ధ భారాన్ని జీవితమంతా/ ద్రవభాషలోనికి ఎంతకని అనువదించుకోవటం/ రాని స్వప్నాల్ని సంఘర్షణలుగా ఎన్నని తర్జుమా చేసుకోవటం?" అని కొట్టుమిట్టాడిన మనస్సు " మమతల మాలికల్ని ప్రదర్శించే దారానికెంత నగ్నత్వం " అంటూ ప్రశ్నించుకొని, "... దారాన్నంటిన ఐహిక ఆవేదనే మిగిలింది చివరికి..." అని ఓ నిర్వేద వాస్తవంలో రాజీపడుతోంది. ఇందులోని ప్రతీకలు ఎంత సరళంగా అగుపిస్తాయో అంత జటిలమైనవి. వాటిని వ్యాఖ్యానించ డమంటే సుప్తచేతనాభూమికల్ని నిర్మించే మానవ తాత్త్విక స్వరూపాన్ని వ్యాఖ్యానించడమే. ***ఆ మధ్య అనేక వివాదాలను రేకెత్తించిన " అనుభూతి కవిత్వం" లోని అంతస్సత్వమే ఆ తాత్త్వికరూపం.*** దానికి మంచి ప్రతినిధి రచనల్లో 'ద్రవభాష' ఒకటి. కుందుర్తి అవార్డు లాటి రాష్ట్రస్థాయి ఉత్తమ బహుమతులందుకొన్న కవితాఖండిక లున్న ఈ సంపుటికి కవితాప్రియులందరూ గౌరవించే "అజంతా అవార్డు" తో పాటు మరికొన్ని అవార్డులూ దక్కాయి. "మనసు కలం నుంచి కాగితంపైకి దుమికి/ అక్షరాల హర్మ్యంగా మారింది" అనే (పు.59) మంచికవితకు అవార్డులు కొలమానం కావన్నది నిజం.

★★ ★★ ★★

హృదయానికి హత్తుకొన్న ప్రతి దృశ్యం, అంశం,వ్యక్తీ ఆమె కవితావస్తువే. అయినా,వాటిల్లో ప్రధానమైనవి మూడు : 1. పాపాయి, 2. అమ్మ, 3. ప్రేమ. ఈ మూడూ ఆమెను కదిలించి పలికించినంతగా మరేవీ కదిలించి పలికించలేదేమో! ప్రేమ అంటే రొమాంటిక్ భావజాలవారసత్వంగా వచ్చిన ప్రేమకాదు. స్త్రీ సహజమైన ప్రకృతి ప్రేమ– ప్రపంచంలోని ప్రతి అందమైన దృశ్యం మీద ప్రేమ. అది వాళ్ళ ఊరి 'కొంగ్రలావి చెట్టు' కావచ్చు, కాలిఫోర్నియాలోని 'లేక్ తహూ' కావచ్చు, అన్నిటిపై ఒకే ప్రేమే. కాని ఇందులో అంతస్సూత్రంగా దర్శనమిచ్చే ప్రేమ అంతకన్నా భిన్నమైంది; తనకు జీవితమిచ్చిన చెలిమిని పరమ ఆర్ద్రంగా చిత్రించేది. అర్ధరాత్రి దుస్స్వ ప్నం నుంచి మేల్కొన్న బేలమనసు "దుఃఖాన్ని తుడిచే చెయ్యి", భరోసానిస్తూ " బల్లపరుపుగా పరుచుకొనే భుజం" ('శీతసుమాలు' పు.13)ను పసిపిల్లలా ప్రేమించే ప్రేమ. యాంత్రిక జీవితంలో తలమునకలైన సఖుని కోసం నిరీక్షిస్తూ " నువ్వు యంత్రానివి కాదు, సాయంత్రానివి/సర్వకాలాల్లో సాయం వుండే సాయం కాలానివి" ( అదే, పు. 16) అని గొప్పగా నిర్వచిస్తుంది. జీవితాలను కెరియర్ శాసించే ఆధునిక కాలంలో ప్రతి యువతీ గుర్తుంచుకోవలసిన గొప్ప ఆవిష్కారం ఇది.

ఆమె ప్రేమతత్త్వ సంపూర్ణ ఆవిష్కరణ అగుపించేది 'పాపాయి' మీద కవితల్లో. ఏ భాషల్లోనైనా పాపా యిల మీద వచ్చిన ఉత్తమకవితల్ని ఒక సంకలనంగా వేస్తే వాటిల్లో మొదటిపంక్తిలో నిలిచే కవితలు ఆమెవి. 'శతాబ్ది వెన్నెల' సంపుటిలో అవి మరింత గొప్పగా సాక్షాత్కరిస్తాయి. 'శతాబ్ది వెన్నెల' పేరేమిటి? ఆ కొత్తపద చిత్రం అర్థమేమిటి? ...తన "అంతర్లీన సరస్సులో ఈదులాడే చేప పిల్ల/నిశ్శబ్దకుహరంలో తొమ్మిది నెల్లుగా నిద్రపోతున్న పసిపాప" నుద్దేశిస్తూ "బైటిలోకపు ద్వారపాలకురాలినై,రాత్రింబవళ్ళు నీకోసమే పహారా కాస్తున్నా" నన్న కన్నతల్లి అంటున్న ఈ మాటలు: ***" చిరుచిన్న పాపాయీ! మనిద్దరం ఒకే శరీరపు రెండు భాగాలం/ నిజానికి నాలోనువ్వున్నా/ నీకడుపులో నేనున్నట్లు అనుక్షణం పరవశం/నీరూపంలో నేను మళ్ళీ ఓ వందేళ్ళు పోగుచేసుకొంటాను/నీనుంచి ప్రవహించే రక్తమై పరిణామం చెంది శతాబ్దాల తరబడీ జీవించే ఉంటాను/ కృతజ్ఞతలు పాపాయీ ఆకాశంలో నక్షత్రానివై మెరిసే నువ్వు/ శతాబ్దివెన్నెలవై నాలో ప్రవర్ధమాన మవుతున్నందుకు"*** ...తనకో వందేళ్ళ జీవితం పొడిగింపు బిడ్డరూపంలో అనుభవించే తల్లి మాత్రమే ఆ మాట అంటుంది. భావుకత ఉన్న ప్రతి తల్లీ, తండ్రి గుండెల్లో ఆ వెన్నెల పరచుకొంటుంది. 'నెలలు నిండేదాకా' అనే కవితలో "నెలనెలా నా శరీరాన్ని భాగభాగంగా/ పంచుకొని రూపు దిద్దుకొంటావు నువ్వు/ శరీరాన్ని భాషగా మార్చుకొని /శాయశక్తులా నిశ్శబ్ద సంభాషణలు చేస్తావు" అనే పంక్తులు కానీ, 'అమ్మను నేను' అనే కవితలో ని ''నన్ను,నిన్ను అనుబంధపు అదృశ్యనాడులు ఎప్పుడూ కలుపుతూనే వుంటాయి/నీ వసంతాన్ని కాపాడే ప్రప్రథమ వృక్షాన్ని నేను/ నీకు అమ్మను నేను..." అనే

పంక్తులుకానీ ఎంతో సరళంగా ఉంటూనే వెంటాడుతుం టాయి. పిల్లల్ని చూస్తూనే ఆ 'శరీరభాష' ఎంత శక్తివంతంగా మాటాడుతుందో అనుభవంలోకి వస్తుంది. ఆమెకు లోకమంతా ఒక ఎత్తు, పాపాయి ఒక ఎత్తు. అందుకే ఆ అంశంపై అన్ని కవితలు. "పాలుకారే పెదాలమీద ఇంద్ర ధనుస్సుని వెనక్కి వంచినట్లు....తెరలుతెరలుగా నవ్వే పాపనవ్వు"లో పరవశించే ఆమె అమ్మతనం "పాపాయి పసినవ్వు ప్రాణాధార పచ్చబొట్టు"('పారిజాత పచ్చబొట్టు') అని ప్రకటించుకొంటుంది. ఆ అమ్మతనం పారవశ్యం లోనే తన కావ్య సంపుటుల్ని తన పిల్లలకే అంకితమిచ్చుకొంది.

అమ్మతనం అంత నిండుగా ఉంది కనుకనే తన తల్లినీ అంత గాఢంగా ప్రేమిస్తుంది. 'అమ్మా! నీకు అశ్రు అభివందనాలు', 'అమ్మ వెళ్ళేక', 'అమ్మరాదు', 'అమ్మ ఉంది చాలు' వంటి ఎన్నో కవితల్ని'అమ్మ' మీద రాసింది. ప్రతిదీ కరిగించేసేదే. 'అమ్మ'నే మాటలోనే గొప్ప నిశ్చింత, ఆలంబనాభావం ఉందంటుంది. 'నువ్వే లేకపోతే' అనే కవితలో "స్ఫటికాలై పోయిన శరీరాన్ని ద్రవపదార్థంగా మార్చుకొనీ మార్చుకొనీ/ కెరటాల్లో ఉరేసుకోవటం తప్ప/ నువ్వనే పదం కన్పడకుంటే/ అమ్మా! బిక్కుబిక్కుమని నిట్రాతి గోడలకి చేరేసిన వక్రపు నడాలవటంతప్ప" తామేమై పోదుమనే ఆర్తిని అత్యంత ఆర్ద్రంగా చిత్రిస్తూ, "అశ్రు అభినందనాలు" అర్పిస్తుంది.

'మనకింకా అగ్ని ప్రవేశాలేనా?' అనే 'నినాదం' కవితతో మొదలుపెట్టి, 'ఇస్త్రీవాడు' దగ్గర్నుంచి , 'ఇంటూ నలభై'(ఇప్పుడు డాలర్ విలువ అరవై పైనే)వరకు,అనేకానేక అంశాలను కవిత్వీకరించినా, ఆమెకవితల్లోమళ్ళీ మళ్ళీ వచ్చే బలమైనశక్తులు మూడు: పిల్లలు, అమ్మ, అతను. వారితోపాటున్న తన చిన్నప్రపంచమే ఆమె సిరి వెన్నెలవాడ. ప్రతి ఒక్కరికీ అంతే కదా! అదే ఆమె కవితాత్మసందేశం. అంచేతే ఆ అనుభూతి సాంద్రత.

కవిత్వం, వ్యక్తిత్వం పెనవేసుకొన్న 'అ ఆ ల ఆరామస్థలి' కె. గీతగారి కలానికి అప్పుడే పాతికేళ్ళు!!

★★★

వ్యాస కౌముది



# మనుచరిత్రలో ప్రతిబింబించిన సంస్కృతీ సంప్రదాయాలు

- డా(శ్రీమతి)ఎమ్.ప్రఫుల్ల

కావ్యం సమాజానికి ప్రతిబింబం. ఆయా కాలాలకు సంబంధించిన రచనల్లో ఆనాటి జనజీవితం, సంప్రదాయం, ఆచారవ్యవహారాలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. సంస్కృతీ సంప్రదాయాల్లో కాలానుగుణమైన మార్పు తప్పనిసరి. కాని మౌలికమయిన మార్పు ఉండదు. ఉదాహరణకు ఇంటికి వచ్చిన అతిధిని అర్ఘ్యపాద్యాదులతో సత్కరించడం ఒకనాటి ఆచారం. కాలానుగుణంగా ఇంటికి వచ్చిన వారిని గౌరవించడమన్న మౌలికసంప్రదాయం కనుమరుగు కాలేదు. ఇలాంటి మౌలికమయిన సంప్రదాయాలు భారతీయసాహిత్యంలో అన్నికాలాల్లోను కనిపిస్తూనే ఉంది.

తెలుగుపంచమహాకావ్యాల్లో ఒకటి అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రకావ్యం. పెద్దనకు భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల గౌరవం, అభిమానం ఎక్కువ. ఈ విషయం వారి కావ్యం లోని ప్రవరుని పాత్రచిత్రణలో స్పష్టమౌతుంది. గృహస్థధర్మం, నియమనిష్ఠలు, క్రమశిక్షణ, శీలము – అన్నీ కలబోసిన రూపమే ప్రవరుడు. మాతృదేవో భవ, పితృదేవో భవ అన్న వాక్యాలను తు. చ తప్పక ఆచరించిన వాడతడు. "సుఖులై తలిదండ్రులు కూడి దేవియు దేవర వోలె నుండ" అన్నమాటలే ఇందుకు ప్రమాణం. హిమాలయాల్లో కాలిపసరు కరిగిపోయి దారికానక తపించుచున్నపుడు

నను నిముసంబుగానక యున్న నూరెల్ల నరయు మజ్జనకుడెంత తడలునొక్కొ
యెపుడు సంధ్యలయందు నిలు వెళ్లనీక నన్నోమెడు తల్లి యెంతొఅలునొక్కొ

మ. చ. 2-17

అనుటలో వారి పట్ల ప్రవరునికి గల బాధ్యత తెలుస్తున్నది. తన రాకకై తల్లడిల్లు తలిదండ్రులగూర్చి వరూధినితో మాటలాడుచు " జననీజనకుల్ కడువృద్ధులాకటన్ సోలుచు చింతతో నెదురు సూచుచునుందురు" అనుటలో వారి ఆకలిదప్పులగూర్చి ప్రవరుడెంత ఆరాటపడినాడో తెలుస్తుంది.

ఏకపత్నీవ్రతాచరణం  నిజానికి భోగభాగ్యాలతో విలసిల్లుతున్న రాయలకాలం నాటి సమాజంలో దివ్విటీ పట్టుకొని వెతకాల్సిందే. అది ధార్మికచింతన గల పెద్దనకు నచ్చని విషయం. అందుకే ప్రవరునిపాత్ర ద్వారా అన్ని తరాలవారికి పవిత్రమైన గృహస్థధర్మాన్ని ఉపదేశించారు.

వాని  చక్కదనము వైరాగ్యమున జేసి
కాంక్ష సేయుజారకామినులకు
భోగబాహ్యమయ్యె పూచిన సంపెంగ
పొలుపు మధుకరాంగనలకు బోలె

మ. చ. 2 – 52

అనుటలో ప్రవరుని ఏకపత్నీవ్రతం నిరూపించబడింది. సాక్షాత్తుగా గంధర్వాంగన, వరూధిని తానై వలచి వచ్చినా "హా శ్రీ హరీ" ముఖంతిప్పుకొని పొమ్మని తొలగదోచినాడు. పరస్త్రీని తల్లివలె గౌరవించడం భారతీయసంప్రదాయం. "కమనీయ కౌతుకశ్రీవిధి కూకటుల్ గొలిచి చేసిన కూరిమి సోమి దమ్మ సౌఖ్యావహయై భజింప" అనుటలో చిన్నతనంలోనే తన ఇష్టానిష్టాలతో ప్రమేయం లేక పెద్దలు కూర్చిన పెండ్లి అనే విషయం స్పష్టం.  ఆమెకు భర్త మార్గాన్ననుసరించడమే వ్రతం. ఈ క్రింది పద్యమే ఇందుకు చక్కని ఉదాహరణ.

వండనలయదు వేవురు వచ్చిరేని
నన్నపూర్ణకునుద్దియౌ నతని గృహిణి
యతిథులేతేర నడికిరేయైన పెట్టు
వలయు భోజ్యంబులింటనవ్వారిగాగ.

మ. చ. 2 – 56

కేవలం వండిపెట్టడం కాదు. వేళాపాళలను కూడ లెక్కచేయక ,వచ్చినవారికి నచ్చిన పదార్థాలు వండిపెట్టే దొడ్డయిల్లాలు సోమిదమ్మ. అందుకే " అనుకూలవతి నాదు మనసులో వర్తించు కులకాంత మదినెంత కుందునొక్కొ" అని ప్రవరుడామెను గురించి ఆలోచించినాడు. "వ్రతులై దినములు గడిపెడు విప్రుల కామింపదగునే" అని వరూధినిని ప్రశ్నించగలిగినాడు.

ప్రవరునికి అతిథి, అభ్యాగతులపట్ల గౌరవమెక్కువ.      కేవలం అతిథిదేవో భవ అన్న సంప్రదాయాన్ని పాటించడం మాత్రమే కాదు. "అభ్యాగత సేవాపరతంత్రసకలజీవనుడై"నవాడతడు.

తీర్థసంవాసులేతెంచినారని విన్ననెదురుగానేగు దవ్వెంతయైన
నేగి తత్పదములకెఱగి యింటికి దెచ్చు దెచ్చి సద్భక్తినాతిథ్యమిచ్చు

నిచ్చి  యిష్టాన్నసంతృప్తులుగా జేయు జేసి కూర్చున్నచో చేరవచ్చు
..............................................................................

మ. చ. 1– 57

ఇదీ ప్రవరుని తీరు.  కేవలం ఇంటికి వచ్చినవాళ్ళకే కాదు, తీర్థయాత్రికులు వచ్చినారని తెలియగానే ఎంతదూరమయినా తానే స్వయంగా వెళ్ళి ఇంటికి పిలుచుకొని వచ్చేవాడు. వారికి ఇష్టమయిన పదార్థాలతో తృప్తిగా భోజనం పెట్టేవాడు.  "నేడు కదా మన్మందిరము

పవిత్రమయ్యె" నని ఆనందించేవాడు. ప్రవరుని వినయవిధేయతలకు, అహంకార రాహిత్యానికి, దానశీలతకు, భక్తిశ్రద్ధలకిది నిదర్శనం. హిమనగంలో దారి తప్పినపుడు "అతిథిసంతర్పణము లేమయ్యెనొక్కొ" అని వేదన చెందినాడు.

ప్రవరుని స్వధర్మానుష్ఠానంలో కూడ ఆనాడి సంప్రదాయం కళ్లముందు నిలుస్తుంది. ఆనాడు బ్రాహ్మణుల ప్రధానవృత్తి అధ్యయన, ఆధ్యాపనములు. యజ్ఞయాగాదులు వేదోక్తధర్మాలు. బ్రాహ్మీ ముహూర్తంలో సంధ్యావందనాది నిత్యజపతపాలాచరించడం సంప్రదాయం.

వరణాతరంగిణీ దరవికస్వర నూత్నకమలకషాయ గంధము వహించి
ప్రత్యూషపవనాంకురములు పైకొనువేళ వామనస్తుతిపరత్వమున నిద్రలేచి
సచ్ఛాత్రుడగుచు నిచ్చలు నేగి యయ్యేట నఘమర్షణస్నానమాచరించి
సాంధ్యకృత్యము దీర్చి సావిత్రి జపియించి సైకతస్థలి గర్మసాక్షి కెఱగి
ఫలసమిత్కుశకుసుమాది బహుపదార్థతతియు నుదికిమడుగుదోవతులుగొంచు
బ్రహ్మచారులు వెంటరా బ్రాహ్మణుండు వచ్చునింటికి ప్రజ మెచ్చిచూడ

మ. చ. 1 - 54

నదికి వెళ్ళి అఘమర్షణస్నానమాచరించి, సాంధ్యకృత్యమాచరించి, సమిత్ఫలకుసుమాదులు తీసికొని శిష్యసమేతముగా ఇంటికి తిరిగిరావడమాతని దినచర్య. నేటికాలంలో వృత్తి వర్ణాన్ని ఆశ్రయయించినది కాకపోయినా విధి పట్ల నియమనిష్ఠలు , భక్తిశ్రద్ధలు ఉండాలన్న విషయాన్ని బోధిస్తున్నది ప్రవరుని చరిత్ర. నియమనిష్ఠలకు భంగమేర్పడినపుడు ఆతని వేదన వర్ణనాతీతము. ఇంతటి క్రమశిక్షణ కలవాడు కనుకనే "తోడునీడలై క్రీడించు సచ్ఛాత్రులింతకు నెంత చింతింతురొక్కొ" అని "యగ్నులేమయ్యెనొక్కొ నిత్యంబులైన కృత్యములబాపి దైవంబ ! కినుకనిట్లు పారవైచితె" అని దిగులుపడినాడు.

మనుచరిత్ర రసదృష్ట్యా శృంగారప్రబంధమనుట నిర్వివాదాంశం. "ధర్మావిరుద్ధో భూతేషు కామోऽస్మి భరతర్షభ" అన్నాడు కృష్ణభగవానుడు. కావ్యంలో శృంగారం పేరిట ప్రవరుని నిష్ఠకు భంగం కలగలేదు. సంప్రదాయం, నియమనిష్ఠల పేరిట వరూధిని శృంగారజీవితము భంగపడలేదు. ఈ విధంగా సంప్రదాయానికి పెద్దపీటే వేశాడు పెద్దనార్యుడు. మనుచరిత్ర ఆనాటి నుండి నేటివరకు కొనసాగుతున్న సంప్రదాయానికి అద్దం పడుతూంది.

★★★

వ్యాస కౌముది



# తెలుగులో చారిత్రక నవల

- డా.శిరీష

సాహిత్య ప్రక్రియలలో ఒకటైన నవలా ప్రక్రియ క్రీ.శ. పంతొమ్మిదవ శతాబ్ది చివరి భాగంలో ప్రారంభమైంది. నవల సమాజంలోని వ్యక్తుల జీవనానికి ప్రతిబింబం. సమకాలీన మానవ జీవితాల్ని అత్యంత దగ్గరగా చూడగలిగేది నవల. ఈ నవలా ప్రక్రియలో కూడా పలు వర్గాలున్నాయి. వాటిని *తెలుగు విజ్ఞాన సర్వస్వం* లో ఏడు రకాలుగా వర్గీకరించారు. అవి '1. చారిత్రక నవలలు 2. సాంఘిక నవలలు 3. రాజకీయ నవలలు 4. హాస్య ప్రధానమైన నవలలు 5. మనోవిజ్ఞాన సంబంధమైన నవలలు 6. మనస్తత్వ శాస్త్ర సంబంధమైన నవలలు 7. అపరాధ పరిశోధక నవలలు ( విజ్ఞాన సర్వస్వం- నాల్గవ విభాగం, పుట 876-882). ఈ వర్గీకరణలో మొదటివిభాగం చారిత్రక నవలలు గూర్చి ప్రస్తుత వ్యాసంలో వివరిస్తున్నాను.

**చారిత్రక నవల**

నవలా ప్రక్రియలో భాగమైన చారిత్రక నవలాప్రక్రియ కూడా అతి పురాతనమైంది. ఎందుకంటే క్రీ.శ. పంతొమ్మిదవ శతాబ్ది చివరిభాగంలో చారిత్రక నవలా రూపంతోనే తెలుగు నవలా ప్రక్రియ ప్రారంభమైంది. చారిత్రాకాంశం బీజంగా కలిగిన నవలా సాహిత్యాన్ని చారిత్రక నవల అంటారు. గత చరిత్రను ఇతివృత్త రూపంలో చూపుతుంది. కథాకాలం గతంలో ఉండి ఆనాటి స్థితిగతులను ప్రతిబింబించేదిగా ఉంటుంది. చారిత్రక ఇతివృత్తానికి, సంఘటనలకు కల్పనలను జోడించి సజీవంగాను, ఆకర్షణీయంగాను రచిస్తే చారిత్రక నవల అవుతుంది. ఈ చారిత్రక నవలలో చరిత్రలోని యధార్థ సంఘటనల సమ్మేళనము కనిపిస్తుంది. అంతేగాకుండా చరిత్రతో పాటు ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను తెలుపుతుంది. ఈ సందర్భంలో చరిత్రకు, చారిత్రక నవలకు గల వ్యత్యాసాల్ని ముందుగా చెప్పుకోవాలి.

**చరిత్ర – చారిత్రక నవల**

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన చరిత్ర గల దేశం భారతదేశం. దేశ చరిత్ర పుస్తకాలలో కేవలం ఆయా కాలాల్లోని రాజుల పరిపాలన గూర్చి చరిత్రకారుడు చెబుతాడు. కాని చారిత్రక నవలాకారుడు ఆయా కాలాల్లోని చరిత్రను చెబుతూ, చరిత్రతో పాటు రసవత్తరమైన

కథను నడిపిస్తాడు. ఆకాలంలోని సంస్కృతి, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, మనుషుల జీవన విధానాలు, సంప్రదాయాలు అన్నింటి గూర్చి తెలియజేస్తాడు. అంతేగాకుండా ఒక జాతి సంస్కృతీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను చారిత్రక నవల చెప్పినంతగా చరిత్ర చెప్పదు.

ఒక యుగానికి లేదా కాలానికి, ప్రాంతానికి సంబంధించిన సమస్త విషయాలు చరిత్రలో రాస్తాడు. చరిత్రలో జరిగిపోయిన విషయాలు, వాటి చారిత్రక విలువల్ని బట్టి వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. చరిత్రకారుడు జరిగింది జరిగినట్లు రాస్తాడు. చరిత్రలోని వ్యక్తులు, సంఘటనలు పరిమితంగా ఉంటాయి. చారిత్రక నవలాకారుడు చరిత్రలోని ఏదో ఒక సంఘటనను తీసుకుని ఈ విధంగా జరిగి ఉండవచ్చునని ఊహించి రాస్తాడు. చారిత్రక నవలాకారుడు పాఠకులు ఆలోచించడానికి ఆస్కారం, అవకాశం కలిగిస్తాడు. చరిత్రలోని సత్యం, చైతన్యం నవలలోని కల్పనల సమ్మేళనమే చారిత్రక నవల.

**చారిత్రక నవల నిర్వచనాలు**

చారిత్రక నవల అంటే ఏమిటో మరింత స్పష్టంగా అవగతమవడానికి కొంతమంది చారిత్రక నవలాకారులు చెప్పిన నిర్వచనాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

**నోరి నరసింహశాస్త్రి**

"చరిత్రాత్మక నవల అనేది రెండు విరుద్ధ శబ్దాల సమ్మేళనమనే భ్రాంతి కలిగిస్తుంది. జరిగినదంతా వ్రాసుకుంటూ పోతే చరిత్ర కాదు. లోకానికో, దేశానికో, సంఘానికో, వ్యక్తికో, మంచికో, చెడుకో ప్రభావం కలిగించే సంఘటనలు వ్రాస్తేనే చరిత్ర. దానితో అనుగుణమైన కల్పన జోడిస్తే చరిత్రాత్మక నవల అవుతుంది. దానికి చరిత్ర బీజముంటే చాలును అంటారు." (ఈమాట/ *ఆంధ్రభాషలో చరిత్రాత్మక నవల* /జూలై, 2012.)

**పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు**

జరిగిపోయిన ఒకానొక చారిత్రక సంఘటనను గ్రహించి, దానిని ఆత్మగా చేసుకుని దాని చుట్టూ పెక్కు అద్భుత సంఘటనలతో, పవిత్ర సన్నివేశాలతో కథాకథన దక్షతతో రచించిన మహత్తర గ్రంథమే చారిత్రక నవల అన్నారు.

**డా. బెజవాడ గోపాలరెడ్డి**

నోరి నరసింహశాస్త్రిగారి *ధూర్జటి* నవల భాషాంతరీకరణకు ప్రస్తావన రాస్తూ చారిత్రక నవల అంటే "చరిత్రకు సత్యము కావలె. నవలకు కల్పనతో కూడిన సౌందర్యమవసరము. చారిత్రక నవల సత్య సౌందర్యముల సమ్మేళనము" అన్నారు.

**A.c. ward**

"A historical Novel is an imaginative recreation of a remote period"

**Ernest. E. Leisy**
"A Historical Novel is a novel, the action of which is laid in an earlier time" .

### చారిత్రక నవలాకారుడు

చరిత్ర చారిత్రక నవలాకారునికి కేవలం సామగ్రిని మాత్రం అందిస్తుంది. అతడు ఏ కాలం నాటి సంఘటనలను, కథను గ్రహిస్తాడో ఆ కాలం నాటి సంఘటనలు, జీవితవిధానం, ఆచార వ్యవహారాలు, సామాజిక ధార్మిక పరిస్థితులు మొదలైన వాటిని చారిత్రక నవలలో చూపిస్తాడు. చరిత్ర అందించిన సామగ్రిని తన ఇష్టం వచ్చిన రీతిలో మలచుకుంటాడు. ఈ ప్రయత్నంలో కొత్త పాత్రలను, సన్నివేశాలను సృష్టిస్తాడు. అవి చరిత్రకు విరుద్ధంగా ఉండకుండా చూసుకుంటాడు. అలాగే చారిత్రక సంఘటనలకు, వాటి చుట్టూ కల్పించిన కల్పనలకు మధ్య సమన్వయం కుదుర్చుతాడు. చరిత్ర అస్పష్టంగానూ, లేదా అసంపూర్ణంగానూ లభిస్తే దానికి సమన్వయం కుదిర్చేందుకు, ప్రధాన పాత్రను ముందుకు నడిపేందుకు అప్రధాన పాత్రలను ఎంచుకుంటాడు. ఆధునిక మానవజీవితంలోని జీవిత పాత్రలను కల్పనశక్తితో ప్రాచీన పాత్రలకు అన్వయింపజేస్తాడు. ఆనాటి దేశకాల పరిస్థితులను నవలలో ప్రతిబింబింపజేస్తాడు.

సమకాలీన సమాజాన్ని సంస్కరించి ఉన్నతంగా చేయడానికి గతకాలం నాటి ఆదర్శాలను, గౌరవంగా జీవించే విధానాన్ని, చరిత్రలోని మహాపురుషుల జీవితాలు, నీతి, సదాచారం మొదలైన వాటిని మనముందుంచి మన ప్రవర్తనను చక్కదిద్దుతాడు. పాఠకుడు చరిత్రలోని విషయాలను చదివి అవగాహన చేసుకుని తన జీవితాన్ని గౌరవ ప్రదంగాను, ఆదర్శ ప్రాయంగాను తీర్చిదిద్దుకునేటట్లు చేయడానికి ప్రయత్నిస్తాడు. జాతి ఔన్నత్యం, ఆ దేశ ప్రజల దేశభక్తి జాతీయతా భావాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రజలలో ధైర్య సాహసాలను, దేశభక్తిని, కార్యదీక్షను, జాతీయ భావాన్ని పురికొల్పడమే చారిత్రక నవలాకారుని ముఖ్య ఉద్దేశం.

### చారిత్రక నవలల ప్రయోజనం

చారిత్రక నవలల్లో పేర్కొనదగిన ముఖ్య విషయం గూర్చి రాచమల్లు రామచంద్రారెడ్డిగారు 'నవలల్లో చరిత్ర తన గత చరిత్రే అని పాఠకునికి అనుభూతి కావాలి అన్నారు. అటువంటి అనుభూతి కలిగినపుడే పాఠకునిలో తన పూర్వుల చరిత్రను గూర్చి గర్వపడడం, చరిత్రలోని వీరపురుషుల సాహసాన్ని అభినందించడం తన దేశాన్ని ప్రశంసించడం మొదలైన భావాలు ఉత్పన్నమవుతాయి. అప్పుడే చారిత్రక నవలారచన ప్రయోజనం నెరవేరుతుంది' దేశంకోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శత్రురాజులతో పోరాడి, దేశాన్ని శత్రువుల బారినుండి కాపాడడం వంటి సన్నివేశాల వల్ల ప్రజలలో ఐకమత్యాన్ని పెంచి, వారిలో దేశాభిమానాన్ని, భక్తిని పెంపొందింప చేయవచ్చు. ప్రాచీన వీరుల శౌర్యం, పరాక్రమం, రాష్ట్రీయ భావన, దేశంకోసం ఆత్మాహుతి కావడం, మొదలైన విషయాలను నవలలో చిత్రించడం వలన ప్రజలలో దేశాభిమానం పెంపొందించడానికి అవకాశం ఉంటుంది. చరిత్రలోని వ్యక్తుల ఆదర్శ భావాలను నవలలో చూపించడం ద్వారా సమాజంలోని మనుషులు వాటిని పాటించే అవకాశం ఉంటుంది. గతకాలపు మంచిని స్వీకరించి చారిత్రక నవల రాయడం ద్వారా పాఠకుల్ని

మంచివైపు ప్రేరేపించవచ్చు. అలాగే దానికి భిన్నంగా ఆనాటి చెడు కార్యాలు చారిత్రక నవలలో వెల్లడిం చి అలాంటి కార్యాలు చేయకూడదనే నీతిని బోధించవచ్చు. ప్రజలలో మానవతా దృక్పథాన్ని , దేశభక్తిని, జాతీయ సమైక్యతను చారిత్రక నవలల ద్వారా కలిగించవచ్చు.

**ముగింపు**

సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపించడమే సాహిత్యం యొక్క ప్రధాన ప్రయోజనం. ఆధునిక యుగంలో సమాజానికి ఒక సందేశాన్ని అందించి ఉన్నత మార్గాన్ని నిర్దేశించే సాహిత్య ప్రక్రియలలో చారిత్రక నవల అత్యంత ప్రధానమయ్యింది. చారిత్రక నవలల ద్వారా చారిత్రాకాంశాలు అందరికి తెలుస్తాయి. అంతేగాకుండా సమగ్ర మానవజీవితం కనిపిస్తుంది. చారిత్రక నవలాకారులంతా పూర్వచరిత్రను అన్వేషించి, చారిత్రక ప్రదేశాలు సందర్శించి, చరిత్రకు అవసరమైన మేరకు కల్పనలు జోడించి చారిత్రక నవలలు రాశారు. వీరి కృషి అమోఘనీయం.

**ఉపయుక్త గ్రంథసూచి**


1. నరసింహశాస్త్రి, నోరి. 1986. *ధూర్జటి.* క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ.

2. -------- .జూలై, 2012. *ఆంధ్రభాషలో చరిత్రాత్మక నవల.*/ ఈమాట.కామ్. (eemaata. com/em/issues/201207/1977. html)

3. నాగభూషణ శర్మ, మొదలి. 1971. *తెలుగు నవలా వికాసం.* ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్. సికిందరాబాద్.

4. వేంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. *తెలుగు నవలా సాహిత్య వికాసం.*

5. సోమశేఖర శర్మ, మల్లంపల్లి (సంపాదక వర్గం). 1959. *విజ్ఞాన సర్వస్వం (1-4 సం).* తెలుగు భాషా సమితి, హైదరాబాద్.
6. Leisy, E. Ernest – American Historical Novel
7. Ward, A.C. 1972. Foundation of English Prose : E.C.D's London.


★★★★★